సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 143

SUNDAY Special | ఆదివారం 13-8-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



విపక్షాలు పారిపోయాయి: మోదీ

'మణిపూర్‌పై లోక్‌సభలో చర్చించకుండా మణిపురీలకు ద్రోహం చేశాయి. స్వార్థ రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చాయి.

- వివరాలు 6లో



'ఆసియా' విజేత భారత్

చెన్నైలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ హాకీ ఫైనల్లో 4–3 గోల్స్‌తో మలేసియాపై భారత్ విజయం సాధించింది. భారత్ ఈ టోర్నీ గెలవడం నాలుగోసారి.

- వివరాలు 12లో



బిల్లుల లొల్లి.. మళ్లీ!

రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మధ్య పెండింగ్ బిల్లుల జగడం మళ్లీ రాజుకుంటోంది.

- వివరాలు 2లో



ప్రధానిని కించపరచలేదు..

మణిపూర్ హింసపై మోదీ మాట్లాడనందుకే నీరవ్ అనే మాట వాడానని.. ప్రధానిని కించ పరచడానికి కాదని అధిర్ రంజన్ వివరించారు.

- వివరాలు 6లో



కామెడీగా మార్చేస్తారా?

మణిపూర్ హింసాకాండ వంటి తీవ్రమైన సమస్యను ప్రధాని మోదీ నవ్వులాటగా మార్చేశారని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు.

- వివరాలు 6లో



ఢిల్లీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

ఢిల్లీలో ప్రభుత్వ అధికారుల బదిలీలపై కేంద్రానికి అధికారం కల్పించే వివాదాస్పద ఢిల్లీ సర్వీసు బిల్లు చట్టంగా మారింది.

- వివరాలు 6లో

17 తర్వాత ఎప్పుడైనా..

బీఆర్ఎస్ జంబో లిస్ట్

ఎన్నికల పోరుకు రంగం సిద్ధం చేస్తున్న సీఎం కేసీఆర్

ఫామ్‌హౌస్‌లో కేటీఆర్, హరీశ్‌తో సుదీర్ఘంగా మంతనాలు

- అభ్యర్థులు, పార్టీ, ప్రభుత్వపరమైన అంశాలపై చర్చ
- తొలి జాబితాలో 80-90 మంది అభ్యర్థుల పేర్ల ప్రకటనకు నిర్ణయం
- చాలా వరకు సిట్టింగ్‌లకే సీట్లు.. గజ్వేల్ నుంచే కేసీఆర్ పోటీ!
- పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట్ల అభ్యర్థులపైనా స్పష్టత ఇచ్చే చాన్స్
- షెడ్యూల్ వచ్చే నాటికి రెండో జాబితా
- వామపక్షాలతో పొత్తుపై నిర్ణయం కూడా అప్పుడే!
- ఈ నెల 19న మెదక్, 20న సూర్యాపేటలో కేసీఆర్ పర్యటనలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ కొట్టే దిశగా భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కార్యాచరణను వేగవంతం చేశారు. పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై కసరత్తు పూర్తి చేసిన ఆయన.. ఈ నెల 17వ తేదీ తర్వాత ఏ క్షణమైనా లిస్టును ప్రకటించనున్నట్టు తెలిసింది. సీఎం పెద్ద సంఖ్యలో అభ్యర్థులతో జంబో జాబితా ప్రకటించనున్నారని.. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకు గాను ఈ తొలి జాబితాలోనే కనీసం 80–90 మంది అభ్యర్థుల పేర్లు ఉండే అవకాశముందని బీఆర్ఎస్‌లోని విశ్వసనీయ వర్గాల సమాచారం. తొలి జాబితాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యతనిస్తూ.. దుబ్బాక, సికింద్రాబాద్ కంటోన్మెంట్ వంటి పలు స్థానాల్లో అభ్యర్థులపై స్పష్టత ఇవ్వనున్నట్టు తెలిసింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి రెండో జాబితాను ప్రకటించడంతోపాటు వామపక్షాలతో పొత్తుపై తుది నిర్ణయాన్ని సీఎం కేసీఆర్ ప్రకటిస్తారని సమాచారం. ఇక కాంగ్రెస్‌కు చెందిన ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే ఈ నెల 17న లేదా 18న బీఆర్ఎస్‌లో చేరడం దాదాపు ఖాయమైందని.. తొలి జాబితాలో ఆ ఎమ్మెల్యే పేరు కూడా ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. సీఎం కేసీఆర్ మరోమారు గజ్వేల్ నుంచే పోటీ చేయడం కూడా ఖాయమైనట్టు పేర్కొన్నాయి.



కేటీఆర్, హరీశ్‌లతో సుదీర్ఘ మంతనాలు

గత మూడు రోజులుగా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బస చేసిన కేసీఆర్.. అభ్యర్థుల ఎంపిక, పార్టీ ఎజెండా, మేనిఫెస్టో, ప్రచార వ్యూహం ఖరారు వంటి అంశాలపై లోతుగా కసరత్తు చేసినట్టు తెలిసింది. శనివారం యాదాద్రి జిల్లా పోచంపల్లి పర్యటనలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, సంగారెడ్డి జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి హరీశ్‌రావు ఇద్దరూ సీఎం కేసీఆర్ నుంచి పిలుపు రావడంతో సాయంత్రానికల్లా ఫామ్‌హౌజ్‌కు చేరుకున్నారు. వీరంతా శనివారం అర్ధరాత్రి వరకు సుదీర్ఘంగా మంతనాలు

మిగతా 5వ పేజీలో ▶

గ్రూప్-2 పరీక్షలు నవంబర్‌కు వాయిదా

- అభ్యర్థుల సౌకర్యార్థం వాయిదా వేసిన ప్రభుత్వం
- సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు టీఎస్‌పీఎస్సీతో సంప్రదింపులు జరిపిన సీఎస్
- అనంతరం పరీక్ష వాయిదా వేస్తున్నట్లు ప్రకటన
- ట్విట్టర్‌లో వెల్లడించిన మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలన్న అభ్యర్థుల డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు పలికింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్షలను నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈమేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సూచనలు చేశారు. గ్రూప్–2 పరీక్షను వాయిదా వేసే అంశంపై టీఎస్‌పీఎస్సీ యంత్రాంగంతో సంప్రదింపులు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మిగతా పరీక్షలకు అభ్యర్థులు సన్నద్ధమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వివరాలను ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ శనివారం రాత్రి ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. అనంతరం ఈనెల 29, 30 తేదీల్లో జరగాల్సిన గ్రూప్–2 పరీక్షలను టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసిందని, వాటిని నవంబర్‌లో నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

అభ్యర్థుల ఆందోళనకు చెక్

ఈనెల 29, 30వ తేదీల్లో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ (తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ఐదు నెలల క్రితమే తెలిపింది. కమిషన్ షెడ్యూల్ ఆధారంగా ఆగస్టులో గురుకుల ఉద్యోగ అర్హత పరీక్షలకు గురుకుల బోర్డు సన్నద్ధమై పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించి నిర్వహిస్తోంది. వరుసగా ఆగస్టు 1 నుంచి 23 వరకు పరీక్షలు నిర్వహిస్తుండటం... ఆ తర్వాత 29, 30తేదీల్లో 5.35 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యే గ్రూప్–2 పరీక్షలుండటంతో అభ్యర్థులపై ఒత్తిడి తీవ్రమవుతుందనే వాదన తెరపైకి వచ్చింది. ఈక్రమంలో పలు రకాలుగా కమిషన్‌కు వినతులు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇదే సమయంలో కమిషన్ కార్యాలయ ముట్టడికి సైతం అభ్యర్థులు దిగడం... అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం... మరోవైపు కొందరు అభ్యర్థులు న్యాయపోరాటానికి సైతం ఉపక్రమించడంతో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంది. పరీక్ష నిర్వహణను వాయిదా వేయడంతో అభ్యర్థుల ఆందోళనకు చెక్ పడింది.

ప్రవీణ్‌కుమార్ హౌస్ అరెస్టు

- గ్రూప్–2 పరీక్షలు రద్దు చేయాలంటూ బీఎస్పీ రాష్ట్ర చీఫ్, ఆ పార్టీ నేతలు తలపెట్టిన దీక్ష భగ్నం
- గన్‌పార్కు వద్ద నిరసనకారుల నిర్బంధం
- టీఎస్‌పీఎస్సీలో కొందరు దొంగలను సీఎం కేసీఆర్ నియమించారని ప్రవీణ్ ఆరోపణ

- వివరాలు 3లో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న షబ్బీర్ అలీ, రేవంత్, మాణిక్‌రావ్ ఠాక్రే

తిరగబడదాం.. తరిమి కొడదాం

- పోరాట నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నగారా
- బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజాకోర్టుల నిర్వహణ
- 16 అంశాలతో బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజా చార్జిషీట్
- పోరాటాల్లో ప్రజలను భాగస్వాములను చేసేలా ప్రణాళికలు
- 'మోదీ–కేసీఆర్ తోడు దొంగలు' అంటూ పోస్టర్లు
- ప్రచార కార్యక్రమ షెడ్యూల్‌ను విడుదల చేసిన టీపీసీసీ
- కాళోజీ స్ఫూర్తితో పోరాడుతాం: రేవంత్‌రెడ్డి

2లో

ఇళ్లు ఇస్తావా? గద్దె దిగుతావా?

- పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లపై తొమ్మిదేళ్ల నుంచి నాన్చుడేనా?
- సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఫైర్
- ఈ అవినీతి, నియంతృత్వ పాలనను అంతమొందిస్తాం
- ఇళ్లపై ఈనెల 16, 17 తేదీల్లో బస్తీ సమావేశాలు నిర్వహిస్తాం
- 23, 24 తేదీల్లో కలెక్టర్ల కార్యాలయాల ముందు ధర్నాలు
- సెప్టెంబర్ 4న విశ్వరూప ధర్నాతో సీఎం కళ్లు తెరిపిస్తాం
- రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజన్ ప్రభుత్వమేనని వ్యాఖ్య
- పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలంటూ ఇందిరాపార్కు వద్ద బీజేపీ ధర్నా

2లో



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ఫాక్స్‌కాన్ పెట్టుబడి మరో రూ. 3,318 కోట్లు



తైవాన్‌కు చెందిన మాన్యుఫ్యాక్చరింగ్ దిగ్గజ సంస్థ ఫాక్స్‌కాన్ గ్రూప్ రాష్ట్రంలో మరో రూ.3,318 కోట్ల (400 మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు భారత్‌లో ఫాక్స్‌కాన్ ప్రతినిధి వీ లీ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టును ధ్రువీకరిస్తూ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. - వివరాలు 3లో

ఐదుగురు రాష్ట్ర పోలీసులకు జాతీయ పురస్కారాలు

అత్యుత్తమ నేర పరిశోధన చేసిన 140 మంది పోలీసు అధికారులను 2023కుగాను కేంద్ర హోంమంత్రి పతకానికి ఎంపిక చేశారు. ఈ ఏడాది తెలంగాణ నుంచి ఐదుగురు, ఏపీ నుంచి ఐదుగురు పోలీసు అధికారులు ఈ పతకాలకు ఎంపికయ్యారు. -వివరాలు 13లో

మన అండ లేకుండా ఎవరూ ప్రధాని కాలేరు



- కేంద్రం మెడలు వంచే దమ్మున్న నేత కేసీఆర్
- అలాంటి దమ్మున్న నాయకుడిని గెలిపించుకోవాలి
- చేనేత రుణ మాఫీ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాం
- సహకార ఎన్నికలు కూడా జరిపిస్తాం.. చేనేతపై 5 శాతం జీఎస్టీ రద్దు కావాలంటే మోదీ సర్కారు గద్దె దిగాలి
- పోచంపల్లి చేనేత సభలో మంత్రి కేటీఆర్

- వివరాలు 2లో

10 రోజులు.. రూ.14,324 కోట్లు

- సర్కార్ ఖజానాకు భారీ ఆదాయాన్నిచ్చిన హెచ్‌ఎండీఏ
- కోకాపేట్ నియో పోలిస్ భూములపై రూ.3,319 కోట్లు
- బుద్వేల్ భూముల ద్వారా రూ.3,625.73 కోట్లు
- ఔటర్‌రింగ్ రోడ్డు లీజు మొత్తం రూ.7,380 కోట్లు
- తాజాగా లీజు మొత్తాన్ని చెల్లించిన ఐఆర్‌బీ
- ఇక ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ పరిధిలోకి ఔటర్

- 5లో





శనివారం హైదరాబాద్‌లో సభకు హాజరైన ఉద్యోగులు. (ఇన్‌సెట్)లో స్థితప్రజ్ఞ

"సీపీఎస్ రద్దు- ఓపీఎస్ అమలు" ఇదే మా నినాదం.. పోరాటం

- నాంపల్లిలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ బహిరంగసభ
- ఎన్నికలకు ముందే సీపీఎస్ రద్దు చేయాలి
- ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్
- సీపీఎస్ రద్దు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వం...
- నిధులు ఇవ్వాల్సింది కేంద్రమని స్పష్టీకరణ - 13లో



ఇదండీ సంగతి



..మరీ రెచ్చిపోకండి సార్! పరిస్థితులు బాగోలేవ్!





బిల్లుల లొల్లి.. మళ్లీ!

గవర్నర్ వద్ద నిలిచిపోయిన 12 బిల్లులు

అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపినవి నాలుగు..
కొత్తగా పాస్ చేసిన ఎనిమిది బిల్లులు పెండింగ్
వీటిలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లు కూడా..
ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులపైనా నిర్ణయం తీసుకోని గవర్నర్
మళ్లీ సుప్రీంకోర్టు తలుపుతట్టే యోచనలో సర్కారు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మధ్య పెండింగ్ బిల్లుల జగడం మళ్లీ రాజుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, మండలిలో 12 బిల్లులను పాస్ చేసి గవర్నర్ తమిళిసై ఆమోదం కోసం పంపించగా.. వారం రోజుల నుంచి రాజ్‌భవన్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్టీసీ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ఉద్దేశించిన టీఎస్‌ఆర్టీసీ చట్ట సవరణ బిల్లు–2023 కూడా వీటిలో ఉంది. గవర్నర్ ఆమోదించాక, ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్లను జారీ చేశాక ఈ బిల్లులు చట్టరూపం దాల్చి, అమల్లోకి రానున్నాయి.

రెండోసారి పంపినా నిరీక్షణ

గవర్నర్ తమిళిసై గతంలో తిప్పి పంపిన 3 బిల్లులు, తిరస్కరించిన మరో బిల్లుతో కలిపి మొత్తం 4 బిల్లులను ప్రభుత్వం ఇటీవల రెండోసారి అసెంబ్లీలో ఆమోదించింది. వీటితోపాటు మరో 8 కొత్త బిల్లులను సైతం ఆమోదించి.. మొత్తం 12 బిల్లులను రాజ్‌భవన్‌కు పంపింది. వీటి విషయంలో గవర్నర్ కార్యాలయం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. గవర్నర్ తిప్పి పంపిన బిల్లులను అసెంబ్లీ మళ్లీ ఆమోదించి పంపిస్తే.. గవర్నర్ ఆమోదించక తప్పదని రాజ్యాంగంలోని నిబంధనలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు సదరు నాలుగు బిల్లులను ఆమోదించడం తప్ప గవర్నర్‌కు గత్యంతరం లేదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. మరికొన్ని రోజులు గవర్నర్ స్పందన కోసం నిరీక్షించిన అనంతరం.. పెండింగ్ బిల్లుల వ్యవహారంపై మరోసారి సుప్రీం కోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. రెండు నెలల్లో శాసనసభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండటంతో.. ఆలోగానే బిల్లులను అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

ఎమ్మెల్సీ అభ్యర్థులపై 'పరిశీలన'!

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎరుకల సామాజికవర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణ, బలహీన వర్గాల నుంచి దాసోజు శ్రవణ్‌లను నామినేట్ చేయాలని రాష్ట్ర కేబినెట్ గత నెల 31న తీర్మానం చేసి పంపినా.. గవర్నర్ తమిళిసై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎమ్మెల్సీలుగా నియమించేందుకు వారికి ఉన్న అర్హతలను గవర్నర్ పరిశీలిస్తున్నారని రాజ్‌భవన్ వర్గాలు చెప్తున్నాయి. ఈ ఇద్దరు నేతలు గతంలో కొంతకాలం బీజేపీలో పనిచేసి.. తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరినవారే. గతంలో కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా నామినేట్ చేసేందుకు గవర్నర్ సమ్మతించకపోవడం నేపథ్యంలో.. ప్రస్తుతం ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

నెలల తరబడి పరిశీలనలోనే..!

పెండింగ్ బిల్లులపై గవర్నర్ తమిళిసై న్యాయ సలహా కోరినట్టు సమాచారం. బిల్లులు రాజ్యాంగబద్ధంగా ఉన్నాయా? లేదా? అన్న అంశంపై పరిశీలన కోసం తనకు అవసరమైనంత సమయం తీసుకుంటానని గవర్నర్ గతంలో పలుమార్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో నెలల తరబడి బిల్లులు రాజ్‌భవన్ 'పరిశీలన'లో ఉండిపోతున్నాయి.

రాజ్‌భవన్‌లో ఉన్న బిల్లులు ఇవీ..

రెండోసారి ఆమోదించి పంపినవి..

- తెలంగాణ మున్సిపల్ బిల్లు–2022
- తెలంగాణ ప్రైవేటు వర్సిటీల బిల్లు–2022
- రాష్ట్ర పంచాయతీరాజ్ బిల్లు–2023
- తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్ యాన్యుయేషన్) బిల్లు–2022

తొలిసారిగా ఆమోదించి పంపినవి..

- తెలంగాణ పంచాయతీరాజ్ (మూడో సవరణ) బిల్లు – 2023
- తెలంగాణ మున్సిపాలిటీల (రెండో సవరణ) బిల్లు–2023
- తెలంగాణ ఆర్టీసీ బిల్లు (సర్కారులో ఉద్యోగుల విలీనం) – 2023
- తెలంగాణ పంచాయతీరాజ్ (రెండో సవరణ) బిల్లు–2023
- తెలంగాణ జీఎస్టీ చట్ట సవరణ బిల్లు–2023
- తెలంగాణ స్టేట్ మైనారిటీస్ కమిషన్ బిల్లు–2023
- ఫ్యాక్టరీల చట్ట సవరణ బిల్లు–2023
- టిమ్స్ వైద్య సంస్థల బిల్లు–2023

క్లుప్తంగా...

అవినీతి పాలనకు చిరునామా కాంగ్రెస్, బీజేపీ

మంత్రి కేటీ రామారావు ట్వీట్

సాక్షి, హైదరాబాద్: దేశంలో అసమర్థ, అవినీతి ప్రభుత్వాలకు కాంగ్రెస్, బీజేపీ రెండూ చిరునామా లాంటివని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఎద్దేవా చేశారు. బీజేపీని భ్రష్టాచార్ జనతా పార్టీ అని, ఏఐసీసీని అఖిల భారత కరప్షన్ కమిటీగా అభివర్ణించారు. శనివారం రాత్రి ట్విట్టర్ వేదికగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తీరును కేటీఆర్ విమర్శించారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో కాంగ్రెస్, బీజేపీలు తోడు దొంగల్లా దేశాన్ని దోచుకున్నాయని తెలిపారు. రెండు పార్టీల దశాబ్దాల పాలన వైఫల్యమే దేశం, రాష్ట్రానికి శాపమై వెంటాడుతోందని పేర్కొన్నారు. తమ పార్టీ తెలంగాణ రైతులకు రిష్తేదార్ అని, ప్రజలకు వఫాదార్ అని.. సీఎం కేసీఆర్‌ను ఇమాన్‌దార్‌గా అభివర్ణించారు. తమ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా జిమ్మేదార్ పాలన సాగిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు.

వందరోజుల పాటు చట్టసభల సమావేశాలు

రాజ్యాంగ సవరణకు కృష్ణయ్య సూచన



కాచిగూడ (హైదరాబాద్): అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు ఏటా 100 రోజులు జరిగేలా రాజ్యాంగాన్ని సవరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కొద్దిరోజులు జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు.. ప్రజా సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవడానికి ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. బీసీల సమస్యలపై వివిధ రూపాల్లో ఢిల్లీలో 24 రోజుల పాటు చేసిన పోరాటం పూర్తి స్థాయిలో విజయవంతమైందన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి కోళ్లపల్లి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిటీ భేటీ

హాజరుకానున్న స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశం సోమవారం గాంధీభవన్‌లో జరగనుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఖరారు ప్రక్రియలో భాగంగా పార్టీ హైకమాండ్ అధికారికంగా ప్రకటించిన అనంతరం తొలిసారి ఈ పీఈసీ భేటీ జరగనుంది. ఈ సమావేశానికి ఏఐసీసీ నియమించిన స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ హాజరు కానున్నారని, పీఈసీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని పార్టీ అభ్యర్థుల ఖరారుకు సంబంధించిన వ్యూహాలపై చర్చిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

21వ అంతస్తు నుంచి దూకి యువతి ఆత్మహత్య

గచ్చిబౌలి: ల్యాంకోహిల్స్‌లో 21వ అంతస్తు నుంచి దూకి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ చంద్రశేఖర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. కాకినాడ జగ్గంపేటకు చెందిన పోలపల్లి కృష్ణ జీవనోపాధి కోసం బంజారాహిల్స్‌లోని షౌకత్ నగర్‌కు వలస వచ్చి హౌస్‌కీపింగ్ పనులు చేస్తున్నాడు. కృష్ణ కూతురు బిందుశ్రీ (28) పదేళ్లుగా మణికొండ ల్యాంకోహిల్స్‌లో–15 ఎల్‌హెచ్ 2104లో నివాసం ఉంటున్న పూర్ణచంద్ ఇంట్లో పని మనిషిగా చేస్తోంది. హైఎండ్ హోం థియేటర్స్ బిజినెస్ చేసి కాకినాడకు చెందిన పూర్ణచంద్ ఇంట్లోనే సర్వెంట్ రూమ్‌లో బిందుశ్రీ ఉంటోంది. శనివారం తెల్లవారు జామున ఫోన్ మాట్లాడుకుంటూ వాష్ ఏరియా నుంచి బిందుశ్రీ కిందికి దూకడంతో తల ఛిద్రమై మృతి చెందింది. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వెంటనే పూర్ణచంద్‌కు సమాచారం ఇచ్చారు. రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తన కూతురు మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె తండ్రి కృష్ణ పేర్కొన్నారు.

తిరగబడదాం.. తరిమి కొడదాం

పోరాట నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నగారా



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఠాక్రే, రేవంత్, చిత్రంలో సంపత్, మహేశ్ కుమార్ గౌడ్, అజహరుద్దీన్, పొంగులేటి, అంజన్ కుమార్ యాదవ్, షబ్బీర్ అలీ, మధుయాష్కీ, భట్టి, బలరాం నాయక్, పొన్నం, రాజయ్య, సీతక్క

- బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజాకోర్టులు
- 16 అంశాలతో బీఆర్‌ఎస్, బీజేపీలపై ప్రజా చార్జిషీట్
- పోరాటాల్లో ప్రజలను భాగస్వాములను చేసేలా ప్రణాళికలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఎన్నికల ప్రచార నగారా మోగించింది. 'తిరగబడదాం...తరిమికొడదాం'అనే నినాదంతో పోరాటాలే లక్ష్యంగా కార్యాచరణను ప్రకటించింది. బీఆర్‌ఎస్–బీజేపీ రెండూ తోడు దొంగలని, కలిసే అవినీతి–అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలన వైఫల్యాలను ఎత్తిచూపుతామని వెల్లడించింది. ఈ మేరకు బీఆర్‌ఎస్, బీజేపీలపై రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేస్తూ.. కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించింది. శనివారం హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోదీ, కేసీఆర్‌ల చిత్రాలతో 'తోడు దొంగలు'పేరుతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ పోస్టర్‌లో బీఆర్‌ఎస్, బీజేపీలపై 15 అంశాలతో కూడిన ప్రజా చార్జిషీట్‌ను నమోదు చేశారు. అనంతరం మధుయాష్కీ పార్టీ కార్యాచరణను ప్రకటించారు.

చార్జిషీట్‌ను ఇంటింటికీ చేరుస్తాం

ప్రచార కార్యక్రమంలో భాగంగా నెల రోజుల్లో రాష్ట్రంలోని 75 లక్షల కుటుంబాలకు తమ చార్జిషీట్‌ను చేరుస్తామని మధుయాష్కీ గౌడ్ వెల్లడించారు. ప్రజలను మమేకం చేస్తూ ప్రచార కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళతామని.. 12వేల పంచాయతీల్లో గ్రామ సభలు, 3 వేల డివిజన్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లిన సందర్భంగా పోస్టర్‌కార్డుపై ప్రజల సంతకాలు తీసుకుని, బీఆర్‌ఎస్, బీజేపీల వైఫల్యాలపై ప్రజల ఆమోదం తీసుకుంటామని చెప్పారు. ఈ పోరాటంలో తమతో కలసి వచ్చేందుకు ప్రజలు 7661899899 ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. కాగా.. నియంతలను మించి కేసీఆర్ ప్రజలపై దాడులు చేస్తున్నారని, ఆయనపై ప్రతి గ్రామానికి వెళ్లి చార్జిషీట్ వేయాలని రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, చిన్నారెడ్డి, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కార్, మల్లురవి, రాజయ్య, షబ్బీర్‌అలీ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకోర్టు.. కేసీఆర్‌పై అభియోగాలు..

ప్రచార కార్యక్రమాన్ని ప్రకటించిన అనంతరం టీపీసీసీ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో ప్రజాకోర్టు నిర్వహించారు. దీనికి కంచె ఐలయ్య జడ్జిగా వ్యవహరించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత కటౌట్లను బోనులో దోషులుగా నిలబెట్టి వారిపై పీసీసీ నేతలు అభియోగాలు నమోదు చేశారు. చార్జిషీట్‌లోని అంశాలను వాదనలుగా వినిపించారు. న్యాయమూర్తిగా వ్యవహరించిన కంచె ఐలయ్య వారి వాదనలు విన్నారు. సమాజంలో అన్ని వర్గాలను మోసం చేయడంతోపాటు వాగ్దానాలను నిలబెట్టుకోకుండా ప్రజలను వంచించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టాలని, ఓట్లు వేయకుండా తిరస్కరించాలని తీర్పునిచ్చారు.

బీఆర్‌ఎస్ దోపిడీపై పోరాటమే: భట్టి

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేరకుండా తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డగోడగా నిలిచిందని.. దిక్కుతోచని స్థితిలో తెలంగాణ సమాజం విలవిల్లాడుతోందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ మరోసారి నడుం బిగించిందని.. బీఆర్‌ఎస్ అవినీతి, దోపిడీకి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. ''ప్రభుత్వంపై అభియోగాల నమోదుతోపాటు ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.. పోరాడుదాం, తిరగబడదాం, తరిమికొడదాం, రాష్ట్రాన్ని నిలబెడదాం..'' అని కాంగ్రెస్ శ్రేణులకు భట్టి పిలుపునిచ్చారు.

ఆకాంక్షలను కాలరాసిన కేసీఆర్: రేవంత్

ఉద్యమకారుల ఆకాంక్షలను రాజకీయ ఇంధనంగా మార్చుకుని గద్దెనెక్కిన కేసీఆర్.. తర్వాత ఆ ఆకాంక్షలను కాలరాశాడని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున ప్రజాకోర్టు ఏర్పాటు చేస్తున్నామని.. రాజులు, నియంతలను మరిపించే విధంగా ప్రజలపై దాష్టీకాలకు పాల్పడుతున్న కేసీఆర్, ఆయన కుటుంబంపై చార్జిషీట్ వేస్తున్నామని చెప్పారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం అనేవి రాష్ట్రంలో భూతద్దం వేసి వెతికినా కనిపించడం లేదన్నారు. కాళోజీ స్ఫూర్తితో బీఆర్‌ఎస్‌ను తెలంగాణ పొలిమేరలు దాటేవరకు తరిమికొడతామన్నారు.

కాంగ్రెస్ ప్రజా చార్జిషీట్‌లోని అంశాలివీ..

భ్రష్ట జుమ్లా పార్టీ (బీజేపీ)

- తెలంగాణకు ద్రోహం– ఆంధ్రతో స్నేహం
- కాళేశ్వరంలో అవినీతి–కేసీఆర్‌తో లాలూచీ
- ప్రాజెక్టులు కట్టలే–జాతీయ హోదా దక్కలే
- నీళ్లు, నిధుల్లో అన్యాయం–యువతకు ఇవ్వలే ఉద్యోగం
- రైతులపై అప్పుల భారం–పేదలపై ధరల భారం
- ప్రభుత్వ ఆస్తులు అమ్ముడు–ప్రజల సొమ్ము దోచుడు

బీజేపీ రిష్తేదార్ సమితి (బీఆర్‌ఎస్)

- కల్వకుంట్ల కుటుంబం–కావేవీ అక్రమాలకు అనర్హం
- కాళేశ్వరంతో చోరీ–ఖజానా ఖాళీ
- కచరా సర్కార్–కర్షకుల ఖూనీకోర్
- అబద్ధాలు చెప్పిండు–అధికారంలోకి వచ్చిండు
- కారు వారసులు–భూబకాసురులు
- దళిత గిరిజనులకు అవమానం–దక్క లేదు గౌరవం
- ఇంటికి ఉద్యోగం రాలే–యువత భవిత మారలే
- అటకెక్కిన ఉచిత విద్య–పడకేసిన ఆరోగ్యం
- ఆడబిడ్డలపై దాడులు–అయినా ఫామ్‌హౌజ్ వదలరు
- బడ్జెట్‌లో కోతలు–సంక్షేమానికి వాతలు

(ఈ అంశాలను పోస్టర్‌లో పేర్కొనడంతోపాటు బైబై మోదీ, బైబై కేసీఆర్ అనే నినాదాలను చేర్చారు)

మన అండ లేకుండా ఎవరూ ప్రధాని కాలేరు

- కేంద్రం మెడలు వంచే దమ్మున్న నేత కేసీఆర్
- చేనేత రుణ మాఫీకి ప్రయత్నం
- చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహిస్తాం
- పోచంపల్లి చేనేత సభలో మంత్రి కేటీఆర్



భూదాన్ పోచంపల్లిలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, యాదాద్రి: కేంద్రంలో మన(బీఆర్‌ఎస్) బలం, దీవెన, ఆశీర్వాదం లేకుండా ఎవరూ ప్రధాని కాలేరని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేంద్రంతో కొట్లాడి, శాసించి కేంద్రం మెడలు వంచే సీఎం కేసీఆర్ లాంటి దమ్మున్న నాయకున్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేత వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంత్రి కేటీఆర్ శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో నేతన్నలనుద్దేశించి మాట్లాడారు. నేతన్నల కష్టాలు సీఎం కేసీఆర్‌కు తెలుసని, కేసీఆర్ చిన్నప్పుడు ఒక నేతన్న ఇంట్లో ఉండి చదువుకున్నారని, చేనేత మగ్గం చప్పుడు.. అంటే మీ గుండె చప్పుడు తెలిసిన వ్యక్తి కాబట్టే ఈ రోజు దేశంలో ఎక్కడా లేని విధంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రైతు బీమా తరహాలో నేతన్నలకు బీమా సౌకర్యం తీసుకొచ్చింది తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనన్నారు.

వచ్చే నెల నుంచి మగ్గం నేసే ప్రతి ఒక్కరికి నెలకు రూ.3 వేలు

మగ్గం నేసే ప్రతి ఒక్కరికి నెలకు రూ.3 వేలు వచ్చే నెల నుంచి నేరుగా వారి ఖాతాలోనే జమ చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. నేతన్నలకు హెల్త్ కార్డు మంజూరు చేస్తామని, తద్వారా రూ.25 వేల వరకు అవుట్ పేషెంట్ వైద్య సేవలు అందుతాయని చెప్పారు. గుంట మగ్గాల స్థానంలో రూ.40 కోట్లతో తెలంగాణ చేనేత మగ్గం తెచ్చామని, అందరూ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చేనేత రుణ మాఫీ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. చేనేత సహకార ఎన్నికలు కూడా జరిపిస్తామన్నారు.

హ్యాండ్లూమ్ పార్క్ పోచంపల్లి నేతన్నలకే..

భువనగిరి ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి కోరిక మేరకు పోచంపల్లి మండలం కనుముక్కలలో 23 ఎకరాల్లో ఉన్న పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌ను రూ.12.50 కోట్లతో ప్రభుత్వమే కొనుగోలు చేసిందని కేటీఆర్ వివరించారు. అవసరమైతే రూ.15కోట్లు అదనంగా ఖర్చు చేసి పార్కును బ్రహ్మాండంగా తయారు చేస్తామని, అందులోంచి వచ్చే లాభాలు పోచంపల్లిలోని ప్రతి నేత కుటుంబానికి అందచేస్తామని చెప్పారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు నేత కార్మికుల కష్టాలను, ఆకలి చావులను అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, రవీంద్ర కుమార్, రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాశ్, డైరెక్టర్ అలుగు వర్షిణి, భువనగిరి జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేతన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన కేటీఆర్

భూదాన్ పోచంపల్లిలో నేతన్న విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు. తర్వాత యువ చేనేత కళాకారుడు సాయిని భరత్‌కు చెందిన కళా పునర్వి ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించారు. కనుముక్కలలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న హ్యాండ్లూమ్ పార్కుకు.. రూ.100 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

మేమొచ్చాక నందికి బదులుగా గద్దర్ అవార్డులు

- ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెడతాం
- మీడియాతో టీపీసీసీ చీఫ్ రేవంత్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు అందజేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠిస్తామని వెల్లడించారు. శనివారం ఇక్కడ బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్రచార కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, బీజేపీల గురించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఆ పార్టీ పరిస్థితి ఏంటో మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను అడిగితే చెబుతారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం బీజేపీలో ఉన్న ఎంపీల్లో సగం మంది బయటి నుంచి వచ్చిన వాళ్లేనని, వారికి నమస్తే... సదావత్సలే అంటే ఏంటో కూడా తెలియదని అన్నారు. రాష్ట్రంలోని ఆ పార్టీ నేతలు ఈటల రాజేందర్, రాజగోపాల్‌రెడ్డిలకు దీని గురించి తెలుసా అని ప్రశ్నించారు. తనను ఉద్దేశించి తెలంగాణకు పట్టిన వ్యాధిగా అభివర్ణించిన మంత్రి కేటీఆర్‌కు వ్యాధికి, వ్యాధులకు తేడా తెలియదని అన్నారు. తాను ఉద్యమం చేస్తున్నప్పుడు ఆయన అమెరికాలో ఉన్నారని చెప్పారు. తెలంగాణకు కాంగ్రెస్, టీడీపీలు మోసం చేశాయని అంటున్నారని, ఆ రెండు పార్టీల్లో కేసీఆర్ ఉన్నారని, తెలంగాణకు ఏ అన్యాయం ఎప్పుడు జరిగినా కేసీఆరే ప్రత్యక్ష ద్రోహి అని విమర్శించారు. తన పార్టీ పేరులోని తెలంగాణ పదం తీసేసి ఆ పేరును హత్య చేసిన కేసీఆర్ తెలంగాణవాది ఎలా అవుతారని ప్రశ్నించారు. సెప్టెంబర్ 17న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేస్తామని, ఆ తర్వాత తాము ప్రజలకు ఏం చేస్తామో కూలంకషంగా వివరిస్తామని రేవంత్ చెప్పారు.

ఇళ్లు ఇస్తావా?.. గద్దె దిగుతావా?

- సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
- పేదలకు ఇళ్ల కోసం 16, 17 తేదీల్లో బస్తీ సమావేశాలు నిర్వహిస్తాం
- 23, 24 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నా
- సెప్టెంబర్ 4న విశ్వరూప ధర్నా నిర్వహించి.. సీఎం కేసీఆర్ కళ్లు తెరిపిస్తామని వ్యాఖ్య



మహాధర్నాలో ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో బంగారు శ్రుతి, అర్వింద్, జితేందర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ''రాష్ట్రంలో పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ తొమ్మిదేళ్లుగా నాన్చుతూనే ఉన్నారు. వెంటనే పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తారా? లేకుంటే గద్దె దిగుతారా?'' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలోని పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలన్న డిమాండ్‌తో బీజేపీ శనివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌పై కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ''1,200 మంది అమరుల త్యాగాల పునాదులతో ఏర్పడిన తెలంగాణ ఇప్పుడు బందీ అయింది. నియంతృత్వ పాలనలోకి వెళ్లిపోయింది. ప్రతి పనిలో అవినీతిమయంగా మారింది. రాష్ట్రాన్ని 5 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. పేదలకు ఇళ్లు కట్టివ్వని కేసీఆర్.. దోపిడీ డబ్బుతో ఫాంహౌజ్‌లు కట్టుకున్నారు. పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే ఓటు అడగబోనని 2018లో ఎన్నికల సందర్భంగా చెప్పిన సీఎం కేసీఆర్ మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నారు. పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే ఈ ప్రభుత్వాన్ని పాతరేస్తాం. పోరాటం మరింత ఉధృతం చేస్తాం'' అని వ్యాఖ్యానించారు. భారీ వర్షాలు, వరదలతో రైతులు, ప్రజలు అల్లాడితే.. వారిని పరామర్శించేందుకు కూడా సీఎం కేసీఆర్‌కు సమయం లేదా అని ప్రశ్నించారు. భూములు అమ్మితే తప్ప రాష్ట్ర ప్రభుత్వం నడిచే స్థితిలో లేకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు.

వివిధ రూపాల్లో ఉద్యమాలు

పేదలకు ఇళ్లు మంజూరు చేసే వరకు బీజేపీ వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తుందని కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నెల 16, 17 తేదీల్లో బస్తీల్లో పేద ప్రజలను కలసి, డబుల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 18న మండల కేంద్రాల్లో, 23, 24 తేదీల్లో జిల్లా కలెక్టరేట్లవద్ద ధర్నాలు చేపడతామని చెప్పారు. వచ్చే నెల 4న సీఎం కేసీఆర్ కళ్లు తెరిపించేలా విశ్వరూప ధర్నా చేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నుంచి బూత్‌స్థాయి కార్యకర్త దాకా అంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఎంపీ అర్వింద్, మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, యెండల లక్ష్మీనారాయణ, కూన శ్రీశైలంగౌడ్, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో 20 లక్షల ఇళ్లు కట్టించి ఇచ్చారు: ఈటల

గత నాలుగేళ్లలో ఏపీలో 20 లక్షల ఇళ్లు కట్టించి ఇచ్చారని, తెలంగాణలో మాత్రం లక్ష ఇళ్లు కూడా కట్టలేదని ధర్నాలో ఈటల రాజేందర్ పేర్కొన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం కేంద్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.9 వేల కోట్లు ఇచ్చిందని చెప్పారు. కేసీఆర్‌కు ఇళ్లు ఇచ్చే దమ్ము లేదని మండిపడ్డారు. గృహలక్ష్మి పేరిట ఇస్తామంటున్న మూడు లక్షలతో ఇళ్ల పునాదులు కూడా పూర్తి కావన్నారు. ఏపీలో పేదలకు లక్షలాది ఇళ్లు కట్టించి ఇచ్చారని.. కానీ తెలంగాణ ప్రభుత్వంలో అసలు హౌసింగ్ శాఖనే లేదని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. నిజామాబాద్ నుంచి కల్వకుంట్ల కవిత పోటీ చేస్తామంటున్నారని, కానీ ఆమె ఎక్కడ పోటీ చేసినా గెలవరని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ నేతలవి పిచ్చి మాటలు

- లేవనెత్తే సమస్యల్లేక ఏం చేయాలో తెలుస్తలేదు
- సంగారెడ్డిలో మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: 'కాంగ్రెస్ నాయకులు వీఆర్‌ఏలను, పంచాయతీ కార్యదర్శులను రెచ్చగొట్టాలని చూశారు.. కానీ వారిని రెగ్యులరైజ్ చేశాము.. రేషన్‌డీలర్ల సమస్యనూ పరిష్కరించాం.. ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు.. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఇంటింటికీ మంచినీరు వంటి పథకాలతో మహిళలు సీఎం కేసీఆర్‌కు జైకొడుతున్నారు.. ఇక ఏం చేయాలో తెలియక కాంగ్రెస్ నాయకులు పిచ్చిగా మాట్లాడుతున్నారు'' అని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. శనివారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన ఆయన బీసీ బంధు లబ్ధిదారులకు రూ.లక్ష సాయం పంపిణీ చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారానికి సంబంధించిన డబ్బులను బ్యాంకు వెబ్‌సైట్లపై స్వయంగా మీట నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయించారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల తీరును తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ సభలకు ప్రజలు రాకపోవడంతో వారికి ఏం చేయాలో తోచడం లేదన్నారు. ధరణిని రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ నాయకులు తిరిగి బ్రోకర్ల రాజ్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తారా అని నిలదీశారు.

రైతులే తేల్చుకోవాలి..

వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందన్న కాంగ్రెస్ కావాలో.. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు పెట్టాలంటున్న బీజేపీ కావాలో.. మూడు పంటలు పండించేలా రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ కావాలో రైతులే తేల్చుకోవాలని మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. రైతుల ఉసురు పోసుకున్నది కాంగ్రెస్ పార్టీనే అని, ఆ ప్రభుత్వ హయాంలో అర్ధరాత్రి విద్యుత్ సరఫరా అయ్యేదని, ఎరువుల బస్తాల కోసం పోలీస్‌స్టేషన్లలో క్యూలైన్‌లో నిలబడాల్సిన దుస్థితి ఉండేదన్నారు.

కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి..

కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు రావాల్సిన రూ.35 వేల కోట్లు నిలిపివేసిందని, ఆ నిధులను కేంద్రం ఎందుకు ఆపిందో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని హరీశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, కలెక్టర్ శరత్ పాల్గొన్నారు.

పొలాల్లోని కలుపు మొక్కల్లో వందకుపైగా ఆహారంగా తీసుకోదగ్గవే

వాటిలోనూ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఎన్నో పోషకాలు

సహజ ఆకుకూరలపై అవగాహన కార్యక్రమంలో నిర్వాహకులు

డీడీఎస్ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో హైదరాబాద్‌వాసుల క్షేత్రస్థాయి పర్యటన

'కలుపు'కొని తినాలి..

వర్షాకాలంలో పంట పొలాల్లో సహజంగా పెరిగే ఆకుకూరల గురించి క్షేత్రస్థాయిలో తెలుసుకొనేందుకు హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వచ్చిన కొందరు సందర్శకులకు దెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. జహీరాబాద్ మండలం అర్జున్ నాయక్‌తండా, ఝరాసంగం మండలంలోని ఎల్గోయి గ్రామాల్లో సహజ ఆకుకూరల ప్రాధాన్యం గురించి వివరించారు. అవి ఏ మేరకు ఆరోగ్యాన్ని అందిస్తాయో సభ్యులు చెప్పారు. వర్షాకాల పంటల్లో పలు రకాల కలుపు మొక్కలు వస్తాయని.. వాటిని రైతులు తొలగిస్తుంటారని.. కానీ వాటిలోనూ ఆరోగ్యానికి అవసరమయ్యే అనేక పోషకాలు కలిగి ఉన్నాయని సందర్శకులకు మహిళా రైతులు చిందిబాయి, రాజీబాయి తెలియజేశారు. కలుపు మొక్కల్లో వందకుపైగా రకాల ఆకుకూరలను ఆహారంగా తీసుకోవచ్చని చెప్పారు. - జహీరాబాద్

ప్రదర్శన ద్వారా అవగాహన

పొలాల్లో సహజంగా పండే ఆకుకూరల గురించి సందర్శకులకు ప్రత్యక్ష అనుభవం కల్పించేందుకు డీడీఎస్ సభ్యులు వారిని పొలాల్లో తిప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఏయే ఆకుకూరలో ఎలాంటి పోషకాలు ఉంటాయనే అంశాన్ని వివరించారు. చక్కెర వ్యాధి నివారణకు ఉపయోగపడే ఆకుకూరలతోపాటు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు ఎలాంటి ఆకుకూరలు తినాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణీరావు, రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు అనితకుమారి, సంస్థ సభ్యులు మంజుల, పెద్ద నర్సమ్మ, చిన్న నర్సమ్మ, అల్గోల్ నర్సమ్మ, మాణిక్యం, రోజా, మయూరి పాల్గొన్నారు.

నోరూరించిన వంటకాలు

పొలాల్లో సహజంగా పెరిగే ఆకుకూరలతో వంటలు వండారు. ఆయా వంటకాలను సందర్శకులకు వడ్డించారు. మార్కెట్లో లభించే ఆకుకూరల కంటే ఇవి రుచిగా ఉన్నాయని పలువురు అన్నారు.

కలుపు మొక్కలుగా భావిస్తున్న వాటిలో కొన్ని...

అత్తిలి, పిట్టకూర, సన్న పాయలు, బంకంటికూర, చెన్నంగి, ఎన్నాద్రి, ఉత్తరేణి, గునుగు, బుడ్డకాశ, గోరిమడి, తెల్లగజ్జర, తకడదొబ్బుడు, జొన్న చెంచలి, పుల్లకూర, తగరంచ, ఎలుకచెవుల కూర, అంగిబింగి, పప్పుకూర, అడవి మెంతెంకూర, తుమ్మికూర, గురిమాసి, అడవి పొన్నగంటి అలం, నల్లకాశ, దూసరి, తలాయిలా, రేలపప్పు, తెల్ల వార్జంపువ్వు, గురిమాసిగడ్డ, చిత్రమూలం, పొనగంటి, పల్లెరుకాయ, పాలపత్రం, బంకటి ఇలా అనేక రకాల ఆకు కూరలు సహజంగా లభిస్తాయి.

ఆకుకూరల్లో పోషక విలువలు...

ఆకుకూరలు ఆరోగ్య సంరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. దాదాపు అన్ని ఆకుకూరల్లో క్యాల్షియం, ఇనుము, కెరోటిన్, విటమిన్–సి, రైబోఫ్లావిన్, ఫోలిక్ యాసిడ్, పీచుపదార్థాలు సమృద్ధిగా ఉంటాయి.


సహజంగా పొలాల్లో పెరిగే ఆకు కూరల గురించి తెలుసుకుంటున్న సందర్శకులు

సహజ ఆరోగ్యం పొందవచ్చు



రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సహజంగా ఆకు కూరలు లభ్యమవుతాయి. ఇవి సేంద్రియ విధానంలో వస్తున్నందున మన ఆరోగ్యానికి ఎలాంటి నష్టం ఉండదు. ప్రతి ఒక్కరూ ఈ ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. – నర్సింహారావు, రిటైర్డ్ ఉద్యోగి, హైదరాబాద్

ఎన్నో ఆకుకూరల గురించి తెలుసుకున్నాం



ఆకుకూరల్లో ఇన్ని రకాలు ఉంటాయనే విషయం నాకు తెలియదు. కలుపు మొక్కలుగా భావిస్తున్న ఆకుకూరల్లో అనేక పోషకాలు నిండి ఉన్నాయనే విషయం ఇప్పుడే తెలిసింది. వీటి గురించి తగిన ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. – లిఖిత, బీటెక్ విద్యార్థిని, హైదరాబాద్

ఆరోగ్యాన్ని అందిస్తాయని తెలిసింది



సహజంగా వచ్చే ఆకుకూరలను తీసుకోవడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. వాటి గురించి తెలుసుకునేందుకే వచ్చా. – స్వప్న, గృహిణి, హైదరాబాద్

మరో రూ.3,318 కోట్లు

పెట్టుబడి పెట్టిన ఫాక్స్‌కాన్

- గతంలోనే రూ.1,244 కోట్లతో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు ఒప్పందం
- రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో శరవేగంగా నిర్మాణం



సాక్షి, హైదరాబాద్: తైవాన్‌కు చెందిన మాన్యుఫ్యాక్చరింగ్ దిగ్గజ సంస్థ ఫాక్స్‌కాన్ గ్రూప్ రాష్ట్రంలో మరో రూ.3,318 కోట్ల (400 మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు భారత్‌లో ఫాక్స్‌కాన్ ప్రతినిధి వీ లీ సామాజిక మాధ్యమ వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టును ధ్రువీకరిస్తూ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు ట్వీట్ చేశారు. 'ఫాక్స్‌కాన్‌తో తెలంగాణ బంధం వేగంగా పురోగమిస్తోంది. పరస్పర ఒప్పందంలో పేర్కొన్న అంశాలను ఇరువురం వేగంగా అమలు పరుస్తున్నాం. ఈ నేపథ్యంలో గతంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా రూ.4,562 కోట్ల (550 మిలియన్ డాలర్లు) పెట్టుబడి హామీని ఫాక్స్‌కాన్ నెరవేర్చింది' అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో 550 మిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాలనే ప్రతిపాదనను 'ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ' (ఎఫ్‌ఐటీ) ఆమోదించినట్లు బోర్డు చైర్మన్ లూ సంగ్ చింగ్ కూడా మరో ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఎయిర్‌పాడ్స్‌తోపాటు మొబైల్ ఫోన్ల ఇతర విడిభాగాల తయారీలో ఫాక్స్‌కాన్‌కు దిగ్గజ సంస్థగా పేరుంది. ఇది మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ ఆపిల్‌కు ప్రధాన విడిభాగాల సరఫరాదారుగా ఉంది. ఫాక్స్‌కాన్ తొలి విడతలో రూ.1,244 కోట్లు (150 మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టిన సంగతి తెలిసిందే.

కొంగరకలాన్‌లో 196 ఎకరాల్లో ఏర్పాటు

ఇప్పటికే కర్ణాటకలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫాక్స్‌కాన్ తెలంగాణలోనూ కార్యకలాపాలు ప్రారంభించే ఉద్దేశంతో గత మార్చి 2న రాష్ట్ర ప్రభుత్వంతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్‌ఐఐసీ) రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్‌కు 196 ఎకరాలు కేటాయించింది. గత మే 15న ఫాక్స్‌కాన్ యూనిట్‌కు శంకుస్థాపన జరగ్గా ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ యూనిట్ నిర్మాణంలో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. గ్రీన్ ఎనర్జీ కోసం సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, ఎల్‌ఈడీ విద్యుద్దీపాలు, వాననీటిని ఒడిసి పట్టి ఇతర అవసరాలకు వాడుకోవడం, సిబ్బందికి బస వంటి అనేక ప్రత్యేకతలు ఈ క్యాంపస్‌లో ఉంటాయి. వచ్చే ఏడాది ఆరంభంలో ఇక్కడ ఉత్పత్తి ప్రారంభం కానుండగా, ఫాక్స్‌కాన్ యూనిట్ ఏర్పాటు ద్వారా స్థానికంగా 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

ప్రవీణ్‌కుమార్ హౌస్ అరెస్ట్



ప్రవీణ్‌కుమార్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


బీఎస్పీ రాష్ట్ర కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

- గ్రూప్–2 రద్దు డిమాండ్‌తో బీఎస్పీ నేతలు చేపట్టిన సత్యాగ్రహ దీక్ష భగ్నం
- గన్‌పార్కు వద్ద నిరసనకారుల నిర్బంధం

బండ్లగూడ, నాంపల్లి: అక్రమంగా అరెస్టులు చేసి తమను భయపెట్టాలని చూస్తే మరింత ఉవ్వెత్తున ఉద్యమిస్తామని బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. గ్రూప్–2 పరీక్షలను రద్దు చేయాలని కోరతూ నిరసన చేపట్టేందుకు వెళ్తున్న ఆయనను శనివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీంతో ఉదయమే బండ్లగూడలోని ఆయన నివాసంలో సత్యాగ్రహ దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ శాంతియుతంగా దీక్ష చేస్తున్న తనను అర్ధరాత్రి పోలీసులు అకారణంగా నిర్బంధించారని ఆరోపించారు. తమకు ఆదేశాలు ఉన్నాయంటూ రాద్ధాంతం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన చేపట్టిన తన మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది బీఎస్పీ కార్యకర్తలను అరెస్టు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం పోలీసులను నమ్ముకొని పాలన చేస్తున్నారని, భవిష్యత్‌లో ఇదే కేసీఆర్‌ను ఫామ్‌హౌజ్‌లోనే బందోబస్తు చేస్తారని ధ్వజమెత్తారు. గ్రూప్–2 ఉద్యోగాల్లో కొన్ని తమ అనుచరులకు కావాలని ముందుగానే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు చెప్పారనీ అందుకే నిరుద్యోగుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ బోర్డులో కొంత మంది దొంగలను సీఎం నియమించారని విమర్శించారు.

లీకేజీ కారకులను అరెస్టు చేయకుండా పరీక్షలు ఎలా?

పేపర్ లీకేజీ కారకులను ఇంతవరకూ అరెస్టు చేయకుండా, తిరిగి వెంటనే పరీక్షలు నిర్వహించడం సరికాదని ప్రవీణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. 2014 నుంచి ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా 2022లో ఒకేసారి నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులపై తీవ్ర భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికల కోసమే ఆగమేఘాల మీద ఉద్యోగ పరీక్షలు నిర్వహిస్తున్నారని నిందించారు. ఇప్పటి వరకు డీఎస్సీ ఎందుకు నిర్వహించలేదని ఆయన ప్రశ్నించారు. నియంత, నిరంకుశ కేసీఆర్ వల్ల ఒక తరం నాశనం అయ్యిందని ప్రవీణ్ ధ్వజమెత్తారు. టీచర్ ఉద్యోగ పరీక్షలు రాసిన వాళ్లు గ్రూప్ పరీక్షలు రాయకూడదనేది కేసీఆర్ కుట్రగా పేర్కొన్నారు. ''ముఖ్యమంత్రి కొడుకు, మనుమడు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఎప్పుడైనా పోటీ పరీక్షలు రాశారా... ఆరునెలల్లో పరీక్ష సిలబస్ మార్చి మెటీరియల్ ఇవ్వకుండా వాళ్లు పరీక్ష రాయగలరా..'' అని నిలదీశారు.

ఫేక్ యూనివర్సిటీలు

యూనివర్సిటీలు బాగు చేయమంటే ఫేక్ ప్రైవేట్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో పెన్ డౌన్, సకల జనుల సమ్మె, ఇలా ఎన్నో ఉద్యమాలు చేసినప్పుడు ఎలాంటి అణచివేత ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం కల్వకుంట్ల కుటుంబంగా మారిందని విమర్శించారు. పేపర్ లీకేజీలో రమేష్, రాజశేఖర్‌రెడ్డి దొరికిన వెంటనే కేటీఆర్ దొంగ అని తేలిపోయిందనీ, అందుకే కేటీఆర్ ట్విట్టర్‌లో కూడా నిరుద్యోగ సమస్యలపై మాట్లాడడం లేదని ప్రవీణ్ విమర్శించారు. పేపర్ లీకేజీపై సీబీఐ విచారణ జరపాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బీఎస్పీ నేతల సత్యాగ్రహ దీక్ష భగ్నం

గ్రూపు–2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం నగరంలోని గన్‌పార్కు వద్ద సత్యాగ్రహ దీక్షకు దిగన బీఎస్పీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. చేతుల్లో ప్లకార్డులను పట్టుకుని జైభీమ్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రధాన రోడ్డు నుండి గన్‌పార్కులోనికి పరుగులు తీసిన వారిని పోలీసులు అడ్డుకుని బలవంతంగా లాక్కెళ్లారు. గన్‌పార్కు వైపునకు వచ్చినవారిని వచ్చినట్లుగానే అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని ముషీరాబాదు, నాంపల్లి పోలీసుస్టేషన్లకు తరలించారు.

రేవంత్‌కు 'యాదవ యుద్ధభేరి' ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు యాదవ కులస్తులకు ప్రాధాన్యమివ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే 'యాదవ యుద్ధభేరి'సభకు రావాలని యాదవ విద్యావంతుల వేదిక టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది. విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్, ఉపాధ్యక్షుడు నాగా సీతారాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర జంగయ్య యాదవ్ శనివారం రేవంత్‌ను కలిసి ఆహ్వానం అందజేశారు. యాదవులకు 22 ఎమ్మెల్యే, 7 ఎమ్మెల్సీ, 3 లోక్‌సభ, 2 రాజ్యసభ టికెట్లు ఇవ్వాలనేది తమ డిమాండ్ అన్నారు.

ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా..

- సారూప్యత లేని ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు
- జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు
- రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో పనిచేస్తున్న 1,140 మంది సిబ్బంది
- అందరికీ కనీస వేతనం, పీఎఫ్ కల్పించాలని డిమాండ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలోని 31 జిల్లాల్లో పనిచేస్తున్న 1,140 మంది ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గత 8 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు జీ.వో ఎం.ఎస్.60 ప్రకారం కనీస వేతనం రూ.22,750 ఇవ్వాలని కోరుతున్నారు.

జవాబుదారీతనం, పారదర్శక సేవలు అందించేందుకు గాను ఈ–పంచాయతీ కార్యక్రమం రూపొందించారు. ఇందులో భాగంగా ప్రజలకు ఇంటర్‌నెట్ ఆధారంగా సేవలను అందించేందుకు 2015 జనవరి 1న కార్వీ సంస్థ ద్వారా 15 నెలల ఒప్పందంతో 1,140 మందిని ప్రభుత్వం నియమించింది. వీరు 2,240 క్లస్టర్ల పరిధిలో 12,753 గ్రామపంచాయతీల్లో సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్కరు 8 నుంచి 10 పంచాయతీలకు సంబంధించిన పనులను కంప్యూటరీకరణ చేస్తుంటారు.

2016 నుంచి అవుట్ సోర్సింగ్ విధానంలోకి

ప్రభుత్వం కార్వీ సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు నెలకు రూ.11వేలు వేతనం ఇచ్చారు. 2016 మార్చి 31తో కార్వీ సంస్థ ఒప్పందం గడువు ముగిసింది. అయితే ఈ–పంచాయతీ విధానం ద్వారా ప్రజలకు సేవలు సులువుగా, పారదర్శకంగా అందుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ కమిషనర్ ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లను అవుట్ సోర్సింగ్ విధానంలోకి 2016 ఏప్రిల్ 1వ తేదీన తీసుకున్నారు. వీళ్లకు 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి, పరిపాలన నిధుల కింద 10 శాతం నిధులు కేటాయించి రూ.8 వేలకు తగ్గకుండా వేతనాలు ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా వేతనాలు

రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా వీళ్లకు వేతనాలు ఇస్తున్నారు. ప్రస్తుతం 11 జిల్లాల్లో మాత్రం రూ.22,750 ఇస్తున్నారు. మిగిలిన 20 జిల్లాల్లో రూ.17,500 ఇస్తున్నారు. రాష్ట్రంలో ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు అందరికీ ఒకే రకంగా పనిచేస్తున్నప్పటికీ ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా వేతనాలు ఇస్తుండడం గమనార్హం. ట్రెజరీ ద్వారా కనీస వేతనం ఇవ్వాలని పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు కోరుతున్నారు.

వీరు ఏం చేస్తారంటే...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 30 రోజుల ప్రణాళిక (1,2), పల్లెప్రగతి, హరితహారం, జనన మరణ ధ్రువీకరణలు, భవన నిర్మాణం, ఆస్తి మార్పిడి, వ్యాపార లైసెన్సులు, ప్లాన్ ప్లస్, ఈ–గ్రామ్ స్వరాజ్, ఆస్తుల జియో ట్యాగ్, లోకల్ గవర్నమెంట్ డైరెక్టరీ, పంచాయతీ కార్యదర్శుల నెలవారీ పనులు, పీఎఫ్, గ్రామపంచాయతీకి సంబంధించిన 11 రకాల దరఖాస్తులు, పంచాయతీల ఆదాయ, వ్యయాలను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేస్తున్నారు. వీటితో పాటు పింఛన్ల నమోదు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్, దీపం పథకం, ఐఐహెచ్ఎల్ (స్వచ్ఛ భారత్), ఇతరత్రా ఆన్‌లైన్ పనులను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేస్తున్నారు.

పరీక్షల క్యాలెండర్ ప్రకటిస్తే సమస్యలు ఉండవు

తన నివాసంలో దీక్ష చేపట్టిన ప్రొ. కోదండరాం.. హౌస్ అరెస్టు


తన నివాసంలో దీక్ష చేస్తున్న కోదండరాం

లాలాపేట: ఉద్యోగ పరీక్షలన్నీ క్యాలెండర్ ప్రకారం జరిగితే సమస్యలు ఉండవని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గ్రూప్ 2 పరీక్షను వాయిదా వేయాలనీ డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం గన్‌పార్కు వద్ద నిర్వహించతలపెట్టిన దీక్ష నేపథ్యంలో తార్నాకలోని ఆయన నివాసంలో కోదండరాంను పోలీసులు ముందస్తుగా హౌజ్ అరెస్టు చేశారు. దీంతో ఇంట్లోనే దీక్ష చేపట్టిన కోదండరాం మీడియాతో మాట్లాడుతూ..విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని వెంటనే గ్రూప్ 2 పరీక్షను వాయిదా వేయాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపకుండా ఎక్కడికక్కడ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ప్రొ.విశ్వేశ్వరరావు, విద్యార్థి నేతలు అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

టీచర్ దంపతుల బదిలీలు చేపట్టండి

మంత్రి హరీశ్‌రావును వేడుకున్న మహిళా టీచర్లు

సాక్షి, హైదరాబాద్: నిలిచిపోయిన ఉపాధ్యాయ దంపతుల బదిలీల ప్రక్రియను వెంటనే పునఃప్రారంభించాలని మహిళా టీచర్లు మంత్రి హరీశ్‌రావును కోరారు. 13 జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయ దంపతులు హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఏడాదిన్నరకు పైగా కుటుంబాలకు దూరమై పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బదిలీలు నిర్వహించి ఆదుకోవాలని మంత్రిని వేడుకున్నారు. ఇప్పటికైనా తమను కుటుంబసభ్యులతో కలిసి ఉండేలా స్పౌజ్ బదిలీలు చేపట్టాలని కోరారు.

గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయండి: షర్మిల



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులు కోరుతున్నట్లు టీఎస్‌పీఎస్సీ గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. పరీక్షలు మరో 3 నెలలు వాయిదా వేయాలని 5 లక్షలమంది అభ్యర్థులు పట్టుబడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం తనకేమీ పట్టనట్టుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. నిరుద్యోగులు రోడ్లపై ధర్నాలు చేస్తున్నా పాలకుల కంటికి కనిపించడంలేదని శనివారం ట్విట్టర్ వేదికగా ఆమె మండిపడ్డారు. ఎవరెంత మొత్తుకున్నా స్పందించకపోవడం సీఎం కేసీఆర్ నియంత పోకడకు అద్దం పడుతోందన్నారు. ఇంటికో కొలువు ఇస్తనంటే నమ్మినందుకు నిరుద్యోగుల తల్లిదండ్రులకు పుట్టెడు శోకాన్ని మిగిల్చారని, ప్రశ్నించినవారిపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ప్రభుత్వం ఇకనైనా తమ దుర్మార్గపు ఆలోచనను మానుకొని, నిరుద్యోగులతో చర్చించి క్రమపద్ధతి ప్రకారం పరీక్షలు నిర్వహించాలని షర్మిల డిమాండ్ చేశారు.

పీజీ వైద్యవిద్య తొలి విడత ప్రవేశాలకు నోటిఫికేషన్

కన్వీనర్ సీట్ల భర్తీకి నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: పీజీ వైద్య సీట్ల భర్తీకి నేటి నుంచి ఈ నెల 15వ తేదీ వరకు మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం ప్రకటించింది. దరఖాస్తు ప్రక్రియ ముగియడంతో మొదటి విడత వెబ్ ఆప్షన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపింది. యూనివర్సిటీ పరిధిలోని పీజీ వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. ఈ నెల 13 ఉదయం 8 గంటల నుంచి 15వ తేదీ రాత్రి 8 గంటల వరకు తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. మరింత సమాచారానికి www.knruhs. telangana.gov.in చూడాలని సూచించింది.





జ్ఞానముగలవానికి ఉపదేశము చేయగా వాడు మరింత జ్ఞానము నొందును. నీతిగలవానికి బోధచేయగా వాడు జ్ఞానాభివృద్ధి నొందును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ. ద్వాదశి ఉ.8.54 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఆరుద్ర ఉ.10.04 వరకు తదుపరి పునర్వసు., **వర్జ్యం:** రా.11.02 నుండి 12.46 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.41 నుండి 5.32 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం : 6.24
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

లాల్–నీల్ తాత్విక ధార

మూడు దశాబ్దాలుగా తనవైన ఆటపాటలతో ప్రజలను చైతన్య మార్గాన్ని పట్టించి ఉర్రూతలూగించిన ప్రజా గాయకుడు గద్దర్. కులాన్నీ, అస్పృశ్యతనూ పట్టించుకోని ఎర్ర జెండా ఉద్యమకారులను ఆలోచింపచేస్తూ దళిత, బహుజనవాద దృక్పథంతో తన కలాన్నీ, గళాన్నీ కారంచేడు వంటి అమానవీయ సంఘటనలకు ప్రతిస్పందనగా ఎక్కుపెట్టాడు. అదే పంథాను జీవితాంతం కొనసాగించాడు. ఎందరో కళాకారులు, మేధావులు ఆయన స్ఫూర్తితో సామాజికోద్యమాల్లోకి దూకారు. పీడిత, తాడిత వర్గాలవారిని సముద్ధరించడానికి పాటుపడిన 'పాల్ రాబ్సన్' వంటి ధీరులతో పోల్చదగిన స్థాయి అతడిది.

మన 'పాల్ రాబ్సన్'!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'గద్దరమ్మ నోటికి దండం' అనేవాళ్లు, ఇప్పుడు 'గద్దర్' నోటికి దండాలు పెట్టే రోజులొచ్చాయి! ఒక ఉద్యోగిగా సరి పెట్టుకుని, పెరుగుతున్న ధరలతోనే రాజీపడి బతుకు భారాన్ని చిరునవ్వుతో మోసుకుంటూ కాలక్షేపం చేయలేక, కళారంగాన్ని కదనరంగంగా మార్చిన విప్లవ కవితా ఉద్యమ వారసుడు, కవి, మధుర గాయకుడు అయిన గుమ్మడి విఠల్ రావు (గద్దర్) కాకతీయ మహాయుగానికి, తెలంగాణ విప్లవోద్యమానికి కారణమయిన తెలంగాణలో పుట్టి పెరిగిన వాడు. సామాజిక అసమానతలపైన, అన్యాయాలపైన అతని విమర్శ వ్యక్తిగతమైనది కాదు, వ్యవస్థాగతమైనది. నిత్య హత్యా సత్యమైన ఆస్తిహక్కుకు బద్ధవిరోధి. అది రద్దు కానంత వరకు ఈ కుల వ్యవస్థ, ఈ మత దురహంకార వర్గ సమాజం మారదనీ, మానవుడు మారడనీ నమ్ముతున్నవాడు. సరికొత్త బాణీలతో, సొంత గొంతుతో అట్టడుగు ప్రజల యాసలో, మాండలిక భాషలో కళారంగాన్ని విప్లవీకరించిన వ్యక్తిగా గద్దర్‌కు ఈ దేశంలోనే కాదు, ఖండాంతరాలలో కూడా పోలిక – నీగ్రో బానిసల బతుకులకు అర్థం చెప్పి వాళ్ళ బాధల గాథలే పల్లవిగా, అనుపల్లవిగా, వీధి వీధినీ గానం చేసి అజ్ఞాత జీవితాలకూ, అస్థిరమైన ప్రవాస జీవితాలకూ నాద బ్రహ్మగా నిలిచిన పాల్ రాబ్సన్ ఒక్కడే!

ఆ బానిసల గర్భశోకానికి శ్రుతిగా సంగీతం వెలయించిన పాల్ రాబ్సన్ 1950లలో 'ఫిస్క్ జూబ్లీ గాయకుల'కు ప్రత్యక్ష వారసుడు. స్పానిష్ అంతర్ యుద్ధంలో సమర గీతాలు ఆలపించాడు. ఈ సమర కళాయాత్రను సహించలేని అమెరికా పాలకులు రాబ్సన్ నోరు నొక్కబోయారు. అతని గాన సభలను దేశమంతటా నిషేధించారు. విదేశాలకు వెళ్ళకుండా పాస్‌పోర్ట్ నిరాకరించారు. అయినా జ్ఞాతంగానూ, అజ్ఞాతంగానూ దేశంలోనూ, దేశాంతరాలలోనూ ప్రభుత్వాలూ, అధికారులూ, సంస్థలూ, జీవన రంగంలో సర్వ విభాగాలకు చెందిన మేధావులూ రాబ్సన్‌ను తలకెత్తుకున్నారు.

అలాంటివాడు మన గద్దర్. 'ఫిస్క్ జూబ్లీ' గాయకులకు రాబ్సన్ వారసుడైనట్లే, నూతన ఫక్కీలో శ్రీకాకుళ గిరిజనోద్యమానికి అక్షర రూపమిచ్చిన జముకుల కథకు జనకుడు, గాయకుడూ అయిన పాణిగ్రాహి జానపద కళాసృష్టికీ ప్రత్యక్ష వారసుడు గద్దర్. పాణిగ్రాహి జముకుల కథలోని కథకుడైన చిన బాబు వయస్సు ఆనాటికి 14 ఏళ్ళే అయినా బుద్ధిలేని ప్రభుత్వం రైల్వే స్టేషన్లో జనం మధ్యనే అరెస్ట్ చేసి అర్ధరాత్రి అడవులలో 'ఎన్‌కౌంటర్' జరిపి ఆ 'అభిమన్యుడి'ని పొట్టన పెట్టుకుంది! నాటి ఆంధ్ర కళారంగంలో విప్లవానికి అదే నాంది. రచయితలను, కళాకారులను నిర్బంధించడం ఏ ప్రభుత్వ పతనానికైనా తొలి మెట్టు అవుతుంది. అప్పుడు ఎవరికి వారే ఆలోచించుకుని కాంగో కవి 'లెవెన్ ట్రీ' అన్నట్టుగా 'తన విముక్తికి తానే నడుం కడతాడు.'

కనుకనే శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంత కల్లోలానికి కలం, గళం సారథ్యం వహించిన పాణిగ్రాహి గానీ, తెలంగాణలో గిరిజన ప్రాంతాలలో దోపిడీ వ్యవస్థపై గజ్జె కట్టి గుండె చప్పుళ్ళు విన్పించిన గద్దర్ గానీ లక్షలాది జనాన్ని కదిలించారు. గద్దర్ బాణీ విప్లవ రచయితల సంఘానికి 'పారాణి'గా అమరింది. ఆంధ్ర ప్రజా నాట్యమండలి చేతుల మీదుగా, ఒకనాటి సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో పునరుద్ధరణ పొందిన ఎన్నో జానపద కళారూపాలు ఆనాటి వాతావరణాన్ని పుణికి పుచ్చుకోగా ఇటీవల పాణిగ్రాహి, గద్దర్ చేపట్టిన కళా రూపాలు సరికొత్త ఫక్కీలో తెలుగు భారతి నొసట వీర రస గంగాధర తిలకాలు దిద్దాయి!

అందుకే తెలుగు బుర్రకథను రమ్యమైన కళాఖండంగా తీర్చిదిద్ది దేశాన్ని ఊపివేసిన నాజర్ కూడా పాణిగ్రాహి, గద్దర్ ప్రయోగాలను కళ్ళ కద్దుకున్నాడు. కథకు, వర్ణనకు, హాస్యానికి, గంభీరతకు, రౌద్రానికి, కరుణకు, కాఠిన్యానికి, బీభత్సానికి, రమ్యతకు, సభ్యతకు – ఒకటేమిటి, నవరసాలకు మించిన నవ్య పోషణకు నగలు తొడిగే సామాన్యుని నాగరికతా సంస్కృతుల నట్టింటి మాణిక్యంగా గద్దర్ బృందం దిద్ది తీర్చినదే జన నాట్యమండలి! అమరవీరులను తలచుకుంటూ అతను రాసిన 'పాదాపాదాల పరిపరి దండాలు', 'సిరిమల్లె చెట్టుకింద', 'లాల్ సలామ్' పాటలు, ఖవాలీ, సంగీత నృత్య రూపకాలు మరపురాని కళాస్మృతులు. గద్దర్, వంగపండు ప్రసాద్ (విశాఖ బాణీలో) 'జజ్జనక జనారే' అనే పాట విన్నప్పుడు ఈ జోస్తాలే 'Rumba' పాట గుర్తుకొస్తుంది! గద్దర్ అంగోలా కవి అగస్తినో నేటో లాంటివాడు. గద్దర్ రాష్ట్ర సరిహద్దులు దాటి, దండకారణ్యంలో దూకి, రాముడికి బదులు పరశురాముడై సంచరించి, మణిపూర్, అస్సాం ఉద్యమాల ఊపిరిని కూడా పొదుగుకొని, భాషల అక్షరాభ్యాసం చేసి హైదరాబాద్‌లో మళ్ళీ పొద్దుపొడుపై వాలాడు!

– రచనా కాలం ఫిబ్రవరి 25, 1990

abkprasad2006@yahoo.co.in

సహజ వాగ్గేయకారుడు



సందర్భం



కత్తి పద్మారావు

జనం గుండెల నుంచి ప్రభవించిన సజీవ వాగ్గేయకారుడు గద్దర్. కవిత్వాన్ని పాటలో రంగరించి తత్వాన్ని బోధించిన మానవతా మూర్తి. ఆయన పాటల్లో పల్లె జీవన సంస్కృతీ వికాసం ఉంది. వేమన, పోతులూరి వీరబ్రహ్మం, కబీరు, సంత్ రవిదాసు సూక్తులు ఆయన పాటల్లో ప్రతిధ్వనిస్తుంటాయి. ఆయన 'జననాట్యమండలి' సృష్టికర్త. ఆయన నాలుక మీద ఆదిమ జాతుల స్వర విన్యాసం ఉంది. సముద్ర ఘోషను ఆయన ఊరిలోనికి మోసుకొచ్చాడు. అడవి వేదనలను రాజ్య ప్రసాదాల్లోకి ప్రవహింప చేశాడు.

నేను విశాఖపట్నం జైల్లో ఉన్నప్పుడు నక్సలైట్ సెల్ నుంచి 'సిరిమల్లె సెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో. నీవు సినబోయి కూచున్నవెందుకమ్మో ఎందుకమ్మో' పాట అర్ధరాత్రి పాడాడు. అది నాలో పునరుత్తేజాన్ని తీసుకొచ్చింది. దళిత వీరుల చెవుల్లో విప్లవ స్వరాన్ని వినిపించి సైనిక కవాతు చేయించిన సైన్యాధ్యక్షుడు ఆయన.

1985లో కారంచేడు ఉద్యమంలో మమేకమై 'దళిత పులులమ్మ, కారంచేడు భూస్వాములతో కలబడి నిలబడి పోరు చేసిన దళిత పులులమ్మ' అని దళితులకు చైతన్యాన్నీ, ధైర్యాన్నీ, పోరాట శక్తినీ కల్పించిన దళిత వీరుడు ఆయన. ఆయన తండ్రి అంబేద్కర్ స్థాపించిన మిలింద విశ్వవిద్యాలయానికి రాళ్లెత్తాడు. అంబేద్కర్ కుల నిర్మూలన ఉద్యమానికి గద్దర్ వెన్నుతట్టాడు. చేతిలో ఎర్ర జెండా ఉన్నప్పుడు కూడా గుండెల్లో అంబేద్కర్‌ని నింపుకున్నాడు. అందుకే ఆయన తన గమనంలో కుల నిర్మూలన వాదిగా ధ్వనిస్తూ వచ్చాడు. కులం మీద ఆయన గొడ్డలి వేటు వేశాడు. 'దళిత పులులమ్మ' పాటలో కథా కథన చాతుర్యాన్ని చూపాడు. గద్దర్ కారంచేడులో దళితులు చనిపోయిన ప్రదేశానికి వచ్చినప్పుడు 'వీళ్ళు పోరాటంలో చనిపోయారు గాని, పిరికివాళ్ళై చనిపోలేద'ని స్థానిక దళితులు చెప్పారు. అప్పుడు గద్దర్ ఈ పాట రాశాడు.

'దళిత పులులమ్మా / కారంచేడు భూస్వాములతోనే / కలబడి నిలబడి పోరు చేసినా/ మాల సాయిబు వడ్డెర జాతికి మాదిగపల్లె తల్లిలాంటిది/ శరణుకోరిన శత్రువునైనా ప్రేమతో చూసే పేదలపల్లె/ మాదిగపల్లె పేరు వింటిరా/ బరిశె నెత్తుకొని పందె మాడితే ఊరి దొరలకు ఉచ్చబడతది/ కోటి బాధలతో మునిగి తేలినా అన్న మాటకు అటుఇటు గారు/ వడ్డీల మీద వడ్డీలు గట్టి – నడ్డి విరిగినా బుద్ధిమంతులు/ మట్టిలో మట్టి మన్నులో మన్నై – పండించిన ప్రతి వడ్లగింజను/ బలిసిన దొరల గరిసెలు నింపి – పస్తులు పండే కష్ట జీవులు.'

ఈ పాట చరిత్రకు సాక్ష్యంగా నిలబడింది. దళితుల పోరాట పటిమకు అద్దం పడుతుంది. గద్దర్ దళిత బిడ్డ. ఆయన అంబేడ్కర్ బుర్రకథల ద్వారానే ముందుకు నడిచాడు. తరువాత జననాట్యమండలి నిర్మించాడు. పీపుల్స్‌వార్‌కు అనుబంధంగా జననాట్యమండలి కృషి చేసింది. జననాట్యమండలి ఆనాడు దళిత ఉద్యమానికి వ్యతిరేకంగా ఉంది. అది ఆనాడు దళిత ఉద్యమాన్ని హైజాక్ చేయాలని అనుకొంది. ఆ సందర్భంగా గద్దర్‌పై దళిత ఉద్యమ ప్రభావం పడింది. దాని ఫలితమే ఈ పాట. మొదటి సారిగా, జననాట్యమండలి పాటల్లో కులాధిపత్యం వర్గాధిపత్యాన్ని జోడించి పాడటం ప్రారంభమైంది గద్దర్‌తోనే! ఇది దళిత ఉద్యమ విజయం. ఈ పాటను 1985 సెప్టెంబర్ 1న 'చలో చీరాల' మహాసభలో గద్దర్ పాడాడు. ఈ పాట ఒక ఉజ్జ్వల జ్వలనాన్ని ప్రేక్షకుల్లో రూపొందించింది. సుమారు 3 లక్షల మంది దళితులు 'దళిత మహాసభ' ఆధ్వర్యంలో చీరాల హైస్కూలు గ్రౌండ్స్‌లో హాజరయ్యారు. ఈ వ్యాస రచయితే అధ్యక్షత వహించాడు. గద్దర్ నిజానికి ఒక తాత్వికుడు. నీకిష్టమైన పాటేదంటే 'ఏలరో ఈ మాదిగ బతుకు' అంటాడు. నిజానికి ఈ పాటలో ఈ దళిత కులాల జాతీయతను ఎలుగెత్తి చాటాడు గద్దర్:

'ఏలరో ఈ మాదిగ బతుకు మొత్తుకుంటే దొరకదురా మెతుకు/ బంగారు పంటలిచ్చె భరత గడ్డమనది / గంగమ్మ ప్రవహించే పుణ్యభూమి మనది / గంగ యమున బ్రహ్మపుత్ర కృష్ణ పెన్నా కావేరి/ ఎన్నెన్నో జీవ నదులు ప్రవహించే జీవగడ్డ / మాల మాదిగలకే మంచినీళ్లు కరువాయే' అని గద్దర్ సామాజిక తత్వాన్నీ, సామాజిక సమస్యనూ దళిత జాతీయ దృక్పథంతో అనేక పాటల్లో విశ్లేషిస్తాడు. దళిత ఉద్యమంలో పాటలు పాడే దళాలన్నీ అవి ఏ పేరుతో ఉన్నా గద్దర్, మాష్టార్జీ ప్రభావంతోనే పాటలు పాడుతూ వచ్చాయి. అందుకే దళిత ఉద్యమం మీద గద్దర్ ప్రభావం సాంస్కృతికంగా బలంగా ఉండనక తప్పదు. మనం ఎన్ని దృక్కోణాల నుంచి చూసినా ఆయన జాతి వైతాళికుడు. కుల మత భేదాలు లేని బౌద్ధ సిద్ధాంతగామి. ఆయన ఒక నశించని సామాజిక విప్లవ స్వరం. ఆయన పాటలతో లోకం మేల్కొంది. అందుకే ఆయన ఈ యుగం జాతి వైతాళికుడు. ఆయన పాటల బాటలో నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నేత | 98497 41695

గద్దరన్న యాడ బోలా..!

మీలోనే పుట్టినోణ్ణి
మీతోనే ఎదిగినోణ్ణి
మీతోనే నడుస్తు ఈ
లోకం తిరెరిగినోణ్ణి
ఈడకెళ్ళి యాడకెల్తునో
మిమ్మొదిలీ ఆడకెళ్ళి యాడబోదునో ॥

మీతోనే నేనుంటా

మీ ఇంటే నా వంటా
నిప్పులు చిమ్మే మీమీ
కలాల్లోనె నేనుంటా
జనకోపం మండే మీ
గళంలోనె నేనుంటా ॥ఈడ॥

మతం పిచ్చిపట్టినోళ్ళ
భరతం పట్టిస్తుంటా

గజ్జెల డమరుకమౌతూ
గుండెలదరగొడ్తుంటా
జాతుల చిచ్చునురేపే
మోసాల్ కనిపెడ్తుంటా
ప్రశ్నించే నాలుకనై
మీ గొంతుకలో నేనుంటా ॥ఈడ॥

గిరిజనులందరి గుండై

ఎల్లప్పుడు తోడుంటా
పీడిత బహుజనులందరి
దండోరానై ఉంటా
కసితో రగిలే కళ్ళలొ
ఎర్రని మెరుపై ఉంటా ॥ఈడ॥

గుండెల రాగం పలికే
పాటై మీ నోటుంటా
మీ మాటల తూటానై
నిత్యం పేల్తూ ఉంటా
ఉద్యమాల ఊపిరితో
రగిలే మీలో ఉంటా

ధనస్వామ్యం కాల్చేటేల
చేతిలొ చిచ్చై ఉంటా ॥ఈడ॥

తీగల తుప్పల గుట్టల
నడిరేతిరి నడ్చేటేల
అరె 'ఛల్ భయ్ హుసారంటు'
ఊతకర్రనై ఉంటా ॥ఈడ॥

పోరుబాటలో మీతో
పోరుపాటనై ఉంటా
సోషలిజం వెలుగులకై
కదిలే మీ ముందుంటా

పదండి పోదాం అంటూ
వెన్నుతడ్తు వస్తుంటా ॥ఈడ॥

పిచ్చిపట్టినోళ్ళ లెక్క
యాడేడల ఎతక్కుండ్రి
నిమ్మలంగ మనసువెట్టి
మీలో నన్నెతుక్కోండ్రి
మిమ్మొదిలీ యాడకెళ్ళలా..!
మీ గుండె గూటిలోనె ఉండినా ॥

– ఏటుకూరి ప్రసాద్

ప్రహ్లాద్ జోషీ (కేంద్ర మంత్రి)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఆగస్టు 11వ తేదీ రాత్రి నా అంతరాత్మ నన్ను నిద్రలేపి, "నా కోసం కాసేపు మేల్కొని ఉండగలవా ప్రహ్లాద్?" అని అడిగింది! పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసిన రోజు రాత్రి అది.

"నువ్వెంతసేపటి నుండి మేల్కొని ఉన్నావ్?" అని నా అంతరాత్మను అడిగాను.. నిద్రాభంగమైన కళ్లను నులుముకుంటూ.

"అంతరాత్మలకు నిద్రపడుతుందా ప్రహ్లాద్… అవి మేల్కొని ఉండటానికి?" అంది అంతరాత్మ!!

అంతరాత్మలకు నిద్ర పట్టకపోవడం ఏంటి? నేనెన్నిసార్లు నా అంతరాత్మను దగ్గరుండి నిద్రపుచ్చలేదు?!

బయటికి చూశాను. అద్దాల్లోంచి చప్పుడు వినిపించడం లేదు కానీ, పెద్ద చప్పుడుతోనే వర్షం పడుతున్నట్లుగా ఉంది.

"వర్షాకాల సమావేశాలు ముగిసినా, వర్షాలు ముగిసినట్లు లేవు…" అన్నాను వర్షం వైపు చూస్తూ.



"సమావేశాలు ముగిశాయని చెప్పి వర్షాలు ముగియాలనేముంది ప్రహ్లాద్… ఏదో ఒకటి మాట్లాడి నన్ను నిద్రపుచ్చాలని కాకపోతే?! అవి వర్షాకాలంలో జరిగే సమావేశాలే కానీ, ఇవి సమావేశాల కాలంలో పడుతున్న వర్షాలు కావు.." అంది అంతరాత్మ.

"లేదు లేదు.. నిన్ను నిద్రపుచ్చాలని ఏదో ఒకటి మాట్లాడలేదు. ఏదో ఒకటి మాట్లాడకపోతే నిన్ను చిన్నబుచ్చినట్లవుతుందని మాట్లాడానంతే.." అన్నాను.

"నన్ను చిన్నబుచ్చినా పెద్దగా పట్టించుకోను ప్రహ్లాద్! నిద్రపుచ్చాలని చూస్తేనే లేచి కూర్చుంటాను. ఒకటి చెప్పు. పార్లమెంటరీ ఎఫైర్స్ మినిస్టర్‌వి కదా… అవిశ్వాస తీర్మానంపైన రాహుల్ 40 నిమిషాలు మాట్లాడితే ఆయన్ని పార్లమెంటు టీవీలో 14 నిమిషాలు మాత్రమే చూపించారు. నిజానికి ఫోకస్ ఎవరి మీద ఉండాలి? మాట్లాడే ఎంపీ మీదా, మాట్లాడేందుకు అనుమతి ఇచ్చిన స్పీకర్ మీదా?" అని అడిగింది అంతరాత్మ.

"పార్లమెంట్ ఎఫైర్స్‌తోనే నాకు సరిపోయింది. పార్లమెంట్ టీవీ ఎఫైర్‌ని కూడా ఎక్కడ పట్టించుకునేది?" అన్నాను.

"పోనీ అది వదిలెయ్! మోదీజీ ఒక గంటా నలభై నిమిషాలు మాట్లాడితే అందులో పది నిమిషాలు కూడా మణిపూర్‌పై మాట్లాడలేదు!" అంది అంతరాత్మ!

ప్రధాని ఏం మాట్లాడాలో, ఎంతసేపు మాట్లాడాలో ఒక పార్లమెంటరీ ఎఫైర్స్ మినిస్టర్ నిర్ణయించగలడా? నిద్రపోతున్న మనిషిని లేపి ఈ క్వొశ్చన్ అవర్ పెట్టడం ఏంటో!

బయట వర్షం ఆగడం లేదు. లోపల అంతరాత్మ ప్రశ్నలు ఆగడం లేదు.

"సభను సరిగా నడిపించడానికే కదా స్పీకర్ ఉన్నది. సభ సరిగా నడవడం లేదని స్పీకరే సభ నుంచి వెళ్లిపోవడం ఏంటి?!"

"రోజూ బల్ల పైకి బిల్లులు రావడం, అంతా వాకౌట్ చేయడం. వాకౌట్ చేసిన వాళ్లు లేకుండానే బిల్లులు ఓకే అవడం ఏంటి?!"

"వాళ్లు రూల్ 267 అంటారు. మీరు రూల్ 176 అంటారు. వాళ్లు 176 కాదు, 267 కాదు… రూల్ 167 అంటారు. ఏ రూల్ ప్రకారం మణిపూర్‌పై డిబేట్ జరిగితే ఏంటి ప్రహ్లాద్? డిబేట్ జరగడం ముఖ్యం కానీ!"

అంతరాత్మ ఆగట్లేదు. కురుస్తూనే ఉంది!

"నువ్వొక్కదానివే అంతరాత్మవి అనుకోకు. మోదీజీకి, అమిత్‌షాకు, రాజ్‌నాథ్‌సింగ్‌కి, నితిన్ గడ్కరీకి, నిర్మలా సీతారామన్‌కి కూడా అంతరాత్మలు ఉంటాయి. వాటికి లేని పార్లమెంటరీ విలువలు నీకెందుకు? పార్లమెంటరీ వ్యవహారాల మంత్రినైనంత మాత్రాన నాకెందుకు?" అన్నాను.

అంతరాత్మ మరేం మాట్లాడలేదు. వెళ్లి పడుకున్నాను. ఎంతకూ రెప్పలు వాలడం లేదు. ఏదో కదులుతున్న చప్పుడవుతోంది!

అంతరాత్మను నిద్రపుచ్చాం అనుకుంటాం కానీ… అది నిద్రపోతోందని ఏంటి నమ్మకం?!

జోకొట్టి నిద్రపుచ్చిన శిశువులు అక్కడి నుంచి మనం లేవగానే చప్పున తలెత్తి మనవైపు చూసినట్లే ఈ అంతరాత్మలు కూడా!!

అలా ఏర్పడి… ఇలా మారింది పాకిస్తాన్!

సందర్భం



జిల్లా గోవర్ధన్

స్వాతంత్ర్య దినోత్సవం దేశ విభజన గాయాలను కూడా గుర్తు చేస్తుంది, అయితే అఖండ భారత్ నుంచి పాకిస్తాన్ వేరుపడటానికి ముందు అనంతర పరిణామాలు ఆసక్తికరం.

'లేకే రహెంగే పాకిస్తాన్' నినాదంతో 1946లో, మహమ్మద్ అలీ జిన్నా నేతృత్వంలో ముస్లింలీగ్, నార్త్ ఇండియాలో ఉద్యమం ఉద్ధృతం చేసింది. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ ఉపాధ్యాయులు, విద్యార్థులు లీగ్ ప్రోద్బలంతో క్లాసులు మానేసి ఈ ఉద్యమంలో చేరారు. బ్రిటిష్ ఇండియాలోని 39 కోట్ల జనాభాలో (1947), ముస్లింల సంఖ్య ఎనిమిది కోట్లు. దేశ విభజనను కాంగ్రెస్ నాయకులే కాదు, 'జమియత్ ఉల్ ఉలేమా ఇ హింద్'కు చెందిన మౌలానా హుసేన్ అహ్మది మదాని, దేవబందీ తెగకు చెందిన ప్రగతివాద ముస్లింలు కూడా వ్యతిరేకించారు అప్పట్లో.

పాకిస్తాన్ ఇవ్వకుండా బ్రిటిష్ 'రాజ్' భారత ఉపఖండం వదలి వెళ్ళటానికి వీల్లేదని భీష్మించుకు కూర్చుంది లీగ్ నాయకత్వం. ఈ అజెండా అమలు చేయక తప్పలేదు రాజ్‌కు. దీనికోసం రాయల్ నేవీ అధికారి లార్డ్ లూయిస్ మౌంట్ బాటెన్‌ను నూతన వైస్రాయ్‌గా ఢిల్లీకి పంపింది లండన్. పదవీ బాధ్యతలు స్వీకరించక ముందే ఇక్కడి రాజకీయ పరిస్థితులు క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మౌంట్ బాటెన్ 1946 డిసెంబరులో భారత్ రావటంతోనే కాంగ్రెస్, ముస్లింలీగ్ అగ్ర నాయకులు ఒక్కొక్కరితో మొదటి దఫా సుదీర్ఘ చర్చలు జరిపి, 'పార్టిషన్ అండ్ ఇండిపెండెన్స్'ను సమర్థిస్తూ సీనియర్ నాయకులకు కొన్ని షరతులు విధించారు. జవహర్ లాల్ నెహ్రూ, వల్లభాయి పటేల్ (కాంగ్రెస్), మహమ్మద్ అలీ జిన్నా (ముస్లిం లీగ్)లతో మాత్రమే దేశ విభజన సమస్యను చర్చించదలచుకున్నట్లు ఆయన మొదటి కండిషన్. మహాత్మా గాంధీని సైతం వైస్రాయ్ ఆమడ దూరం ఉంచటం విశేషం.

బ్రిటన్ పార్లమెంట్‌లో ప్రధాని క్లెమెంట్ ఆట్లీ 1947 జూన్ 3న భారత ఉపఖండాన్ని రెండుగా విభజించి స్వాతంత్ర్యం ప్రకటించబోతున్నట్టు వెల్లడించాడు. ఆ తర్వాత ఆగస్టులో 'బోర్డర్ కమిషన్' తయారు చేసిన రిపోర్టును అనుసరించి 'హరీబరీ'గా సరిహద్దు గీతలు గీసి, వాయవ్య భారత్, సింధ్, పశ్చిమ పంజాబ్, తూర్పు బెంగాల్ ప్రాంతాలను విభజిస్తూ కొత్త దేశం 'పాకిస్తాన్' ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు వైస్రాయ్. వాస్తవానికి, 'ముస్లిం వేర్పాటు వాదం' బీజం తొలినాళ్లలో యునైటెడ్ ప్రావిన్స్ (ఆగ్రా, ఔధ్)లో అంకురార్పణ జరిగింది. పంజాబ్‌తో పాటు, రాజస్థాన్, ఢిల్లీ, యునైటెడ్ ప్రావిన్సులోని ఆగ్రా, లక్నో ప్రాంతాల వరకు పాకిస్తాన్‌లో విలీనం చేయాలనే లీగ్ నాయకుల ప్రతిపాదనను తోసిపుచ్చాడు డిక్కీ మౌంట్ బాటెన్. మొత్తానికి తను కలలు కన్న ముస్లిం దేశం తాను బతికుండగానే నిజమౌతున్నందుకు జిన్నా ఆనందానికి అవధులు లేవు (అప్పటికే క్షయ వ్యాధి గ్రస్తుడు ఆయన).

ఇక 1947 జూన్ నుండే సరిహద్దుల్లో వలసలు, హత్యల ప్రభావంతో హిందూ – ముస్లింల రక్తం ఏరులై ప్రవహించటం



మొదలయ్యింది. మరో వైపు యునైటెడ్ ప్రావిన్స్ నుండి ముస్లిం లీగ్ 7000 మంది ముస్లిం బ్యూరాక్రాట్స్, పోలీస్ సిబ్బందిని కొత్త దేశంలో సుస్థిర పరిపాలనా వ్యవస్థ కోసం వారి కుటుంబాలతో సహా అప్పటి రాజధాని కరాచీ నగరం తీసుకెళ్ళింది. దీనికి అప్పట్లో 55 లక్షల రూపాయలు ఖర్చు చేసిందట పాకిస్తాన్. లీగ్ ప్రముఖ నాయకులతో పాటు, ఫ్యూడల్ కుటుంబీకులు, నవాబులు, ధనిక భూస్వాములు ఇండియా వదలి పాకిస్తాన్‌కు తరలిపోయారు. సామాన్య ముస్లింలను మాత్రం వాళ్ళ 'నసీబ్'కే వదిలారు లీగ్ అగ్ర నాయకులు.

ఇక భారత్ నుండి ముస్లింల వలసలు మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. నాలుగు నెలల తర్వాత (డిసెంబరులో) పాకిస్తాన్ ప్రధాని లియాఖత్ అలీ ఖాన్… ఢిల్లీ, యునైటెడ్ ప్రావిన్స్ ప్రాంతాల నుండి తరలి వస్తున్న ముస్లింలకు సరిహద్దులు మూసి వేస్తున్నట్టు వెల్లడించారు. అటు నుండి హిందూ శరణార్థుల రాక మాత్రం ఆగలేదు. ఇస్లామిక్ కొత్త దేశం 'పాకిస్తాన్' ముస్లింల కోసమే అని ఛాతీ చరుచుకుని పలికిన ముస్లిం లీగ్ నాయకులు వారి ఎంట్రీనే ఆపడంతో యునైటెడ్ ప్రావిన్స్‌లో ముస్లింలతో పాటు కాంగ్రెస్ నాయకులు కూడా ఆశ్చర్యపోయారు. యునైటెడ్ ప్రావిన్స్ శాసనసభలో ఈ విషయం చర్చకు రావటంతో అప్పటి కాంగ్రెస్ యువ శాసన సభ్యుడు చౌధురి చరణ్ సింగ్ (1979లో ఈయన దేశ ప్రధాని అయ్యారు), భారత్ నుండి ముస్లింలను రానివ్వని పాకిస్తాన్‌ను తిరిగి భారత్‌లో కలిపి తీరాలని కేంద్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. శాసన సభలో ముస్లింలీగ్ నాయకులు కూడా పాకిస్తాన్ ప్రభుత్వ వైఖరిపై దుమ్మెత్తి పోయడం ఆరంభించారు. నేషనలిస్ట్ ముస్లిం నాయకుడు హఫీజ్ మహ మ్మద్ ఇబ్రహీం లక్నో సభలో మాట్లాడుతూ – రౌడీయిజం, వేర్పాటువాదంతో హిందూ – ముస్లిం మతాల్లో అల్లర్లు లేవనెత్తి భారతీయ ముస్లింలను అనాథలుగా మార్చిన ముస్లింలీగ్ పార్టీని ఇక రద్దు చేయాలన్నారు.

అదే నెల (డిసెంబరు) అక్కడ పాకిస్తాన్ కరాచీ నగరంలో జరిగిన 'ఆల్ ఇండియా ముస్లిం లీగ్' పార్టీ సదస్సులో, భారత్ నుండి తరలి వచ్చిన యువ నేత జమాల్ మియా, పార్టీ అధినేత జిన్నాను తన ప్రశ్నల వర్షంతో ఉక్కిరి బిక్కిరి చేశారు. 'ఇస్లామిక్ నేషన్‌ను స్థాపించి, ఇస్లాం మతస్థులను ఈ దేశంలోకి రానివ్వక పోవడం శోచనీయం. లక్షలాది ముసల్మాన్లను భారత్‌లో వదలి వేయటం, మీ సియాసత్‌కు న్యాయమేనా ?' అని సూటి ప్రశ్న వేశారు. యునైటెడ్ ప్రావిన్స్‌లో జిన్నా నాయకత్వానికి జేజేలు పలికిన ముస్లిం భాయిలనే, 'ఖైద్-ఏ-ఆజం' ఇప్పుడు నట్టేట్లో వదిలాడని లీగ్ కార్యకర్తల సమక్షంలోనే దుయ్యబట్టారు జమాల్ మియా. మౌనం వహించడం జిన్నా వంతైంది. ఇక భారత్ నుండి పాకిస్తాన్ వచ్చిన ధనిక ముస్లింలు, సాహిబ్‌జాదాలు కొన్ని రోజులకే యూరోప్, కెనడాల కెళ్లి స్థిరపడ్డారు.

పాకిస్తాన్ ఏర్పడిన పదమూడు నెలలకే (1948 సెప్టెంబరు 11) మహమ్మద్ అలీ జిన్నా తనువు చాలించటం, ప్రధాన మంత్రి లియాఖత్ అలీ ఖాన్ హత్యకు గురికావటంతో అక్కడ రాజకీయ అస్థిరత నెలకొంది. నాయకత్వ లోపం వల్ల ముస్లిం లీగ్ పార్టీ చీలి ముక్కలైపోయింది. అప్పటి నుంచి సైన్యం ఆధిపత్యం పాక్‌లో పెరిగిపోయింది.

(వెంకట్ ధూళిపాళ రచన 'క్రియేటింగ్ ఎ న్యూ మదీనా' ఆధారంగా రాసిన వ్యాసం)

వ్యాసకర్త విశ్రాంత పీఎఫ్ కమిషనర్, ముంబై
(భారత విభజన, పాకిస్తాన్ ఆవిర్భావ దినం సందర్భంగా)

ప్రతిదీ ప్రత్యేకమే

ఆయన ఓ గురువు. ఆయన దగ్గర ఇద్దరు శిష్యులు ఉన్నారు. ఆ ఇద్దరిలో ఒకడు బలంగా ఉంటాడు. మరొకతను బక్కపల్చ మనిషి. ఎప్పుడూ బలహీనంగా కనిపిస్తుంటాడు. దాంతో బలవంతుడు అతనిని హేళన చేస్తూ నవ్వుకునేవాడు. బక్క శిష్యుడి మనసు నొచ్చుకునేది. ఒకరోజు ఉండబట్టలేక అతను గురువుగారి దగ్గరకు వెళ్ళి బలవంతుడు తనను హేళన చేస్తూ ఏడిపించడాన్ని చెప్పి బాధపడ్డాడు. అతను చెప్పినదంతా మౌనంగా విన్న గురువుగారు అప్పటికేదో సర్ది చెప్పి పంపించేశాడు.

మరుసటి రోజు ఉదయం గురువుగారు ఆ ఇద్దరు శిష్యులను అడవికి తీసుకుపోయారు. అక్కడ పక్కపక్కనే పెరిగిన రెండు వెదురు చెట్లను చూడమన్నారు శిష్యులతో! ఆ రెండు చెట్లలో ఒకటి దృఢమైనది. మరొకటి సన్నది. ఇంతలో గాలి వేగంగా వీచింది.

జ్యోతిర్మయం

అప్పుడు బలంగా ఉన్న వెదురు చెట్టు సన్నపాటి వెదురు చెట్టుతో 'నేను చూడు. ఎంత గాలి వచ్చినా ఎంత నిశ్చలంగా ఉన్నానో చూడు. నువ్వు కాస్తంత గాలి వేగానికే దయ్యం పట్టినట్టు ఊగు తున్నావు. నువ్వు సగానికి విరిగిపోతావని పిస్తోంది' అంది ఒకింత గర్వంతో.

అప్పుడు గురువుగారు శిష్యులతో చెప్పారిలా…

"కాలక్రమేణా ఈ దృఢమైన వెదురు చెట్టును నరికి మనుషులు మెట్లు, నిచ్చెనలు తయారు చేస్తారు. వాటిని మనుషులు ఎక్కడానికీ, దిగడానికీ ఉపయోగిస్తుంటారు. కానీ మృదువైన సన్నని వెదురుతో మనిషి వేణువు చేసి పట్టు వస్త్రం మధ్య ఉంచి ఓ పెట్టెలో పదిలంగా చూసుకుంటాడు. ఆ వేణువు సుస్వర నాదాన్ని వినిపించి మనిషి మనసును తేలికపరుస్తుంది. ఒత్తిడిని తీసేస్తుంది. కనుక భగవంతుడి సృష్టిలో ప్రతి ఒక్క దానికీ ఓ ప్రయోజనం ఉంటుంది. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది.

ఎవరి గొప్పతనం వారిదే! ఎవరూ తక్కువా కాదు, ఎక్కువా కాదు. మనకేదో గొప్పతనముందని విర్రవీగక అవతలివారిలో ఉన్న ప్రత్యే కతను గ్రహించి వారితో సవ్యంగా ప్రవర్తించాలి. అంతేతప్ప ఎవరి మనసూ నొప్పించేలా మాట్లాడకూడదు. ఒక్కొక్కరూ ఒక్కో సమయంలో గొప్పగా అనిపిస్తారు. కనుక మీ ఇద్దరికీ నేను చెప్పిన విషయం అర్థమయ్యే ఉంటుంది అనుకుంటాను" అన్నారు.

ఈ మాటల వెనుక ఉన్న అంతరార్థాన్ని గ్రహించిన బలవంతుడైన శిష్యుడు తన బక్క స్నేహితునికి క్షమాపణలు చెప్పి ఆనాటి నుంచీ ఎంతో స్నేహంగా మెలగడం ప్రారంభించాడు.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఆర్టీసీ బస్సు ఎక్కడుందో చెబుతుంది

- 4,170 ఆర్టీసీ బస్సులకు ట్రాకింగ్
- ఒక్క క్లిక్‌తో ఏ బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు
- అత్యాధునిక ఫీచర్లతో 'గమ్యం' యాప్ సేవలు
- లాంఛనంగా ప్రారంభించిన సంస్థ ఎండీ వీసీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్/అఫ్జల్‌గంజ్

లక్షలాది మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలను మరింత సులభతరం చేసేందుకు టీఎస్ఆర్టీసీ మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, వివిధ రకాల ఫీచర్లతో రూపొందించిన ఆర్టీసీ బస్ వెహికల్ ట్రాకింగ్ మొబైల్ యాప్ 'గమ్యం'ను ఆ సంస్థ ఎండీ సజ్జనార్ శనివారం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో లాంఛనంగా ప్రారంభించారు. 'గమ్యం' యాప్ లోగోను ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో తిరిగే పుష్పక్, మెట్రో బస్సులతో పాటు దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సులు, జిల్లాల్లో తిరిగే పల్లె వెలుగు బస్సులను కూడా 'గమ్యం' యాప్ ద్వారా ట్రాకింగ్ చేయవచ్చు. సుమారు 4,170 బస్సులను వెహికల్ ట్రాకింగ్ వ్యవస్థతో అనుసంధానం చేశారు. ప్రయాణికులు తాము ఎంపిక చేసుకున్న బస్సు ఎక్కడుందో, ఎంతసేపట్లో తాము ఎదురుచూసే బస్‌స్టేషన్‌కు చేరుకుంటుందో కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దశలవారీగా ఆర్టీసీలోని అన్ని బస్సులను ట్రాకింగ్ వ్యవస్థతో అనుసంధానిస్తారు. అక్టోబర్ నాటికి అన్ని బస్సులకు ట్రాకింగ్ సదుపాయం వస్తుందని అధికారులు తెలిపారు.

కొత్తగా 776 బస్సులు: ఎండీ సజ్జనార్

ఈ సందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ, 'గమ్యం' యాప్ ద్వారా ప్రతి బస్సు వాస్తవ స్థితి కచ్చితంగా తెలుస్తుందన్నారు. మొబైల్ ఫోన్ ఉన్న ప్రతి ప్రయాణికుడు తాను ప్రయాణం చేసే బస్సును ప్రతి క్షణం ట్రాక్ చేయవచ్చునన్నారు. ప్రతి రోజూ 45 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారన్నారు. రవాణారంగంలో పోటీని ఎదుర్కొనేందుకు అత్యాధునిక హంగులతో రూపొందించిన 776 కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.'' 'గమ్యం' మొబైల్ యాప్‌లో ఏ బస్సు ఎక్కడుందో తెలుసుకోవడమే కాకుండా, బస్సు నడిపే డ్రైవర్, కండక్టర్ వివరాలను కూడా తెలుసుకోవచ్చు. సిటీ బస్సులకు రూట్ నంబర్ ఎంటర్ చేస్తే ఆ బస్సు ఎక్కడుందో తెలిసిపోతుంది. దూరప్రాంత సర్వీసులకు రిజర్వేషన్ నంబర్ ఆధారంగా బస్సులను ట్రాకింగ్ చేయొచ్చు'' అని ఎండీ తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా. రవీందర్, ఈడీలు పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, జేడీ (వి అండ్ ఎస్) సంగ్రామ్ సింగ్ పాటిల్, డిజిటల్ ఐటీ కన్సల్టెంట్ దీపా కోడూర్, మ్యాప్ మై ఇండియా ప్రతినిధి హర్మన్ సింగ్ అరోరా, చీఫ్ ఫైనాన్స్ మేనేజర్ విజయపుష్ప, సీఈ రాజశేఖర్, రంగారెడ్డి ఆర్.ఎం. శ్రీ శ్రీధర్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు 'ఫ్లాగ్ ఏ బస్' ఫీచర్

- మహిళా ప్రయాణికుల భద్రత కోసం గమ్యం యాప్ లో 'ఫ్లాగ్ ఏ బస్' అనే సరికొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టారు. రాత్రి వేళల్లో బస్టాప్‌లు లేని ప్రాంతాల్లో ఈ ఫీచర్ మహిళా ప్రయాణికులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది.
- రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు ఫ్లాగ్ ఏ బస్ ఫీచర్ అందుబాటులో ఉంటుంది. యాప్‌లో వివరాలు నమోదు చేయగానే తమ స్మార్ట్ ఫోన్‌లో స్క్రీన్‌పై ఆటోమేటిక్‌గా గ్రీన్ లైట్ ప్రత్యక్షం అవుతుంది. ఆ లైట్‌ను డ్రైవర్ వైపునకు చూపించగానే.. సంబంధిత డ్రైవర్ బస్సును ఆపుతారు. దీంతో మహిళలు క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.
- అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఓఎస్ బటన్ ద్వారా టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్‌ను సంప్రదించే సదుపాయం ఉంది. డయల్ 100, 108కి కూడా ఈ యాప్‌ను అనుసంధానం చేసినట్లు అధికారులు తెలిపారు. యాప్ నుంచే నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వవచ్చు.
- బస్సు బ్రేక్ డౌన్, వైద్య సహాయం, రోడ్డు ప్రమాదం, తదితర వివరాలను ఈ యాప్ ద్వారా ప్రయాణికులు రిపోర్టు చేయొచ్చు. ఆ వివరాల ఆధారంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.



టీఎస్ఆర్టీసీ బస్ ట్రాకింగ్ యాప్‌ను ప్రారంభిస్తున్న సంస్థ ఎండీ సజ్జనార్ తదితరులు

గమ్యం డౌన్‌లోడ్ ఇలా

- 'TSRTC Gamyam' పేరుతో గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. టీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ www.tsrtc.telangana.gov.in నుంచి కూడా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ఈ యాప్‌లో ప్రయాణికులు ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేదు.. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంది.
- ఇప్పటికే మొబైల్‌ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేసుకున్న వాళ్లు అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి.

చేపలను శాకాహారంలో చేర్చాలి

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



సాక్షి, చెన్నై: మనిషి శరీరానికి కావాల్సిన శక్తిని ఇచ్చే చేపలను శాకాహారంలో చేర్చాలని తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. చెన్నై తరమణిలోని ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ నేతృత్వంలో జరిగిన 'సముద్ర జలరాశులు–సమాచార వ్యవస్థ' అనే సమావేశానికి తమిళిసై హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ మనిషి శరీరానికి ఎక్కువ శక్తిని చేపలు ఇస్తున్నాయని, దీనిని శాకాహారం పరిధిలోకి తీసుకురావచ్చని సూచించారు. గుడ్డు తరహాలో చేప కూడా శాకాహారంగా తీసుకోవచ్చు అన్న తన సూచనను వివాదంగా మార్చినా మార్చేస్తారని చమత్కరించారు. పశ్చిమ బెంగాల్‌లో చేపలను ఫ్లవర్ ఆఫ్ సీగా భావిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

10 రోజులు.. రూ.14,324 కోట్లు



సర్కార్ ఖజానాకు భారీ ఆదాయాన్నిచ్చిన హెచ్ఎండీఏ

సాక్షి, హైదరాబాద్: భూముల అమ్మకాలు, ఔటర్ లీజు రూపంలో ప్రభుత్వానికి పది రోజుల్లో ఏకంగా రూ.14,324 కోట్ల ఆదాయం సమకూరింది. జీఓ 111 రద్దు అనంతరం రియల్ భూమ్ పడిపోయిందనుకుంటున్న తరుణంలో హెచ్ఎండీఏ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు పోటాపోటీగా పాల్గొన్నాయి. దీంతో హెచ్ఎండీఏకు భారీఎత్తున ఆదాయం లభించింది. ఈ నెల మొదటి వారంలో కోకాపేట్‌లోని నియోపోలిస్ రెండో దశ భూములకు నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో 45.33 ఎకరాలపై ఏకంగా రూ.3,319.60 కోట్ల ఆదాయం లభించింది. అనూహ్యంగా ఎకరం రూ.100 కోట్లకుపైగా అమ్ముడు కావడం సంచలనంగా మారింది. కోకాపేట్‌లో సగటున ఎకరం రూ.73.23 కోట్ల చొప్పున విక్రయించగా, బుద్వేల్‌లో ఎకరానికి గరిష్టంగా రూ.41.25 కోట్ల చొప్పున అమ్ముడైంది. సగటున ఎకరం రూ.36.25 కోట్ల చొప్పున విక్రయించారు. బుద్వేల్‌లో మొత్తం 100.01 ఎకరాలపై ప్రభుత్వానికి రూ.3,625.73 కోట్లు ఆదాయం లభించింది.

- ఔటర్‌రింగ్ రోడ్డు లీజును దక్కించుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ తాజాగా రూ.7,380 కోట్లను ఏకమొత్తంగా హెచ్ఎండీఏకు చెల్లించింది. దీంతో గత పది రోజుల్లోనే సుమారు రూ.14,324 కోట్లకు పైగా ఆదాయాన్ని హెచ్ఎండీఏ సమకూర్చింది. మరోవైపు మోకిల, షాబాద్‌లలో విక్రయించిన ప్లాట్‌లపైనా రియల్ ఎస్టేట్ వర్గాలు, మధ్య తరగతి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. ఈ నెలలో మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని మరిన్ని భూములను విక్రయించేందుకు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారు. వచ్చే నెల రోజుల్లో మరో రూ.వెయ్యి కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉన్నట్లు హెచ్ఎండీఏ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇక 'ఐఆర్‌బీ' ఔటర్..

- హైదరాబాద్ నగరం చుట్టూ మణిహారంలా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్డు ఐఆర్‌బీ ఖాతాలో చేరిపోయింది. లీజు ఒప్పందం ప్రకారం రూ.7,380 కోట్లను ఐఆర్‌బీ సంస్థ శుక్రవారం అర్ధరాత్రి హెచ్ఎండీఏకు చెల్లించింది. టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతిలో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్‌రోడ్డు లీజును దక్కించుకున్న సంగతి తెలిసిందే. 30 ఏళ్ల పాటు లీజు కొనసాగనుంది. సెప్టెంబరు 24 వరకు టెండర్ మొత్తాన్ని చెల్లించేందుకు గడువు ఉన్నప్పటికీ ఆగస్టులోనే చెల్లించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఇప్పటి వరకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని హెచ్‌జీసీఎల్ నిర్వహణలో ఉన్న ఔటర్ శుక్రవారం అర్ధరాత్రి నుంచే ఐఆర్‌బీ అనుబంధ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహణలోకి వెళ్లినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.
- ఆది నుంచీ వివాదాస్పదంగా మారిన ఔటర్ లీజు వ్యవహారంలో అధికారులు చివరి నిమిషం వరకు గోప్యతను పాటించారు. టెండర్ నిబంధనల మేరకు లీజు మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉండడంతో లీజు సొమ్ము చేతికి అందే వరకు బయటికి రాకుండా అధికారులు జాగ్రత్తలు పాటించారు. నానక్‌రాంగూడలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో ఎంతో జాగ్రత్తగా లీజు ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో ఇప్పటి వరకు హెచ్‌జీసీఎల్ పక్షాన టోల్ వసూలు చేసిన ఈగిల్ ఇన్‌ఫ్రా నుంచి ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వేకు టోల్ నిర్వహణ బదిలీ అయింది.
- 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో 121కి పైగా టోల్‌గేట్లు ఉన్నాయి. ప్రతి రోజు లక్షకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి.కొంతకాలంగా ఔటర్‌పై వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. ప్రతి నెలా సుమారు రూ.550 కోట్ల వరకు టోల్ రూపంలో ఆదాయం వస్తోంది. ఇకనుంచి ఈ మొత్తం ఐఆర్‌బీ ఖాతాలోకి వెళ్లనుంది.

వలంటీర్లు దండుపాళ్యం బ్యాచ్!

- మళ్లీ నోరు పారేసుకున్న పవన్ కళ్యాణ్

సాక్షి, విశాఖపట్నం: వలంటీర్లపై కత్తి కట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మరోసారి నోరు పారేసుకున్నారు. ఈసారి వలంటీర్లను దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చారు. ఇటీవల ఆయన మహిళల కిడ్నాప్‌లకు సహకరించే సంఘ విద్రోహశక్తులంటూ అభివర్ణించిన విషయం తెలిసిందే. దీనిపై ఏపీ వ్యాప్తంగా వలంటీర్లు ఆగ్రహోదగ్రులయ్యారు. గత వ్యాఖ్యల దుమారం ఇంకా చల్లారకముందే మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గత నెలలో విశాఖ జిల్లా పెందుర్తి మండలం సుజాతనగర్‌లో బంగారం కోసం ఓ వృద్ధురాలిని వెంకటేష్ అనే వ్యక్తి హత్య చేశాడు. గతంలో ఇతను వలంటీర్‌గా పని చేస్తున్నప్పుడు ఫిర్యాదులు రావడంతో అధికారులు తొలగించారు. ఇది వృద్ధురాలి హత్యకు ముందే జరిగింది. ఈ నేపథ్యంలో విశాఖ వారాహి యాత్రలో ఉన్న పవన్ శనివారం హతురాలు వరలక్ష్మి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'వలంటీర్లు దండుపాళ్యం బ్యాచ్‌లా తయారయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాల కోసం నియమించిన వలంటీర్ వ్యవస్థ ఈ రోజు ప్రజల ప్రాణాలు తీస్తోంది. వీరు అసాంఘిక శక్తుల్లా మారి నేరాలకు తెగబడుతున్నారు. పోలీస్ వెరిఫికేషన్ లేకుండా వలంటీరు ఉద్యోగాలిస్తున్నారు' అని ధ్వజమెత్తారు.

టీచర్ మందలించారని.. తండ్రి తిట్టారని..

- వేర్వేరు చోట్ల ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య
- ఖమ్మం, వికారాబాద్ జిల్లాల్లో ఘటనలు


గుగులోతు విష్ణు

తిరుమలాయపాలెం (ఖమ్మం జిల్లా)/ తాండూరు (వికారాబాద్ జిల్లా): బాగా చదువుకోవాలని టీచర్ మందలించడంతో మనస్తాపం చెందిన ఓ ఇంటర్ విద్యార్థి, చెడు సావాసాలకు వెళ్లొద్దంటూ తండ్రి హెచ్చరించడంతో అవమానంగా భావించిన ఓ టెన్త్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఖమ్మం, వికారాబాద్ జిల్లాల్లో వేర్వేరు చోట్ల శనివారం జరిగిన ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని హైదర్‌సాయిపేటకు చెందిన గుగులోత్ కృష్ణ – రమి కుమారుడు విష్ణు(17) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చేరాడు. ఈనెల 7న టీసీ, ఇతర సర్టిఫికెట్ల కోసం తండ్రి కృష్ణతో కలిసి పదో తరగతి చదివిన పాఠశాలకు వచ్చాడు. ఈ క్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ పదో తరగతిలో ప్రవర్తన సరిగ్గా లేదని చెబుతూ ఇంటర్‌లోనైనా బాగా చదువుకోవాలని విష్ణును మందలించారు. తండ్రి, ఉపాధ్యాయుల ముందే తనను అవమానించారని భావించిన విష్ణు మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయాన గడ్డి మందు తాగాడు. కాసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ తరలించారు. వైద్యం చేసినా లాభం లేదని అక్కడి వైద్యులు చెప్పడంతో తిరిగి ఖమ్మం తీసుకురాగా ఆరోగ్యం విషమించి శనివారం మృతిచెందాడు.

తండ్రి మందలించాడని...

తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి గ్రామానికి చెందిన కంబలి నర్సింలు, యాదమ్మల కుతూరు(15).. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఇంటి పక్కనే ఉండే ఓ బాలుడితో సన్నిహితంగా ఉండటాన్ని గమనించిన తండ్రి.. పాఠశాలకు వెళ్లి అందరిముందూ బాలికపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీన్ని అవమానంగా భావించిన బాలిక ఇంట్లో ఉన్న మాత్రలు మింగింది. అస్వస్థతకు గురైన ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. యాదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

'గౌడజాతి ఆత్మగౌరవాన్ని పెంపొందించుకుందాం'



గౌడ విద్యార్థి వసతి గృహం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

నాగోలు: రాజకీయపార్టీలకు అతీతంగా గౌడ కులస్తులు ఐకమత్యంగా ముందుకుసాగుతూ ఆత్మగౌరవాన్ని పెంపొందించుకుందామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. గౌడల సంక్షేమం, శ్రేయస్సు కొరకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. నాగోల్ శుభం ఫంక్షన్‌హాల్‌లో శనివారం కొత్తగా ఎన్నికైన గౌడవసతిగృహాల సముదాయాల అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడిగా మోతి చక్రవర్తిగౌడ్, కార్యవర్గ సభ్యులతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బీసీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. గౌడ్‌ల ఆత్మగౌరవ భవనానికి హైదరాబాద్‌లోని కోకాపేటలో ఐదెకరాల స్థలాన్ని, దాని నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో బహుజన వీరుడు పాపన్నకి సరైన గౌరవం తగ్గిందని పాపన్న జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే నిర్వహించడం అభినందనీయమన్నారు. త్వరలోనే ట్యాంక్‌బ్యాండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. ప్రజాదరణ ఓర్వలేక తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, నిజామాబాద్ జిల్లా మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, నాగపురి రాజలింగం గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, కొత్త రవీందర్‌గౌడ్, పల్లె లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జంబో లిస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

జరిపినట్టు తెలిసింది. ఇందులో అభ్యర్థుల ఎంపిక వంటి పార్టీ అంశాలతోపాటు రైతు రుణమాఫీ, బీసీ బంధు, ఉద్యోగుల పీఆర్సీ వంటి ప్రభుత్వపర అంశాలపైనా చర్చించినట్టు సమాచారం. ఈ సందర్భంగా పాలన, పార్టీపరమైన పలు అంశాలపై ఇద్దరు కీలక నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది.

19న మెదక్, 20న సూర్యాపేటకు కేసీఆర్

సీఎం కేసీఆర్ ఈనెల 19, 20 తేదీల్లో జిల్లాల పర్యటన చేపట్టనున్నారు. 19న శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయం, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభిస్తారు. తర్వాత బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించి, బహిరంగ సభలో పాల్గొంటారు. 20న ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్ సముదాయం, ఎస్పీ ఆఫీసు, మెడికల్ కాలేజీ కొత్త భవనాలను కేసీఆర్ ప్రారంభిస్తారు. అక్కడ కూడా పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించి, బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ఘనంగా మువ్వా పద్మావతి రంగయ్య పురస్కారాల ప్రదానం



పురస్కారం అందుకుంటున్న ఖాదర్ మొహియుద్దీన్. చిత్రంలో మువ్వా శ్రీనివాస్‌రావు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మువ్వా పద్మావతి–రంగయ్య ఫౌండేషన్, తెలంగాణ సాహితి, జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మువ్వా పద్మావతి–రంగయ్య పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. 2021 సంవత్సరానికి గాను మువ్వా పద్మావతి–రంగయ్య పురస్కారం ఖాదర్ మొహియుద్దీన్‌కు, 2022 సంవత్సరానికి సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్‌కు ప్రదానం చేశారు. ఆవంత్స సోమసుందర్ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త కె.ఆనందాచారికి, నవస్వరాంజలి పురస్కారం–2022ను ప్రముఖ సాహితీవేత్తలు సుంకర గోపాల్, ఎన్.లహరి, గూండ్ల వెంకటనారాయణ, లావణ్య సైదీశ్వర్, స్ఫూర్తి కందివనం, ఎస్.విద్యాసాగర్, రుక్మిణి, మహ్మద్ గౌస్, షేక్ రిజ్వానాలకు అందజేశారు. ఈ సందర్భంగా అనితరుడు(మువ్వా శ్రీనివాసరావు కవితాంతరంగ విశ్లేషణలు), దృశ్యం ఎట్‌దిరేట్ ఆఫ్ 576 మెగా పిక్సల్ (మువ్వా శ్రీనివాసరావు కవిత్వ విశ్లేషణ), ఆలయవు బయలోలగే(మువ్వా శ్రీనివాసరావు కన్నడ అనువాదం), సమాంతర ఛాయాయే (మువ్వా శ్రీనివాసరావు కవిత్వ హిందీ అనువాదం) పుస్తకాలను ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ అవార్డు గ్రహీతలంతా పాలక పక్షం కాకుండా..ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే గొంతుకలుగా ఉండడం మంచిదని, వీరంతా అలా ఉండడం వల్లే అవార్డులు వచ్చాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఆచార్య గంటా చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మల్కపేట రిజర్వాయర్ ట్రయల్ రన్ సక్సెస్


మల్కపేట జలాశయంలోకి పంపింగ్ అవుతున్న గోదావరి జలాలు

కోనరావుపేట(వేములవాడ): కాళేశ్వరం ప్రాజెక్టు తొమ్మిదో ప్యాకేజీ పనుల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మల్కపేట వద్ద నిర్మించిన రిజర్వాయర్ రెండు పంపుల ట్రయల్‌రన్ విజయవంతమైంది. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్ బాబు సూచనలతో శనివారం ఈ ట్రయల్‌రన్ చేపట్టారు. ట్రాన్స్‌కో పవర్‌గ్రిడ్ ప్రత్యేక అనుమతితో ఏకధాటిగా ఆరు గంటలపాటు గోదావరి జలాలను మల్కపేట జలాశయంలోకి ఎత్తిపోసినట్లు అధికారులు తెలిపారు. మొదటి పంపును 72 గంటలపాటు నిరంతరాయంగా నడపనున్నారని, సాంకేతికపర మైన సమస్యలు తలెత్త కుండా చూసి రెండో పంపును సైతం 72 గంటలపాటు నడప నున్నట్లు పేర్కొన్నారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వర్లు, సలహాదారు పెంటారెడ్డి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి ట్రయల్ రన్‌ను పర్యవేక్షించారు.

కరెంటుషాక్‌తో ఒకరు.. భయంతో మరొకరు..

- నీటిగుంతలో ఈత సరదా మిగిల్చిన విషాదం
- నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఘటన


శివ


అనిల్

కల్వకుర్తి టౌన్: సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు యువకుల్లో ఒకరు నీటిగుంతలో కరెంటుషాక్‌కు గురై మరణించగా, మరొకరు భయంతో ఉరేసుకొని చనిపోయాడు. ఈ విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో చోటుచేసుకుంది. కల్వకుర్తికి చెందిన అనిల్(18), రాజేశ్ వాటర్‌ప్లాంట్లలో ఆటోడ్రైవర్లు. తమ పనులు ముగిసిన తర్వాత కల్వకుర్తి తిమ్మనోనిపల్లి వద్ద ఉన్న నరసింహారెడ్డి వ్యవసాయ పొలంలోని నీటిగుంతలో ఈత కొట్టడానికి వెళ్లారు. పక్క పొలంలో ఉన్న కుర్మిద్దకు చెందిన శివ (22)ను సైతం ఈత కొట్టడానికి పిలిచారు. ముగ్గురు కలిసి నీటిగుంతలోకి దిగారు. అయితే అది లోతుగా ఉండటంతో నీటిని బయటకు తోడేందుకు విద్యుత్ మోటారు ఏర్పాటు చేశారు. నీళ్లు తోడేస్తుండగా మధ్యలో కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో వారు గుంతలోకి దిగి ఈత కొడుతున్నారు. కొద్దిసేపటికి కరెంటు సరఫరా కావడంతో అనిల్ విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందాడు. దీంతో భయాందోళనకు గురైన శివ సమీపంలోని మరో వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

పేర్ల మార్పు అంటూ కేంద్రం హడావుడి

సాక్షి, హైదరాబాద్: మణిపూర్‌లో శాంతి భద్రతల సమస్య తలెత్తినా..మైనార్టీల మీద దాడులు జరుగుతున్నా పట్టించుకోకుండా ఇలా పేర్ల మార్పు అంటూ హడావుడి చేస్తున్నారని రాష్ట్ర ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ మండిపడ్డారు. మూకదాడులకు మరణ శిక్ష అని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి మణిపూర్‌లో జరుగుతున్న దాడులు కనిపించడం లేదా అని శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దక్షిణ భారత ప్రజలపై బలవంతంగా హిందీ రుద్దాలని చూస్తుందని ఆరోపించారు. ఇందుకు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ బిల్లులే నిదర్శనమన్నారు.

ఇక ఆ భూములు ఎన్‌హెచ్ఏఐ ఖాతాలోకి

3డీ గెజిట్ నోటిఫికేషన్‌లు జారీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి అలైన్‌మెంటులో గుర్తించిన భూమిని తన పరిధిలోకి తీసుకుంటూ జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) 3డీ నోటిఫికేషన్‌లు జారీ చేసింది. యాదాద్రి–భువనగిరి, ఆందోల్–జోగిపేట, చౌటుప్పల్ అథారిటీ(కాంపిటెంట్ అథారిటీ ఫర్ లాండ్ అక్విజిషన్–కాలా)లకు సంబంధించి ఏప్రిల్‌లో మూడు గెజిట్‌లు జారీ చేయగా, తాజాగా భువనగిరి, ఆందోల్–జోగిపేటలోని అనుబంధ నోటిఫికేషన్‌లు, సంగారెడ్డి, గజ్వేల్, తూప్రాన్ కాలాలకు సంబంధించి 3డీ నోటిఫికేషన్‌లు జారీ చేసింది. అలైన్‌మెంటు ఖరారు చేసిన తర్వాత భూసేకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు వీలుగా తొలుత జారీ చేసిన రెండు గెజిట్‌లలో దాదాపు 500 ఎకరాలకు సంబంధించిన భూముల వివరాలు గల్లంతైన విషయం తెలిసిందే. ఆ విషయాన్ని ఇటీవలే గుర్తించి వాటికి మళ్లీ నోటిఫికేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. అలా గల్లంతైన భూములకు సంబంధించి మినహా మిగతా భూములకు సంబంధించి తుది గెజిట్ నోటిఫికేషన్లు దాదాపు జారీ అయినట్టే. దీంతో ఈ భూములన్నీ ప్రైవేటు వ్యక్తుల ఆధీనం నుంచి ఎన్‌హెచ్ఏఐ పరిధిలోకి చేరినట్టయింది.

భూ యజమానుల అభ్యంతరాలను తోసిపుచ్చిన ఎన్‌హెచ్ఏఐ: ఈ భూముల సేకరణ ప్రక్రియపై వాటి యజమానుల నుంచి వ్యక్తమైన అన్ని అభ్యంతరాలను ఎన్‌హెచ్ఏఐ తోసి పుచ్చింది. ఆయా అభ్యంతరాలకు సంబంధించి గ్రామ సభ ల్లో అధికారికంగా వెల్లడించిన సమాధానాలతో ఇక అభ్యంతరాలు రద్దయినట్టుగానే ఎన్‌హెచ్ఏఐ పరిగణిస్తుంది. ప్రజో పయోగానికి సంబంధించి రూపొందించిన ప్రాజెక్టు నిర్మాణానికి గాను ఈ భూములను సేకరించాలని నిర్ణయించినందున, ఆ ప్రాజెక్టు పనులు ముందుకు సాగేందుకు వీలుగా భూములపై ఉన్న ప్రైవేటు యాజమాన్య హక్కులను రద్దు చేస్తున్నట్టుగా ఎన్‌హెచ్ఏఐ ప్రకటించింది. వెరసి ఆ భూములన్నీ కేంద్రప్రభుత్వ అధీనంలోకి చేరినట్టయింది.

గెజిట్‌లో ఇలా: ''కేంద్ర భూసేకరణ చట్టం సెక్షన్ 3డీలోని సబ్ సెక్షన్(1) ప్రకారం.. నిర్ధారిత గ్రీన్‌ఫీల్డ్ హైవే దిగువ తెలిపిన సర్వే నెంబర్లలోని భూమిని కేటాయించాము. దాని కోసం సేకరించనున్నాము'' ''కేంద్ర భూసేకరణ చట్టం సెక్షన్ 3డీ సబ్‌సెక్షన్(2) నోటిఫికేషన్ విడుదలైన వెంటనే.. నిర్ధారిత భూమి పూర్తిగా కేంద్రప్రభుత్వ అధీనంలోకి వచ్చినట్టుగా పరిగణించాలి. '' అని గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రచురించింది.

158.62 కి.మీ.గాను 2 వేల హెక్టార్ల భూమి సేకరణ

రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తరభాగంలో 158.62 కి.మీ. నిడివికి గాను దాదాపు 2 వేల హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకు రూ.5170 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ మొత్తంలో సగ భాగం.. అంటే రూ.2585 కోట్లు భూసేకరణకు, రూ.363.43 కోట్లు స్తంభాలు లాంటి వాటిని తరలించేందుకు అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. నిధులు ముందే జమ కట్టే విషయంలో కేంద్ర–రాష్ట్రప్రభుత్వాల మధ్య అప్పట్లో అభిప్రాయభేదాలు తలెత్తాయి. ఆ తర్వాత రాజీ కుదిరి రూ.100 కోట్ల మొత్తాన్ని జమ చేయటంతో 3 డీ నోటిఫికేషన్ జారీకి మార్గం సుగమమైంది. 3ఏ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన ఏడాదిలోపు 3డీ గెజిట్ నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది. ఈ నెలతో ఏడాది పూర్తి అవుతున్నందున 3డీ గెజిట్ నోటిఫికేషన్లను ఎన్‌హెచ్ఏఐ జారీ చేయటం విశేషం.

పూర్తి వివరాలతో నోటిఫికేషన్

రీజినల్ రింగురోడ్డు నిర్మించే అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే భూములను గుర్తించి గతంలోనే సర్వే చేసిన అధికారులు.. తాజా గెజిట్ నోటిఫికేషన్‌లో ఊరు, సర్వే నెంబరు, భూమి విస్తీర్ణం, పట్టాదారు పేరు.. ఇలా పూర్తి వివరాలను గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రచురించారు.

ఏపీ ప్రభుత్వోద్యోగులకు ఇళ్ల స్థలాలపై నివేదిక ఇవ్వండి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఇళ్ల స్థలాలివ్వడానికి ఎంత భూమి అవసరమవుతుందో పదిరోజుల్లోగా నివేదిక ఇవ్వాల్సిందిగా ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. వివిధ ఉద్యోగ సంఘాల హౌసింగ్ సొసైటీల వారీగా ఇళ్ల స్థలాలకు ఎంతమేర భూమి అవసరమో పరిశీలించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ జి. సాయిప్రసాద్‌కు సీఎస్ సూచించారు. దీనిపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి ఒక నివేదిక సమర్పించాలన్నారు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీ రాజ్
(గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ సంస్థ)
రాజేంద్రనగర్, హైదరాబాద్- 500030
NIRDPR

ఇ-టెండర్
టెండర్ కోరుతూ ప్రకటన
ప్రింటింగ్ పనుల కోసం ప్రింటర్స్ ఎంప్యానల్‌మెంట్ కోసం

రెండు బిడ్ల సిస్టమ్ (టెక్నికల్ & ఫైనాన్షియల్) క్రింద ప్రముఖ ప్రింటింగ్ ఏజెన్సీల నుండి ఆన్‌లైన్ బిడ్లు కోరబడుచున్నవి. సంవత్సరానికి అంచనా ఖర్చులు సుమారు రూ. 41.00 లక్షలు. జర్నల్స్, బుక్స్, ఎన్వలప్స్, ప్యాడ్స్, క్యాలెండర్, మొ॥ వంటి ప్రింటింగ్ వర్క్ యొక్క వివిధ ఐటమ్‌లు కలవు.
సవివరమైన బిడ్డింగ్ డాక్యుమెంట్, మొ॥ http://eprocure.gov.in లేదా nird.org.in వెబ్‌సైట్ల నుండి చూడవచ్చును / డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. బిడ్డర్లు తమ ఇ-బిడ్లను సెంట్రల్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (http://eprocure.gov.in) లో మాత్రమే అప్‌లోడ్ చేసి దాఖలు చేయవలెనని బిడ్డర్లను కోరడమైనది.
టెండర్ ID: 2023_NIRD_766662_1
CCP పోర్టల్లో బిడ్ల దాఖలుకు చివరి తేది: 02.09.2023న సా. 5.30 గం.
No. CDC/Empan/Print, తేది: 13.08.2023 సం/- అసిస్టెంట్ రిజిస్ట్రార్ (E) i/c

క్లుప్తంగా...

బీజేపీ భారత్ వీడిపో



కోల్‌కతా: మణిపూర్ హింసాకాండ కారకులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. అందుకే ప్రస్తుతం దేశంలో "బీజేపీ భారత్ వీడిపో" అన్న నినాదం మారుమోగుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అవినీతిపై మాట్లాడే హక్కు లేదన్నారు. పెద్ద నోట్ల రద్దు, రఫేల్ ఒప్పందం, పీఎం కేర్ నిధుల అంశంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న మోదీ ప్రభుత్వం అవినీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మమత అన్నారు. కోల్‌కతాలో శనివారం జరిగిన జీ-20 అవినీతి వ్యతిరేక సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. అవిశ్వాస తీర్మానం సమయంలో లోక్‌సభ నుంచి విపక్ష పార్టీ సభ్యులు పారిపోయారని, వారు వ్యాప్తి చేసిన నెగిటివిటీని తాము సమర్థంగా ఎదుర్కొన్నామని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలకు మమత కౌంటర్ ఇచ్చారు. దేశంలో నిరుపేద ప్రజలు బతకడం బీజేపీకి ఇష్టం లేదని, అందుకే ప్రధాని మోదీ ఇష్టారాజ్యంగా నిందలు వేస్తున్నారని అన్నారు. "'ప్రధానమంత్రి జాతిని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రతిపక్షాల గురించి మాట్లాడుతున్నారు. దేశంలో నిరుపేదలు బతకడం బీజేపీకి ఇష్టం లేదు" అని మమత తాను విడుదల చేసిన ఒక ఆడియో మెసేజ్‌లో ఆరోపించారు. బ్రిటిష్ పాలకుల్ని క్విట్ ఇండియా అంటూ అప్పట్లో మహాత్మా గాంధీ నినదించారని, ఇప్పుడు దేశ ప్రజలు బీజేపీ క్విట్ ఇండియా అంటున్నారని మమత కేంద్రంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మోదీ దేశానికి రాజు కావాలనుకుంటున్నారు

తేజస్వీ యాదవ్ వ్యాఖ్య

పట్నా: దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేసి, ప్రధాని మోదీ మహారాజు స్థానంలో ఉండాలనుకుంటున్నారని బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు. దర్భంగాలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలను ప్రధాని మోదీ పట్టించుకోరన్నది వాస్తవమన్నారు. ఎన్నికల్లో గెలవడం, అధికారం నిలుపుకోవడం మాత్రమే మోదీ లక్ష్యమని తేజస్వి పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించి, మహారాజుగా మారాలన్నది మోదీ కోరికని పేర్కొన్నారు. కానీ, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో బీజేపీకి షాక్ తప్పదని ఆయన స్పష్టం చేశారు.

కార్చిచ్చు కనిపించని ఉచ్చు..!

మొన్న గ్రీస్, నిన్న కెనడా, ఇవాళ హవాయి

- బూడిద కుప్పగా మారిన లహైనా నగరం
- వాతావరణ మార్పులతో పెరిగిపోతున్న కార్చిచ్చులు
- అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌కు అత్యధిక ముప్పు

కార్చిచ్చులు ప్రపంచ దేశాలను భయపెడుతున్నాయి. ఏదాదికేడాది కార్చిచ్చులు పెరిగిపోతున్నాయి. అడవుల్లో మంటలు చెలరేగిన క్షణాల్లోనే సమీపంలో నగరాలకు విస్తరించి దగ్ధం చేస్తున్నాయి. అమెరికాలోని హవాయి దీవుల్లో రేగిన కార్చిచ్చుతో లహైనా రిసార్ట్ నగరం ఒక బూడిద కుప్పగా మిగిలింది. అగ్రరాజ్యం ఎదుర్కొంటున్న అతి పెద్ద విపత్తుల్లో ఒకటిగా మిగిలిపోయిన ఈ కార్చిచ్చు బీభత్సంలో 80 మందికి పైగా మరణించారు. మౌయి దీవిలో లహైనా పట్టణంలో మంగళవారం రాత్రి మొదలైన కార్చిచ్చు ఇప్పటికీ రగులుతూనే ఉంది. వాతావరణం పొడిగా ఉండడంతో పాటు హరికేన్ ఏర్పడడంతో ద్వీపంలో బలమైన గాలులు వీచాయి. దీంతో శరవేగంతో మంటలు వ్యాపించి అందాల నగరాన్ని దగ్ధం చేశాయి.



మరుభూమిలా లహైనా రిసార్ట్ నగరం

మొదలైతే.. అంతే

- పశ్చిమ అమెరికా, దక్షిణ ఆస్ట్రేలియాలో తరచూ కార్చిచ్చులు సంభవిస్తూ ఉంటాయి. చరిత్రలో అతి పెద్ద కార్చిచ్చులన్నీ అక్కడే వ్యాపించాయి. గత కొన్నేళ్లుగా బ్రిటన్ అత్యధికంగా కార్చిచ్చుల బారినపడుతోంది. 2019లో బ్రిటన్‌లో 135 కార్చిచ్చులు వ్యాపించి 113 చదరపు మైళ్ల అడవిని దగ్ధం చేశాయి. రష్యా, కెనడా, బ్రెజిల్ దేశాలకు కూడా కార్చిచ్చు ముప్పు అధికంగా ఉంది.
- బ్రిటన్‌లో మాంచెస్టర్‌లో 2019లో సంభవించిన కార్చిచ్చు ఏకంగా మూడు వారాల పాటు కొనసాగింది. 50 లక్షల మంది వాయు కాలుష్యంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు.

2000 సంవత్సరంలో ఆస్ట్రేలియాలో వ్యాపించిన కార్చిచ్చు వేలాది ఇళ్లను దగ్ధం చేసింది. 300 కోట్ల జంతువులు మరణించడమో లేదంటే పారిపోవడం జరిగింది.

- అమెరికాలో కాలిఫోర్నియాలో ఎక్కువగా కార్చిచ్చులు వ్యాపిస్తూ ఉంటాయి. 2020లో కార్చిచ్చు 4 లక్షల హెక్టార్ల అడవుల్ని మింగేసింది. 1200 భవనాలు దగ్ధమయ్యాయి.
- -2021లో ప్రపంచ దేశాల్లో కార్చిచ్చుల వల్ల 176 వందల కోట్ల మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ గాల్లో కలిసింది

కార్చిచ్చులతో ఏర్పడిన కాలుష్యానికి ప్రపంచంలో ఏడాదికి దాదాపుగా 34 వేల మందికి ఆయుష్షు తగ్గి ముందుగానే మరణిస్తున్నారు.

- 1918లో అమెరికాలో మిన్నెసోటాలో ఏర్పడిన కార్చిచ్చు చరిత్రలో అతి పెద్దది. ఈ కార్చిచ్చు వెయ్యి మంది ప్రాణాలను బలి తీసుకుంది.
- యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ అంచనాల ప్రకారం ప్రపంచంలో ఏడాదికి 40 లక్షల చదరపు కిలో మీటర్ల అడవుల్ని కోల్పోతున్నాం.

ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం 2030 నాటికి పెరిగిపోనున్న కార్చిచ్చులు **14%**

2050 నాటికి **30%**

ఈ శతాబ్దం అంతానికి **50%**

కార్చిచ్చులు పెరుగుతాయని యూఎన్ హెచ్చరించింది.

ఎందుకీ మంటలు ?

- కార్చిచ్చులు ప్రకృతి విపత్తే అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న కార్చిచ్చుల్లో 10 నుంచి 15% మాత్రమే సహజంగా ఏర్పడుతున్నాయి. వాతావరణం పొడిగా ఉండి, కరువు పరిస్థితులు ఏర్పడి, చెట్లు ఎక్కువగా ఎండిపోయి ఉన్నప్పుడు మండే ఎండలతో పాటు ఒక మెరుపు మెరిసినా కార్చిచ్చులు ఏర్పడతాయి. బలమైన గాలులు వీస్తే అవి మరింత విస్తరిస్తాయి.
- మానవ తప్పిదాల కారణంగా 85 నుంచి 90% కార్చిచ్చులు సంభవిస్తున్నాయి. అడవుల్లో ఎంజాయ్ చేయడానికి వెళ్లి క్యాంప్‌ఫైర్ వేసుకొని దానిని ఆర్పేయకుండా వదిలేయడం, సిగరెట్లు పారేయడం, విద్యుత్ స్తంభాలు వంటివి కూడా కార్చిచ్చుకి కారణమవుతున్నాయి.
- ఇంధనం లేదంటే మరే మండే గుణం ఉన్న పదార్థాలు చెట్లు, పొదలు, గడ్డి దుబ్బులు ఉన్న అటవీ ప్రాంత సమీపాల్లో ఉంటే కార్చిచ్చులు ఏర్పడతాయి. 2021లో కాలిఫోర్నియాలో చమురు కారణంగా 7,396 కార్చిచ్చులు ఏర్పడి 26 లక్షల ఎకరాల అటవీ భూమి దగ్ధమైంది.
- ప్రస్తుతం అమెరికా హవాయి ద్వీపంలో కార్చిచ్చు మెరుపు వేగంతో వ్యాపించడానికి డొరైన్ టోర్నడో వల్ల ఏర్పడిన బలమైన గాలులే కారణం. కాలిఫోర్నియాలో ఎక్కువగా కార్చిచ్చులు వ్యాపించడానికి గాలులే ప్రధాన పాత్ర పోషించాయి.



లహైనాలోని ఓ శిథిల భవనం

- సాక్షి, నేషనల్ డెస్క్

అగ్గి మరింత రాజేస్తున్న వాతావరణ మార్పులు

సహజసిద్ధంగా ఏర్పడే కార్చిచ్చుల వల్ల అడవుల్లో ఎండిపోయిన వృక్ష సంపద దగ్ధమై భూమి తిరిగి పోషకాలతో నిండుతుంది. మానవ నిర్లక్ష్యంతో ఏర్పడే కార్చిచ్చులు ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఇవాళ రేపు వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడే కార్చిచ్చులు ఎక్కువైపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ పరిస్థితులతో వాతావరణం పొడిగా ఉండడం, ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, కర్బన ఉద్గారాల విడుదల ఎక్కువైపోవడం వంటి వాటితో దావానలాలు పెరిగిపోతున్నాయి. 1760లో పారిశ్రామిక విప్లవం వచ్చిన తర్వాత భూ ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల సెల్సియస్ పెరిగిపోయాయి. దీని ప్రభావం ప్రకృతిపై తీవ్రంగా పడింది. అటవీ ప్రాంతాల్లో తేమ తగ్గిపోవడం వల్ల కార్చిచ్చులు మరింత ఎక్కువ కాలం పాటు సంభవిస్తున్నాయి. జనాభా పెరిగిపోవడం వల్ల అటవీ ప్రాంతాలకు దగ్గరగా నివాసం ఏర్పరచుకోవడంతో కార్చిచ్చులు జనావాసాలకు పాకి భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. వాతావరణ మార్పుల కారణంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో అత్యధికంగా కార్చిచ్చులు సంభవిస్తున్నాయి. భవిష్యత్‌లో వీటి తీవ్రత మరింత పెరిగిపోయే ఛాన్స్ కూడా ఉంది. మొత్తానికి ఏ సమస్య అయినా భూమి గుండ్రంగా ఉంది అన్నట్టుగా గ్లోబల్ వార్మింగ్ దగ్గరకే వచ్చి ఆగుతోంది. భూతాపాన్ని అరికట్టడానికి ప్రపంచ దేశాలు చిత్తశుద్ధితో పని చేస్తే కార్చిచ్చులతో పాటు ఇతర సమస్యల్ని కూడా అధిగమించవచ్చు.

చరిత్రలో భారీ కార్చిచ్చులు

దేశం	ఏడాది	దగ్ధమైన అటవీ
రష్యా	2003	2.2 కోట్ల హెక్టార్లు
ఆస్ట్రేలియా	2020	1.7 కోట్ల హెక్టార్లు
కెనడా	2014	45 లక్షల హెక్టార్లు
అమెరికా	2004	26 లక్షల హెక్టార్లు

ఢిల్లీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఐఏఎస్‌లు సహా ప్రభుత్వ అధికారుల బదిలీలు, నియామకాలపై కేంద్రానికి అధికారాలు కట్టబెట్టిన వివాదాస్పద ఢిల్లీ సర్వీసు బిల్లు చట్టంగా మారింది. ఈసారి వర్షాకాలం సమావేశాల్లో వివాదాస్పద బిల్లులైన ఢిల్లీ సర్వీసు బిల్లు, డిజిటల్ డేటా బిల్లుల్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ఆమోదించారు. వీటితో పాటు జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు , జన విశ్వాస్ (సవరణ) బిల్లులపై రాష్ట్రపతి సంతకం చేశారు. వీటిలో ఢిల్లీ పాలనాధికారాల బిల్లు (జాతీయ రాజధాని ప్రాంత సవరణ బిల్లు), డిజిటల్ డేటా (డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ బిల్లు) బిల్లులపై పార్లమెంటులో విపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఢిల్లీలో ప్రభుత్వ అధికారుల నియామకాలు, బదిలీలపై ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికే అధికారం ఉంటుందని సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నీ కేంద్రానికే కట్టబెడుతూ ఆర్డినెన్స్ తెచ్చింది. దీనిపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ, ఇతర విపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య ఈ బిల్లుని మొదట లోక్‌సభ, ఆ తర్వాత రాజ్యసభ ఆమోదించాయి. ఇప్పుడు రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారింది. అదే విధంగా డిజిటల్ డేటా ప్రొటెక్షన్ బిల్లును మణిపూర్ అంశంపై ప్రతిపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో ఉభయ సభలు ఆమోదించాయి. ఈ బిల్లులో విపక్ష పార్టీలు కొన్ని సవరణలు సూచించినా ప్రభుత్వం చేపట్టలేదు. బిల్లులో కేంద్ర ప్రభుత్వం సహా కొందరికి మినహాయింపులు ఇవ్వడంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురయ్యాయి.

సగం సమయం కూడా పని చెయ్యలేదు

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు షెడ్యూల్ సమయంలో సగం కూడా పని చెయ్యలేదు. అయినప్పటికీ రికార్డు స్థాయిలో 23 బిల్లులు పాసయ్యాయి. మణిపూర్‌లో జాతుల ఘర్షణ ఈ సారి ఉభయసభల్ని కుదిపేసింది. లోక్‌సభ కార్యకలాపాలు 43% జరిగితే, రాజ్యసభ 55% సమయం కార్యకలాపాలు కొనసాగించింది. పాలసీ రీసెర్చ్ స్టడీస్ (పీఆర్‌ఎస్) అందించిన డేటా ప్రకారం లోక్‌సభ 17 రోజులు సమావేశమైంది. అవిశ్వాస తీర్మానంపై 20 గంటల సేపు చర్చ జరిగింది. ఈ చర్చలో 60 మంది సభ్యులు పాల్గొన్నారు. పార్లమెంటు ఆమోదించిన బిల్లుల్లో ఢిల్లీలో పాలనాధికార బిల్లు, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటక్షన్ బిల్లు, అటవీ సంరక్షణ సవరణ బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్ సవరణ బిల్లు ప్రధానమైనవి. ఈసారి సభలో ప్రవేశపెట్టిన బిల్లుల్లో 56% కేవలం ఎనిమిది రోజుల్లో పార్లమెంటు ఆమోదాన్ని పొందాయి. మరో 17% బిల్లుల్ని కమిటీల పరిశీలనకు పంపారు.

విపక్షాలు పారిపోయాయి

- మణిపూర్ పై లోక్ సభలో చర్చించనీయలేదు
- మణిపురీలకు ద్రోహం చేశాయి
- ప్రతిపక్షాల నిజ రూపాన్ని బట్టబయలు చేయండి
- బీజేపీ శ్రేణులకు ప్రధాని పిలుపు

న్యూఢిల్లీ: విపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ పెద్దపెట్టున విరుచుకుపడ్డారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభ నుంచి పారిపోయాయని ఎద్దేవా చేశారు. దాన్ని దేశమంతా వీక్షించిందన్నారు. మణిపూర్ హింసాకాండపై చర్చ విషయంలో వాటికి చిత్తశుద్ధే లేదని ఆరోపించారు. మణిపూర్ ప్రజలకు అవి ద్రోహం చేశాయన్నారు. ప్రజా సంక్షేమం కంటే స్వార్థ రాజకీయాలకే విపక్షాలు ప్రాధాన్యమిచ్చాయని దుమ్మెత్తిపోశారు. దాంతో కీలక సమస్యలకు పార్లమెంటులో చర్చ ద్వారా పరిష్కారం సాధించే సువర్ణావకాశం చేజారిందని ఆవేదన వెలిబుచ్చారు. దేశవ్యాప్తంగా విపక్షాలు వ్యాప్తి చేస్తున్న ప్రతికూల భావజాలాన్ని తమ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. పశ్చిమ బెంగాల్లో పంచాయతీ రాజ్ పరిషత్‌ను ఉద్దేశించి శనివారం మోదీ వర్చువల్‌గా మాట్లాడారు.

వారికి రాజకీయాలే ముఖ్యం

రెండు రోజుల క్రితమే విపక్షాల అవిశ్వాస తీర్మానాన్ని 140 కోట్ల భారతీయుల ఆశీర్వాదంతో ఓడించామని మోదీ అన్నారు. 'అలాగే వారు వ్యాప్తి చేస్తున్న ప్రతికూలతనూ ఓడించాం. మణిపూర్ అంశంపై చర్చించాలని కేంద్రం భావిస్తోందంటూ పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలయ్యే ముందే విపక్షాలకు లేఖ రాశామని. కానీ ఏం జరిగిందో మీరంతా చూశారు. దానిపై చర్చను అవే అడ్డుకున్నాయి. అంతటి సున్నిత అంశంపై చర్చ జరిగి ఉంటే మణిపూర్ ప్రజలకు కాస్త ఊరటన్నా దక్కి ఉండేది. సమస్యకు కొన్నయినా పరిష్కారాలు దొరికి ఉండేవి. కానీ మణిపూర్ హింసాకాండకు మూల కారణానికి సంబంధించిన వాస్తవాలు విపక్షాలను ఎంతో బాధిస్తాయి. కనుక కావాలనే చర్చను జరగనీయలేదు. అసలు పార్లమెంటులో ఏ చర్చ జరగడమూ వారికి ఇష్టం లేదు. ప్రజల బాధ వాటికి పట్టదు కావాల్సిందల్లా కేవలం రాజకీయాలు' అంటూ తూర్పారబట్టారు. విపక్షాల నిజ రూపాన్ని దేశ ప్రజల ముందు బట్టబయలు చేయాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'ప్రజల విశ్వాసమే నాకు స్ఫూర్తినిస్తుంది. నా ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది' అని అన్నారు.

మమతది అరాచక పాలన

గత నెల బెంగాల్‌లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విపక్షాలను భయభ్రాంతులను చేసేందుకు పాలక తృణమూల్ కాంగ్రెస్ భాయోతోత్పాతానికి, బెదిరింపులకు దిగిందని విమర్శించారు. పైగా ప్రజాస్వామ్య పరిరక్షకుల్లా పోజులు కొడుతోందని మండిపడ్డారు.

నేరగాళ్ల ఆస్తులను జప్తు చేద్దాం

జీ 20 దేశాలకు మోదీ పిలుపు

కోల్‌కతా: అవినీతిపై ఉమ్మడిగా పోరాడదామని జీ 20 దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆర్థిక తదితర నేరాలకు పాల్పడి విదేశాల్లో తలదాచుకునే ఘరానా వ్యక్తుల ఆస్తులను జప్తు చేయాలని సూచించారు. శనివారం కోల్‌కతాలో జరిగిన జీ 20 అవినీతి నిరోధక మంత్రుల స్థాయి భేటీని ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అలాంటి నేరగాళ్లు విదేశాల్లో కూడబెట్టిన, పోగేసిన అక్రమాస్తులను, చేసిన అక్రమాలను సకాలంలో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా నేరగాళ్లను వీలైనంత త్వరగా మాతృదేశానికి అప్పగించడం కూడా సులువవుతుందని అభిప్రాయపడ్డారు. అవినీతి వల్ల అందరి కంటే ఎక్కువ నష్టపోయేది నిరుపేదలేనని మోదీ ఆవేదన వెలిబుచ్చారు.

దళితులు, గిరిజనులకు సముచిత గౌరవం

- గత ప్రభుత్వాలకు వీరు ఎన్నికలప్పుడే గుర్తొచ్చేవారు
- మధ్యప్రదేశ్ సభలో ప్రధాని మోదీ విమర్శలు



సాగర్: గత ప్రభుత్వాలకు దళితులు, ఓబీసీలు, గిరిజనులు ఎన్నికలప్పుడే గుర్తుకు వచ్చేవారని ప్రధాని మోదీ ఆరోపించారు. దళిత బస్తీలు, నిరుపేదలుండే ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో నీటి వసతి కూడా ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం మాత్రం దళితులు, ఓబీసీలు, గిరిజనులకు సముచిత గౌరవం ఇచ్చిందని, జల్ జీవన్ మిషన్ ద్వారా వారి ఇళ్లలోకే మంచినీరు అందిస్తోందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా బడ్‌తుమా గ్రామంలో శనివారం ప్రధాని సంత్ రవిదాస్ జ్ఞాపకార్థం 11 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్లతో నిర్మించే ఆలయం-స్మారక నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బినా-కోటా డబుల్ లేన్ రైలు మార్గాన్ని జాతికి అంకితం చేయడంతోపాటు వివిధ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ధానాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు.

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా అన్వరుల్ హక్



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా సెనేటర్ అన్వరుల్ హక్ కకర్(52) ఎంపికయ్యారు. ప్రధాని పదవి నుంచి వైదొలగనున్న షెహబాజ్ షరీఫ్, ప్రతిపక్ష నేత రజా రియాజ్ రెండు విడతలుగా చర్చలు జరిపిన మీదట కకర్ పేరుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. బలూచిస్తాన్ అవామీ పార్టీ(బీఏపీ)కి చెందిన కకర్ ఈ ఏడాది చివర్లో జరగనున్న సాధారణ ఎన్నికలు, దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాల్సిన కీలక బాధ్యతలను నెరవేర్చాల్సి ఉంటుంది. చిన్న ప్రావిన్స్ అయిన బలూచిస్తాన్‌కు చెందిన కకర్ పేరును ఆపద్ధర్మ ప్రధాని పదవికి ప్రతిపాదించినట్లు రియాజ్ మీడియాతో అన్నారు. ఈ మేరకు అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీకి ప్రతిపాదన పంపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 224(1ఏ)ను అనుసరించి అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆపద్ధర్మ ప్రధానిగా కకర్ నియామకంపై ఆమోదం తెలపడం కూడా వెంటనే జరిగిపోయింది. ప్రధాని షరీఫ్ ఈ నెల 9న దిగువ సభ నేషనల్ అసెంబ్లీని రద్దు చేసిన విషయం తెలిసిందే. రాజ్యాంగం ప్రకారం 90 రోజుల్లోగా ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. అయితే, జన గణన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నందున ఎన్నికలు మరో రెండు నెలలు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆపద్ధర్మ ప్రధానిగా అన్వరుల్ హక్ కకర్ కొనసాగుతారు.

క్రిమియాలో 20 డ్రోన్లు కూల్చివేశాం: రష్యా

కీవ్: ఆక్రమిత క్రిమియాపై డ్రోన్ల దాడిని తిప్పికొట్టినట్లు రష్యా తెలిపింది. ఉక్రెయిన్ ప్రయోగించిన సుమారు 20 డ్రోన్లను కూల్చివేసినట్లు శనివారం రష్యా రక్షణ శాఖ పేర్కొంది. ఇందులో 14 డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేయగా మరో ఆరింటిని జామర్లు నిర్వీర్యం చేశాయని వెల్లడించింది. ఎటువంటి నష్టం వాటిల్లలేదని పేర్కొంది. రష్యా ప్రకటనపై ఉక్రెయిన్ స్పందించలేదు. వరుసగా మూడు రోజులుగా రాజధాని మాస్కోపై డ్రోన్ దాడులు జరగడంతో రష్యా అప్రమత్తమైంది. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌లోని లుహాన్స్క్ ప్రాంతానికి చెందిన ఉరోజీహయిన్ అనే గ్రామాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు రష్యా శనివారం ప్రకటించుకుంది. ఖర్కీవ్, జపొరిజియా ప్రాంతాలతోపాటు, అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత పట్టణం క్రివ్విరిహ్‌ల్లో జరిగిన రష్యా బాంబు దాడుల్లో ఇద్దరు చనిపోగా మరో 16 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ యంత్రాంగం తెలిపింది.

నైజీరియాలో మసీదు కూలి.. ఏడుగురు మృతి

అబుజా: నైజీరియాలో మసీదు పైకప్పు కుప్పకూలిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. కదునా రాష్ట్రం జరియా నగరంలోని జరియా సెంట్రల్ మాస్క్‌లో వేలాది మంది శుక్రవారం ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. 1830లో నిర్మించిన ఈ మసీదు పైకప్పు కూలి పడటంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా మరో 23 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు.

భారత్-చైనా ఆర్మీ మధ్య రేపు చర్చలు

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లోని మిగిలిన ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణ వేగంగా జరగాలని భారత్ స్పష్టం చేయనుంది. భారత్- చైనా మధ్య 19వ విడత చర్చలు ఈ నెల 14న జరగనున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రెండు దేశాల కార్ప్స్ కమాండర్ స్థాయి చివరి దఫా చర్చలు నాలుగు నెలల క్రితం జరిగాయి. రేపు జరిగే చర్చల్లో మిగిలిన ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణ పూర్తిగా జరగాలని భారత ప్రతినిధి బృందం పట్టుబట్టనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. రెండు దేశాల మధ్య పలు విడతలుగా జరిగిన చర్చల ఫలితంగా తూర్పులద్దాఖ్‌లోని కొన్ని ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి ఇరుపక్షాలు బలగాలను ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. 18వ విడత చర్చల్లో ప్రధానంగా డెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలంటూ భారత్ గట్టిగా డిమాండ్ చేసింది. తాజా చర్చలు చుషుల్-మోల్డో సరిహద్దు పాయింట్‌లోని భారత భూభాగంలో జరుగుతాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. భారత బృందానికి లెఫ్టినెంట్ జనరల్ రషీమ్ బాలి, చైనా కు సౌత్ జిన్‌జియాంగ్ మిలటరీ డిస్ట్రిక్ట్ కమాండర్ నాయకత్వం వహించే అవకాశాలున్నాయి.

ప్రధానిని కించపరచలేదు

- 'నీరవ్' వ్యాఖ్యపై క్షమాపణ చెప్పను
- కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి స్పష్టీకరణ
- 'ఇండియా'పేరును ప్రధాని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్న



న్యూఢిల్లీ: మణిపూర్ హింసపై లోక్‌సభలో మాట్లాడనందుకే నీరవ్ అనే మాటను వాడాను తప్ప, ఆయన్ను కించపరచడానికి కాదని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మణిపూర్ హింసపై ప్రధానమంత్రి మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచీ డిమాండ్ చేస్తోందని చెప్పారు. ప్రధాని మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయే సరికి 'నీరవ్'అనే మాటను వాడానే తప్ప వేరే ఉద్దేశం లేదన్నారు. నీరవ్‌కు నిశ్శబ్దం అనే అర్థం ఉందన్నారు. పార్లమెంట్‌లో ఎవరినైనా అగౌరవపరచాలనే ఆలోచన తనకు లేశ మాత్రమైనా లేదని చెప్పారు. ఏదైనా మాట అన్ పార్లమెంటరీగా అనిపిస్తే తొలగించేందుకు నిబంధనల ప్రకారం స్పీకర్‌కు అధికారముందని చౌదరి తెలిపారు. ఒకరి ప్రతీకార, అహంకార వైఖరికి తానెందుకు క్షమాపణ చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం గళం వినిపించకుండా చేసేందుకే బీజేపీ నేతలు పథకం ప్రకారం అనుచిత విధానాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. తన సస్పెన్షన్‌ను తిరోగమన చర్యగా ఆయన అభివర్ణించారు. ఉరితీసిన తర్వాత విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితిలో తనను ఉంచారంటూ వ్యాఖ్యానించారు. సస్పెన్షన్‌పై చట్టపరంగా ముందుకెళ్లేందుకు గల అవకాశాలను పరిశీలిస్తానన్నారు. అనుచిత ప్రవర్తన కారణంతో అధిర్ రంజన్ చౌదరిని గురువారం లోకసభ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయనపై సభా హక్కుల కమిటీ నివేదిక ఇచ్చేవరకు సస్పెన్షన్ కొనసాగనుంది. భారత్, ఇండియా ఒక్కటే అయినప్పుడు ప్రధాని మోదీ మాత్రం ప్రతిపక్ష 'ఇండియా'కూటమి పేరును ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదని అధిర్ రంజన్ చౌదరి అన్నారు. 'అంత శక్తిమంతుడైన మోదీకి ఇండియా పదంతో వచ్చిన ఇబ్బందేమిటి? భారత్, ఇండియా రెండూ ఒక్కటేనని రాజ్యాంగం కూడా చెప్పింది. అయినా బీజేపీ నేతలు రెండింటి మధ్య తేడాలు చూపిస్తున్నారు'అని అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఘర్షణలకు మణిపూర్ పరిణామాలకు పోలిక లేదని, అక్కడ మానవీయ సంక్షోభం నెలకొని ఉందని చెప్పారు. మణిపూర్‌లో పరిస్థితులు దేశంపై ప్రభావం చూపుతున్నాయని కేంద్రం భావిస్తే పరిష్కరించేందుకు మరింతగా కృషి చేయాలని సూచించారు.

మణిపూర్ సమస్యను కామెడీగా మార్చేస్తారా?

- మోదీ! నీకెంత ధైర్యం!
- ప్రధానిపై రాహుల్ ధ్వజం
- నువ్వూ, నీ మంత్రులు నవ్వుకుంటారా?
- 2 గంటల ప్రసంగంలో మణిపూర్ కు 2 నిమిషాలేనా!

వయనాడ్: మణిపూర్ హింసాకాండ వంటి అతి తీవ్రమైన సమస్యను ప్రధాని నరేంద్ర మోదీ నవ్వులాటగా మార్చేశారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. వయనాడ్ ఎంపీ అయిన ఆయన అనర్హత వేటు తొలగాక శనివారం తొలిసారి కేరళలో పర్యటించారు. కాల్పెట్టలో యూడీఎఫ్ బహిరంగ సభలో మాట్లాడారు. మణిపూర్ సమస్యను విపక్షాలు పార్లమెంటు దాకా తీసుకెళ్లి చర్చకు పెట్టినా దానిపై మాట్లాడటానికి కూడా మోదీ ఇష్టపడలేదని ఆరోపించారు. 'అవిశ్వాస తీర్మానంపై చర్చకు బదులిస్తూ మోదీ 2 గంటల 13 నిమిషాల సేపు ప్రసంగించారు. అందులో ఏకంగా 2 గంటల పాటు కాంగ్రెస్ గురించి, నా గురించి, విపక్ష ఇండియా కూటమి గురించి... ఇలా అన్నింటి గురించీ మాట్లాడారు. అంతసేపూ మోదీ, ఆయన మంత్రివర్గ సహచరులు అన్నింటి మీదా జోకులు వేశారు. నవ్వుకున్నారు. కానీ అసలు సమస్య మణిపూర్ హింసాకాండ గురించి మాట్లాడేందుకు మాత్రం మోదీ కేటాయించింది కేవలం రెండంటే రెండే నిమిషాలు! భారత్ అనే భావనకే మణిపూర్‌లో తూట్లు పొడిచారు' అని మండిపడ్డారు. భారత్ అనే భావనకే తూట్లు పొడిచే వాళ్లు జాతీయవాదులు ఎలా అవుతారని రాహుల్ ప్రశ్నించారు.



రాహుల్ గాంధీ శనివారం కేరళ వెళ్తూ మార్గమధ్యంలో తమిళనాడులోని ముత్తునాడు వద్ద 'తోద' జాతి గిరిజనులతో ముచ్చటించారు. బరువైన గుండ్రటి బండరాయిని ఓ వ్యక్తి అవలీలగా భుజంపైకి ఎత్తుకోవడాన్ని ఆసక్తిగా గమనించారు. వారితో కలిసి నృత్యం చేశారు.

మణిపురీల దుస్థితి చూసి.. చలించిపోయా

మణిపూర్ పర్యటన సందర్భంగా అక్కడి బాధితుల దుస్థితి చూసి ఆపాదమస్తకం చలించిపోయానని రాహుల్ గుర్తు చేసుకున్నారు. తన 19 ఏళ్ల రాజకీయ జీవితంలో అంతటి దారుణ పరిస్థితులను ఎన్నడూ చూడలేదని ఆవేదన వెలిబుచ్చారు. బీజేపీయే తన స్వార్థ ప్రయోజనాల కోసం మణిపూర్ ప్రజల మధ్య నిలువునా చీలిక తెచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనాలంటే కనీసం ఐదేళ్లయినా పడుతుందని అభిప్రాయపడ్డారు. ' పునరావాస కేంద్రాల్లో ఒక మహిళ చెప్పింది విని కన్నీరు పెట్టా. కొడుకును ఆమె కళ్ల ముందే చంపారు. మిగతా అందరూ కుటుంబాలతో ఉంటే ఆమె మాత్రం ఒంటరిగా పడుకుని కనిపించింది. మీ వాళ్లెక్కడ అని అడిగితే ఎవరూ మిగల్లేదంటూ ఏడ్చేసింది. తన పక్కన పడుకున్న కొడుకును కళ్ల ముందే కాల్చేస్తే రాత్రంతా శవం పక్కనే గడిపానని గుర్తు చేసుకుంది. తనెలాగూ తిరిగి రాదని గుండె రాయి చేసుకుని పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నానని చెప్పింది. ఆ ఘోర కలి గురించి చెప్తూ కూడా వణికిపోయింది. ఇంకో బాధిత మహిళ తనకు జరిగిన దారుణాలను తలచుకున్నంత మాత్రాన్నే స్పృహ తప్పి పడిపోయింది. మణిపూర్‌లో ఇలాంటి దారుణ గాథలు వేలాదిగా ఉన్నాయి. నా తల్లికి, చెల్లికి ఇలా జరిగితే ఎలా ఉంటుందని ఊహించుకున్నా' అన్నారు.

సాక్షి
కరీంనగర్
ఆదివారం | 13 | ఆగస్టు | 2023

భల్లూకం.. భయం.. భయం


రేకుర్తి శివారులో సంచరిస్తున్న ఎలుగుబంటి


సబ్‌స్టేషన్ ఆవరణలో ఎలుగుబంటికి మత్తుమందు ఇస్తున్న రెస్క్యూ సిబ్బంది


ఎలుగుబంటిని తరలిస్తున్న ఫారెస్టు రెస్క్యూటీం

కొత్తపల్లి: కరీంనగర్ శివారులోని రేకుర్తి, సీతారాంపూర్ సూర్య నగర్ ఏరియాల్లో శుక్రవారం రాత్రి 11.30 గంటల నుంచి శనివారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎలుగుబంటి హడలెత్తించింది. దీంతో స్థానికులు భయాందోళకు గురయ్యారు. సూర్యనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన పెంపుడు కుక్కతో ఉదయం 4.30 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లగా గుడ్డెలుగు కనిపించింది. అదే సమయంలో కుక్క మొరగడంతో రేకుర్తివైపు వెళ్లింది. కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణగౌడ్ పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం రేకుర్తికి చేరుకున్న వరంగల్ నుంచి వచ్చిన ఫారెస్టు రెస్క్యూ టీంకు భల్లూకం రెండుగంటల పాటు ముప్పుతిప్పలు పెట్టింది. రేకుర్తి సబ్‌స్టేషన్ ఏరియాలోని సమ్మక్క–సారలమ్మ గుట్టల పొదల్లో దాగిన ఎలుగుబంటికి చివరకు మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో టెన్షన్‌కు తెరపడింది. ఫారెస్టు అధికారులు భల్లూకాన్ని బంధించి చికిత్సనిమిత్తం స్థానిక వెటర్నరీ హాస్పిటల్‌కు తరలించారు. దీంతో స్థానికులు, అటవీశాఖ సిబ్బంది, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

తరచూ రేకుర్తి ప్రాంతంలో సంచారం..
రేకుర్తి ప్రాంతంలో తరచూ ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. గతేడాది మార్చిలో శాతవాహన వర్సిటీలో ప్రత్యక్షమైన ఎలుగుబంటి కొన్నిరోజుల పాటు హల్‌చల్ చేసింది. అప్పుడు అటవీశాఖ అధికారులు ఉమెన్స్ హాస్టల్ సమీపంలో బోన్ ఏర్పాటు చేసి పట్టుకునేందుకు యత్నించి విఫలమయ్యారు. రేకుర్తిలోని షేఖాబ్‌కాలనీ గుట్ట, కెనాల్ సమీపంలో కూడా ఎలుగుబంట్లు సంచరిస్తుంటాయి. భల్లూకాలు కాల్వలో పడగా స్థానికులు అటవీ అధికారులకు సమాచారమిచ్చి రక్షించిన సందర్భాలున్నాయి.

న్యూస్‌రీల్

డ్రోన్ల వినియోగంపై నిషేధాజ్ఞలు

- సీపీ ఎల్.సుబ్బారాయుడు



కరీంనగర్ క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్‌ల వినియోగాన్ని నిషేధించినట్లు కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఈనెల 31వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు వీటిని వినియోగించే అవకాశాలుండటంతో సదరు సాంకేతిక పరికరాల వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు.

పంద్రాగస్టుకు ప్రధాని నుంచి పిలుపు


పురుషోత్తంరెడ్డి దంపతులు

మానకొండూర్/జమ్మికుంట: పంద్రాగస్టు సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన పాకాల పురుషోత్తంరెడ్డి, పద్మజ దంపతులకు ప్రధాని నుంచి పిలుపు అందింది. పురుషోత్తం రెడ్డి ప్రస్తుతం మానకొండూర్ ప్రగతి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. జమ్మికుంట రైతు ప్రగతి, రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం చైర్మన్ సంద మహేందర్, కవిత దంపతులకు సైతం ఆహ్వానం అందినట్లు శనివారం తెలిపారు.

17న మెగా జాబ్‌మేళా

కరీంనగర్ సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 17న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, టాస్క్ కో–ఆరినేటర్, ప్లేస్‌మెంట్ అధికారిణి డాక్టర్ శోభారాణి శనివారం ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 9:30 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, అభ్యర్థులు ముందుగానే కళాశాలకు చేరుకోవాలని సూచించారు. దేశంలోనే పేరుగాంచిన 25పైగా కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఎక్కడి నుంచి అయినా అభ్యర్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు అన్ని విద్యా ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్‌తో సహా వెంట తీసుకురావాలని అన్నారు. వివరాలకు 73370 20111 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మిగిలింది ఐదురోజులే

- లిక్కర్‌షాపుల టెండర్లకు అనాసక్తి
- గతంతో పోల్చితే భారీగా తగ్గిన దరఖాస్తులు
- వేచిచూసే ధోరణిలో వ్యాపారులు

మద్యం షాపుల దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తులు	షాపులు
జగిత్యాల	210	71
కరీంనగర్	385	94
పెద్దపల్లి	121	77
సిరిసిల్ల	439	48



సాక్షిప్రతినిధి, కరీంనగర్: మద్యం షాపుల టెండర్ల దరఖాస్తులు మందకొడిగా సాగుతున్నాయి. 2023–25 ఆర్థిక సంవత్సరానికి మద్యం షాపుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ఎక్సైజ్‌శాఖ చేపట్టింది. ఈనెల 18నాటికి వరకు చివరి తేదీ. ఈ సారి రెండు వారాల గడువు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల సంఖ్య తగ్గింది. దరఖాస్తుల సంఖ్య పెంచేలా ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

తగ్గిన దరఖాస్తులు..
ఉమ్మడి జిల్లాలో జగిత్యాలలో 71షాపులకు ఇప్పటి వరకు 210 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ జిల్లాలో 94 షాపులకు గాను 385, పెద్దపల్లిలో 77 షాపులకు 121 దరఖాస్తులు, సిరిసిల్లలో 48షాపులకు గాను 439 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 18వరకు గడువు ఉండటంతో చాలామంది వ్యాపారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. చివరి తేదీనాటికి ఆయా షాపులకు వచ్చిన దరఖాస్తులు, డిమాండ్ ఉన్నషాపులను దృష్టిలో ఉంచుకుని టెండర్‌లో పాల్గొనాలని చూస్తున్నారు. అయితే చివరిరోజు 60 నుంచి 70 శాతం దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.

డిమాండ్ ఉన్న షాపులపై నజర్
చాలా మంది మద్యం వ్యాపారులు డిమాండ్ ఉన్న షాపులపై దృష్టిట్ సారించారు. ఇంకో ఐదురోజుల సమయం ఉండటంతో డిమాండ్ ఉన్న షాపుల్లో ఎక్కువ దరఖాస్తులు వేటికి వచ్చాయి, ఏఏ షాపులకు దరఖాస్తు చేయాలనే అంశాలపై దృష్టిట్ పెట్టారు. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్లలో అత్యధికంగా 439 దరఖాస్తులు వచ్చాయి.

బీఆర్‌ఎస్‌లోకి కొత్త జయపాల్‌రెడ్డి

- వారం రోజుల్లో చేరికకు ముహూర్తం
- మంత్రి గంగుల, బోయినపల్లితో మంతనాలు


కొత్త జయపాల్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్ పార్టీ ఆకర్ష్ మంత్రాన్ని ప్రయోగిస్తోంది. నియోజకవర్గస్థాయిల్లో పేరున్న నేతలతో పాటు అర్థబలం, అంగబలం, సామాజికవర్గాల్లో పట్టున్న నేతలను పార్టీలో చేర్చుకునేందుకు దృష్టి సారించింది. ఇందులో భాగంగా గత కొన్నేళ్లుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో చేరడమే ఖాయమని భావించిన స్థానిక మైత్రి గ్రూప్ అధినేత కొత్త జయపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరేందుకే మొగ్గు చూపినట్లు సమాచారం. ఈ మేరకు హైదరాబాద్‌లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మంత్రి గంగుల కమలాకర్‌లు సంప్రదింపులు జరిపి పార్టీలో చేరే విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా సమ్మతించినట్లు సమాచారం. ఉత్తర తెలంగాణకే కేంద్ర బిందువుగా ఉన్న ఉమ్మడి జిల్లా నుంచి రానున్న ఎన్నికల్లో మరోసారి విజయ ఢంగా మోగించేందుకు బీఆర్‌ఎస్ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. జిల్లాకేంద్రంలో బలమైన సామాజిక వర్గం, గ్రానైట్, రియల్టర్, మీడియా గ్రూప్‌ల్లో భాగస్వామ్యుడైన కొత్త జయపాల్‌రెడ్డిని పార్టీలో చేర్చుకునే విషయంలో మంతనాలు జరపడం, రాష్ట్ర నాయకత్వం గ్రీన్ సిగ్నల్ చెప్పడం, వారం రోజుల్లోనే పార్టీలో చేరికకు రంగం సిద్ధం చేయడంపై జిల్లాలో రాజకీయ చర్చ మొదలైంది. కొత్త జయపాల్‌రెడ్డి గతంలో నాగ్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ అగ్రనాయత్వంతో సంప్రదింపులు జరపడం, కరీంనగర్ బీజేపీ టికెట్ ఖాయమనే ప్రచారం జోరుగా సాగింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో సంప్రదింపులు పూర్తయ్యాయని కరీంనగర్ కాంగ్రెస్ టికెట్ ఖాయమైందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. కరీంనగర్ బీజేపీ ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశించడం, కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సైతం ఎమ్మెల్యేగానే పోటీ చేస్తారనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో రెండు పార్టీల్లో నుంచి సరియైన సంకేతాలు రాకపోవడంతో జయపాల్‌రెడ్డి గమ్మునగా ఉన్నారు. దీంతో మంత్రి గంగుల అధిష్టానంతో కొత్త జయపాల్‌రెడ్డి చేరికతో లాభనష్టాలపై పార్టీకి విన్నవించడంతో చేరికకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం.

త్వరలో మరిన్ని చేరికలు...
బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నేతలు కొద్ది రోజుల్లోనే ఆయా పార్టీలను వీడి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా పార్టీల్లో స్తబ్దత నెలకొనడం.. అధికార బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలతో ప్రజల ముందుకు వెళ్తుండడంతో ఆయా పార్టీల్లో గుర్తింపు లేని లీడర్లు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు సమయం వరకు చేరికలు భారీగా ఉంటాయని ఆ పార్టీ లీడర్లు పేర్కొంటున్నారు.

స్మార్ట్.. ఫుడ్ కోర్ట్

- ఆకర్షణీయంగా స్టాళ్లు
- అదిరిపోతున్న డిజైన్లు




కరీంనగర్ కార్పొరేషన్: స్మార్ట్‌సిటీలో భాగంగా నగరానికి మరో ఆకర్షణీయత జోడవుతోంది. సిటీకల్చర్ క్రమంలో నగరంలో రెండు చోట్ల నైట్‌ఫుడ్ కోర్ట్‌లు ఏర్పాటు చేయడానికి నగరపాలకసంస్థ పనులు చేపడుతుండడంతో తెలిసిందే. శాతవాహన యూనివర్సిటీ, కేబుల్ బ్రిడ్జి సమీపంలో ఈ నైట్ ఫుడ్‌కోర్ట్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ముందుగా శాతవాహన యూనివర్సిటీ వద్ద, ఆ తరువాత కేబుల్ బ్రిడ్జి వద్ద నైట్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే విద్యానగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ముందు నైట్‌ఫుడ్ కోర్ట్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. టైల్స్ నిర్మాణం పూర్తి కాగా, స్టాల్స్ ఏర్పాటు సాగుతోంది. వెజ్, నాన్‌వెజ్‌లకు వేర్వేరుగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. నైట్ ఫుడ్‌కోర్ట్ నమూనాలు ప్రస్తుతం నగరవాసులను అబ్బురపరుస్తున్నాయి. అలాగే పిల్లల ఆడుకోవడానికి కూడా ఏర్పాట్లున్నాయి.


వర్సిటీ సమీపంలో సిద్ధమవుతున్న స్టాళ్లు

మరణించి.. జీవించి..

- అవయవదానానికి ముందుకొస్తున్న కుటుంబాలు
- ఉమ్మడి జిల్లా ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- నేడు ప్రపంచ అవయవ దాన దినోత్సవం



“ మనిషికి ఒకటే జన్మ.. అదే మనిషి అవయవాలకు మాత్రం రెండు జన్మలు. అవయవ దానం చేస్తే మరణించినా మరోసారి జీవించే అవకాశం ఉంది. ఒక్క మనిషి చనిపోతే గుండె, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం, పేగులు, చేతులు, ముఖం, కణజాలం, ఎముకమజ్జ, మూలకణాలు దానం చేసి మరో 8 మంది ప్రాణాలు కాపాడొచ్చు. దేశంలో మరణాల సంఖ్య అధికంగా ఉన్నా.. అవయవదాతలు ఆ స్థాయిలో ఉండడం లేదు. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువుల ఆలోచనలు, ఆచారాలు, కట్టుబాట్లు, అవగాహన రాహిత్యంతో చాలామంది ముందుకు రావడం లేదు. 18ఏళ్లు దాటినవారు ఆర్గాన్స్ డొనేట్ చేయొచ్చు. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రాణం పోసిన.. దాతల సహకారంతో బతుకుతున్న వారిపై..
ఈ వారం సండే స్పెషల్..

సండే స్పెషల్



అన్నకు తమ్ముడి కిడ్నీ



సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన పబ్బతి విజయేందర్‌రెడ్డి(53) రైతు. షటిల్ ఆడేవాడు. ఉన్నట్టుండి వాంతులయ్యాయి. ఆస్పత్రికి వెళ్లగా కిడ్నీలు ఫెయిలయ్యాయని వైద్యులు నిర్ధారించారు. డయాలసిస్‌కు నెలకు రూ.40వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చయ్యాయి. మూడు నెలలు గడిచాయి. విజయేందర్‌రెడ్డిని ఆస్పత్రిలో ఆ స్థితిలో చూసిన అతని తమ్ముడు జితేందర్‌రెడ్డి(50) తన రెండు కిడ్నీల్లో ఒకటి ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. హైదరాబాద్ ఆస్పత్రిలో ఆపరేషన్ అయింది. మృత్యువు ముంగిట అసహాయంగా నిల్చున్న అన్నకు ఆత్మీయ రక్తబంధం పునర్జన్మనిచ్చింది. విజయేందర్‌రెడ్డి ప్రస్తుతం జిల్లెల్లలో వ్యవసాయం, తమ్ముడు జితేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.

తొలి డోనర్ లక్ష్మి


ఇప్పనపెల్లి లక్ష్మి(ఫైల్)

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని గాంధీనగర్‌కు చెందిన ఇప్పనపల్లి నారాయణ, లక్ష్మి దంపతులు. మిర్చి బండి పెట్టుకుని జీవించేవారు. 12 ఏళ్లక్రితం పనులు ముగించుకుని ఇంటికెళ్లారు. అర్ధరాత్రి దాటాక విపరీతమైన తలనొప్పితో లక్ష్మి కింద పడిపోయింది. ఆమెను హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చేర్పించారు. ఆమె బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవదానంపై అవగాహన కల్పించారు. ఆమె కుమారులు సంతోష్, రమేశ్ అంగీకారం మేరకు లక్ష్మి ఊపిరితిత్తులు, కాలేయం, గుండె, మూత్రపిండాలు సేకరించి నలుగురు వ్యక్తులకు అమర్చారు. జిల్లాలోనే తొలి అవయవ దాతగా లక్ష్మి గుర్తింపుపొందారు.

తండ్రి.. భార్య ఇద్దరూ దాతలే



కోరుట్ల: తండ్రి.. భార్య ఇద్దరూ కిడ్నీ దాతలుగా నిలిచారు. కోరుట్లకు చెందిన గీత కార్మికుడు పోతుగంటి శ్రీనివాస్ 2017లో వెన్నునొప్పితో అవస్థ పడడంతో తండ్రి రఘుగౌడ్ వైద్యులతో పరీక్షలు చేయించాడు. శ్రీనివాస్‌కు కిడ్నీ సమస్య ఉందని తేలడంతో కలవరపడ్డాడు. వైద్యులు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయకతప్పదని చెప్పడంతో రఘుగౌడ్ తన కిడ్నీదానం చేశాడు. శ్రీనివాస్ ఆరోగ్యం కుదుటపడింది. ఐదేళ్ల తరువాత 2022లో మళ్లీ వెన్నునొప్పి మొదలైంది. మరోసారి పరీక్షించిన వైద్యులు మళ్లీ కిడ్నీ మార్చిడి చేయాల్సిందేనని చెప్పడంతో అతడి భార్య లావణ్య కిడ్నీ ఇచ్చింది. శ్రీనివాస్ తేరుకుని ప్రస్తుతం ఏ సమస్య లేకుండా తన పనులు తాను చేసుకుంటున్నాడు.

అవయవదాతల 'అబ్బిడిపల్లె'


ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

ఓదెల: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం అబ్బిడిపల్లె వాసులు మూకుమ్మడిగా అవయవదానానికి అంగీకరిస్తూ తీర్మానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అప్పటి కలెక్టర్ సంగీతకు లేఖ అప్పగించారు. అబ్బిడిపల్లెలో 600 జనాభా ఉంటుంది. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించగా.. సర్పంచ్ ఒజ్జ కోమలత ఆధ్వర్యంలో తీర్మానం చేసి శభాష్ అనిపించుకున్నారు.

మెడికల్ కాలేజీకి మృతదేహం


మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబసభ్యులు, సదాశయ ప్రతినిధులు(ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన దేవకి పార్థసారథి (85) తన మరణానంతరం అవయవాలు దానం చేస్తానని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రం రాసిచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న అనారోగ్యంతో మృతి చెందగా.. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను ఐ బ్యాంక్‌కు, పార్థివదేహాన్ని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

ఏడుగురికి పునర్జన్మ


ఇమానుయేల్(ఫైల్)

కోల్‌సిటీ: తాను మరణించి మరో ఏడుగురికి పునర్జన్మిచ్చారు గోదారిఖనిలోని విద్యానగర్‌కు చెందిన సిరిసిల్ల ఇమానుయేల్(33). హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేసే ఆయన 2019 జనవరి 3న బైక్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వారంపాటు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. ఆయన కుటుంబసభ్యులు ఆయన అవయవాలను దానం చేయగా.. ఏడుగురికి పునర్జన్మ లభించింది.

నలుగురికి ప్రాణం



కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ఎల్బీనగర్‌కు చెందిన మింగాని సంపత్(41) ఎమ్మెస్సీ, బీఈడీ చదివారు. ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ డైరెక్టర్. 2019 జనవరి 14న రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లి మరణించారు. నలుగురికి లివర్, రెండు కిడ్నీలు, గుండె అమర్చారు.

బతికుండగానే..



సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన పానగంటి స్వప్న(45) అంగన్‌వాడీ టీచర్. తాను చనిపోయాక తన అవయవాలు దానం చేయాలని భర్త నర్సయ్యతో చెబుతుండేది. తీవ్ర జ్వరంబారిన పడి చనిపోయిన ఆమె కోరిక మేరకు ఆమె రెండు కిడ్నీలు, గుండెను దానం చేశారు కుటుంబసభ్యులు.

దేహదానానికి నిర్ణయం


లింగమూర్తి, విజయ

కోల్‌సిటీ: గోదావరిఖని చంద్రబాబుకాలనీలో నివాసం ఉంటున్న మేరుగు లింగమూర్తి ఓసీపీ–3లోని బేస్ వర్క్‌షాప్‌లో ఆపరేటర్. ఎనిదేళ్ల క్రితం రెండు కిడ్నీలు చెడిపోయాయి. డయాలసిస్‌పై ఉన్న భర్త లింగమూర్తిని బతికించుకోవడానికి అతని భార్య విజయ తన కిడ్నీని దానంచేసింది. ఇప్పుడు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. ఇదే స్ఫూర్తితో తమ మరణానంతరం తమ దేహాలను మెడికల్ కాలేజీకి దానం చేస్తామని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రాలు రాసి ఇచ్చారు.

కొడుకు కళ్లు సజీవం..



కోల్‌సిటీ: నా కొడుకు విజయ్‌పాల్‌రెడ్డి 2018 సెప్టెంబర్ 27న చనిపోయాడు. నేను, భార్య సుశీలతోపాటు నా కుటుంబ సభ్యులు దుఃఖంలో కూడా విజయపాల్‌రెడ్డి నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చేశాం. నా భార్య, నేను కూడా మా మరణానంతరం నేత్రదానం చేస్తామని అంగీకారం తెలిపాం. చనిపోయిన వారి అవయవాలు మరికొందరికి ఉపయోగకరంగా ఉంటాయి. వారిలో మనవారిని చూసుకోవచ్చు.
– మారెల్లి రాజిరెడ్డి, యైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని

తమ్ముడు తోడుండాలని..



కోరుట్లరూరల్: మాది మండలంలోని సంగెం. నాకు ఒక అన్న. ఇద్దరు తమ్ముళ్లు. చిన్న తమ్ముడు చీటి రాంచందర్‌రావుకు 18ఏళ్ల క్రితం అనారోగ్యంతో రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. డయాలసిస్ చేసినా ప్రయోజనం లేదని డాక్టర్లు చెప్పారు. తమ్ముడిని కాపాడుకునేందుకు ఒక కిడ్నీ ఇచ్చా. కొంతకాలానికి తమ్ముడు అనారోగ్యంతో చనిపోయాడు. కిడ్నీ ఇచ్చిన నేను ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా. అన్ని పనులు చేసుకుంటున్నా. తమ్ముడే దక్కలేదు.
– చీటి మురళీధర్ రావు, సంగెం, కోరుట్ల

రాష్ట్రం మొదటిస్థానం



కోల్‌సిటీ: అవయవదానంపై ప్రజల్లో చైతన్యం వచ్చింది. మన రాష్ట్రం దేశంలో అవయవదానంలో మొదటిస్థానంలో నిలిచింది. గోదావరిఖని ప్రాంతంలో ఎక్కువ మంది ముందుకు వస్తున్నారు. 2008లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పురుడుపోసుకున్న సదాశయ ఫౌండేషన్.. రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అవయవదాతల కుటుంబాలకు, స్వచ్ఛంద సంస్థలకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలి.
– టి.శ్రవణ్‌కుమార్, సదాశయ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు

మా ఆయన్ను దక్కించుకోవాలని..



విద్యానగర్(కరీంనగర్): మా వారు వారాల ఆనంద్. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. 2013లో ఆయనకు రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. వారానికి మూడు సార్లు డయాలసిస్ ఏడాదిపాటు చేయించుకోవాల్సి వచ్చింది. అయన్ను దక్కించుకునేందుకు నేను ఒక కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధమయ్యా. నా కిడ్నీని ఆనంద్‌కు 15 జూలై 2014లో ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. నా జీవితంలో ఆయన లేని లోటును ఊహించలేను. నాలో భాగమైన ఒక కిడ్నీ ఇచ్చి బతికించుకున్నాను. ఇప్పుడు నేను, మావారు పిల్లలతో ఆనందంగా ఉన్నాం.
– వారాల ఇందిరారాణి, గృహిణి, కరీంనగర్

కొడుకు ప్రాణం పోశాడు



“ వేములవాడ: మాది వేములవాడ. కొన్నేళ్లక్రితం లివర్‌వ్యాధి ఉండేది. ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోయింది. నా కొడుకు మారుతి లివర్ నాకు సరిపోయింది. 17 నవంబర్ 2017న మారుతి లివర్‌లోని కొంత భాగాన్ని నా లివర్‌కు జతచేశారు. ఇప్పుడు ఇద్దరం ఆరోగ్యంగా ఉన్నాం. నా కొడుకు లివర్ ఇచ్చి నాకు ప్రాణం పోశాడు.
– కుమ్మరి శంకర్, వేములవాడ

పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో నేత్ర, అవయవ, దేహదానం వివరాలు

నేత్రదానం:	850 మంది(సుమారు 1,700 మందికి కంటి చూపు వచ్చింది)
అవయవదానం:	80 మంది(సుమారు 300 మందికి పైగా పునర్జన్మ)
మెడికల్ కళాశాలలకు దేహదానం:	90 మంది
అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు:	950
అంగీకారం తెలిపిన వారు:	50వేలకుపైగా..

అవయవదానంపై సేవలందిస్తున్న ప్రతినిధులు

టి.శ్రవణ్‌కుమార్	9948609591
సీహెచ్.లింగమూర్తి	9492781306
మేరుగు భీష్మాచారి	9849590415
బేణిగోపాల్ త్రివేది	9848218989
కె.శ్రీనివాస్	9849737100

క్లుప్తంగా

నేడు కౌన్సెలింగ్

కరీంనగర్: కేజీబీవీ, యూఆర్ఎస్ నందు ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఆదివారం ఉదయం 11 గంటలకు జిల్లా విద్యాశాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని డీఈవో జనార్ధన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

18 వరకు ఫీజు గడువు

హుజూరాబాద్‌రూరల్: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు 5, 6వ సెమిస్టర్‌లో ఫెయిల్ అయితే, ఈ నెల 18 లోపు పరీక్ష ఫీజు చెల్లించుటకు యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమకుమార్ ప్రకటనలో తెలిపారు. పరీక్షలను ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వారికి సంబంధించిన కళాశాలలో సంప్రదించి ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావలసి ఉంటుందని తెలిపారు.

రేషన్ డీలర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కోట సుజాతను బెదిరించిన ఇదే గ్రామానికి చెందిన మాడ కరుణాకర్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు. సుజాత రేషన్ షాపులో ఉండగా కరుణాకర్ వెళ్లి తాను రిపోర్టర్ అని, రూ.3 వేలు ఇవ్వాలని, లేకుంటే లైసెన్స్ రద్దు చేయిస్తానని బెదిరించాడు. నిత్యావసర సరుకులు అమ్మకుండా ఆటంకం కలిగించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవలతో భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్న కట్ట శరత్‌చంద్ర(30) 13 ఏళ్ల క్రితం కాపువాడకు చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శరత్‌చంద్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఇనుపరాడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహిరంగ వేలము ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కరీంనగర్‌లో ఈ క్రింది వాహనములకు తేది: 14-08-2023 సోమవారం రోజున వేలము నిర్వహించబడును.

S.No.	VEHICLE No.	DESCRIPTION	MODEL
1.	TS02UA7553	MAHINDRA XYLO - P	2015
2.	TS312417	JOHN DEERE 5075 E HARVESTER	2016
3.	TS02FF9190	MAHINDRA NOVO 755 HARVESTER	2020
4.	TS21K7599	RITZ MC LDI BS IV DIESEL 5 SEATER	2016
5.	AP22AR1761	SWARAJ 735FE	2014
6.	TS15EJ2727	CIAZ 1.3L ZDI PLUS DIESEL 5 SEATER	2015
7.	AP15BK5559	I10 GRAND 1.2L CRDI SPORTZ	2014
8.	AP15TC1117	EICHER 11.14 FBT	2013

వేలము వేయు స్థలము :
SHRIRAM AUTOMALL
SY.NO. 437, 438, BESIDE KOTAK MAHINDRA BANK, HYDERABAD ROAD, ALUGUNUR VILLAGE, THIMMAPUR MANDAL, KARIMNAGAR DIST.
Cont: 0878-2994549, Cell: 9949444273

డాన్..డెన్!

- ఇదీ లక్ష్మీరాజం హత్య కేసు నిందితుల తీరు..
- సెటిల్‌మెంట్లకు ప్రత్యేక ఇళ్లు
- అనుచరులంతా పాతికేళ్ల లోపువారే..

కోరుట్ల: అంతా సినీ ఫక్కీలోనే 'డాన్..డెన్' సంస్కృతి కొట్టొచ్చినట్లు కనిపించే తీరు.. ఊరికి చివరగా ఉండే రెండుమూడు అంతస్తుల బంగ్లాల అడ్డాలు. బంగ్లాల్లో కింది అంతస్థులో విత్తనాల నాగరాజుకు సమాచారం.. మద్యం ఇతరత్రా మత్తు పదార్థాలు సరాఫరా చేసే యువకులు.. ఆ పైభాగంలో మరో ఇద్దరు ముగ్గురు యువకులు.. చివరి అంతస్థులో విత్తనాల నాగరాజు. ఇలా పట్టణంలో రెండు మూడు చోట్ల అడ్డాలు వేసిన నాగరాజు తన కార్యకలాపాల కోసం తరచూ అడ్డాలు మార్చేవాడని పోలీసులు విచారణలో తేలింది. ఇంత పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకున్నా నేరానికి పాల్పడిన నిందితులు పోలీసులకు చిక్కకతప్పలేదు.

అనుచరులు పాతికేళ్లలోపే..

పోగుల లక్ష్మీరాజం హత్య కేసులో పోలీసులు శుక్రవారం చూపిన నిందితుల్లో ఐదుగురు పాతికేళ్ల లోపు యువకులే. వీరిలో ఒకరికి కేవలం 18 ఏళ్లు మాత్రమే ఉండటం గమనార్హం. గంజాయి, మద్యం మత్తుకు బానిసగా మారిన వీరు అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలన్న ఆశతో సెటిల్‌మెంట్లు, బ్లాక్‌మెయిల్, బెదిరింపులు, డబ్బులు వసూళ్లకు దిగిన సంఘటనలు అనేకమున్నట్లు ప్రచారం. అయిలాపూర్ రోడ్డులో చివరగా ఉండే నాగరాజుకు చెందిన ఓ బంగ్లాలో కోరుట్లలో రైస్‌మిల్ నడిపే ఓ యువకుడిని, అతనికి మద్దతుగా వచ్చిన మరో యువకుడి నగ్న వీడియోలు తీసి చితకబాది మరీ రూ.10 లక్షల వరకు డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఇదే తరహాలో ముత్యాలవాడలో ఓ చిన్నపాటి జ్యోతిష్యుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

మళ్లీ కస్టడీకి..

పోగుల లక్ష్మీరాజం హత్యకేసులో అరెస్టు అయిన వారిలో కొందరిని పోలీసులు మళ్లీ కస్టడీలోకి తీసుకోనున్నట్లు సమాచారం. లక్ష్మీరాజం హత్య కాకుండా ఇంకా ఏ నేరాల్లో పాలు పంచుకున్నారన్న దానిపై పూర్తిస్థాయి విచారణకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నాగరాజు కేవలం సంచలనం కోసమే హత్య చేశాడని పోలీసులు నిర్ధారించినా బంధువులు, కుటుంబ సభ్యులు మాత్రం ఇంకా ఏమైనా కారణాలతోనేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను మళ్లీ కస్టడీలోకి తీసుకున్న తర్వాత విచారణలో ఎలాంటి విషయాలు తెలుస్తాయోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.9.40 కోట్లతో 15 జంక్షన్లు

- మేయర్ సునీల్‌రావు


జంక్షన్ పనులను పరిశీలిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: ఆధునీకరణ...సుందరీకరణలతో నగరం కొత్తరూపు సంతరించుకుంటోందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మానేరు వంతెన సమీపంలోని స్వాగత తోరణ ఐలాండ్, కోతిరాంపూర్ ఐలాండ్‌తో పాటు భగత్ సింగ్ జంక్షన్, బొమ్మకల్ ఫ్లైఓవర్ జంక్షన్లను పరిశీలించిన మేయర్ అధికారులకు పలు సూచనలు చేశారు. మేయర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలోని కూడళ్లల్లో జంక్షన్‌లను అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా రూ.9.40 కోట్లతో 15 జంక్షన్‌లు అభివృద్ధి చేపట్టామని అన్నారు. ఇప్పటికే ఆరు జంక్షన్‌ల పనులు పూర్తయ్యాయని, నాలుగు జంక్షన్‌ల పనులు ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. మరో ఐదు జంక్షన్‌ల పనులు ప్రారంభించాల్సి ఉందని వివరించారు. కార్పొరేటర్లు ఐలెందర్ యాదవ్, తోట రాములుతో పాటు ఎడ్ల అశోక్, డీఈ మసూద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ ద్వారం...మరింత సుందరం

నగర ముఖ ద్వారాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని నగరపాలకసంస్థ చేపట్టింది. నగరంలోకి ప్రవేశించే మానేరువాగు వంతెనపై ×మన కరీంనగర్₹ లోగోను నూతనంగా ఏర్పాటు చేశారు. 24 గంటల తాగునీటి సరఫరా పైలాన్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన ఈ లోగో ఆకర్షణీయంగా మారింది. ప్రజలను ఆకట్టుకొంటోంది.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆదేశించారు. శనివారం నగరంలోని 12,15 డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా 12వ డివిజన్ భగత్‌నగర్‌లో రూ.14 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం 15వ డివిజన్‌లో రూ.95 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పనులు నాణ్యతతో చేపట్టాలని, త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట రాములు, నాగసముద్రం జయలక్ష్మితో పాటు కాశెట్టి శ్రీనివాస్, వరాల నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలు రద్దు చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాం


కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్: గ్రూప్–2 పరీక్షలు రద్దు చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్ అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ శనివారం తెలంగాణ చౌక్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడడం సరికాదన్నారు. అవినీతి అక్రమాలకు నిలయమైన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయకుండా, దోషులమీద చర్యలు తీసుకోకుండా తిరిగి గ్రూప్– 2 పరీక్షలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మేకల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కి బాలకిషన్, జిల్లా కోశాధికారి కాంపల్లి రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు బండపల్లి శ్రీకాంత్, మహంకాళి తిరుపతి, నాయకులు బోనగిరి ప్రభాకర్, ఏగొల్లపు వెంకన్నగౌడ్, కుమ్మరి సంపత్, మంద రవీందర్, కొంకట శేఖర్, మారేపల్లి మొగులయ్య, దొడ్డే శ్రీనివాస్ తదితరులున్నారు.

బెజ్జంకిలో రోడ్డు ప్రమాదం

- చింతగుట్ట సర్పంచ్ దంపతులకు తీవ్రగాయాలు



శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం చింతగుట్ట సర్పంచ్ దంపతులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాలు.. సర్పంచ్ రజిత పెద్ద కూతురు సిద్దిపేట జిల్లాలోని సంక్షేమ హాస్టల్‌లో చదువుతోంది. కూతురును చూసేందుకు శనివారం చింతగుట్ట నుంచి రజిత ఆమె భర్త లక్ష్మణ్ సొంత ఆటోలో చిన్న కూతురుతో కలిసి బయలుదేరారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి క్రాస్ రోడ్డు దాటాక వీరు ప్రయాణిస్తున్న ఆటోను కరీంనగర్‌కు చెందిన కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆటో పల్టీలు కొడుతూ బోల్తాపడింది. లక్ష్మణ్, రజితకు తీవ్రగాయాలు కాగా చిన్న కూతురు క్షేమంగా బయటపడింది. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయింది. ప్రమాద విషయాన్ని రజిత వెంటనే మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పీఆర్‌వో తిరుపతికి ఫోన్ చేసి వివరించారు. ఈక్రమంలో వెంటనే స్థానిక బీఆర్ఎస్ నాయకులను పంపించగా, వారు వెంబడించి కారును పట్టుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా లక్ష్మణ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో రజిత చికిత్స పొందుతున్నారు.

ఉత్సాహంగా 'అల్ఫోర్స్ ఖేల్'


పోటీలు ప్రారంభిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ×అల్ఫోర్స్ ఖేల్₹ పేరిట నిర్వహించిన పోటీలను విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడానికి పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అర్చరీ, హాకీ, టెన్నికాయిట్, చెస్, రన్నింగ్, క్రికెట్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అలాగే కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యత, సమరయోధుల పోరాట పటిమను విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని నేరాల్లో నిందితులకు శిక్షపడాలి

కరీంనగర్‌క్రైం: ప్రతి నేర ఘటనలో నిందితులు శిక్షింపబడేలా కోర్టు డ్యూటీ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కరీంనగర్ అడిషనల్ పోలీస్ కమిషనర్ (పరిపాలన) సి.రాజు అన్నారు. శనివారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో కోర్టు డ్యూటీ అధికారుల(సిడీవో) శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, ప్రతి కేసులోని దశలను సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడూ తెలియజేస్తూ పటిష్ట చర్యలు తీసుకోవడం ద్వారా నిందితులు శిక్షింపబడుతారనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. కేసులు ఏయే దశల్లో ఉన్నాయో ఏ రోజుకారోజు సీడీవోలు సీసీటీఎన్ఎస్‌లో అప్లోడ్ చేయాలన్నారు. నిందితులు శిక్షింపబడటంలో నూతనోత్సాహంతో పనిచేసే సీడీవోలకు ప్రోత్సాహకాలను అందజేస్తామని పేర్కొన్నారు. నిందితులు శిక్షింపబడటం ద్వారా నేరాలు నియంత్రణలోకి రావడంతోపాటు పాత నేరస్తులు జైలు శిక్షలు విధించబడుతాయనే భయంతో నేరాలకు పాల్పడకపోయే అవకాశాలున్నాయని వివరించారు. కార్యక్రమంలో సీసీఆర్‌బీ ఎస్ఐ నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి మహాత్మాగాంధీ చిత్ర ప్రదర్శన

కరీంనగర్ అర్బన్: స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాల్లో మహాత్మాగాంధీ చలనచిత్రాన్ని సినిమా థియేటర్లలో ఉచితంగా ప్రదర్శించనున్నారు. ఈ నెల 25వరకు చిత్ర ప్రదర్శన ఉండనుండగా కలెక్టర్ డా.బి.గోపి తదనుగుణ చర్యలు చేపట్టారు. కాగా విద్యార్థులను థియేటర్‌ల వద్దకు ఉచితంగా తీసుకెళ్లి క్షేమంగా తిరిగి గమ్యస్థానాలకు చేర్చనున్నారు. 15న ఇండిపెండెన్స్ డే, 20న ఆదివారం కారణంగా చిత్ర ప్రదర్శన ఉండదని రెవెన్యూ అధికారులు వివరించారు. 16 నుంచి 25 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ప్రదర్శన ఉంటుంది. కలెక్టర్ ఆధ్వర్యంలో థియేటర్‌ల నిర్వాహకులు, విద్య, రవాణా, పోలీసు, సమాచార శాఖల అధికారులు గాంధీ చలన చిత్ర ప్రదర్శనకు ఏలాంటి ఆటంకాలు లేకుండా సమన్వయం చేయనున్నారు.

గమ్యం యాప్ ఆవిష్కరణ



విద్యానగర్(కరీంనగర్): ప్రయాణికులు తాము ఎక్కాల్సిన బస్సు ఎక్కడ ఉంది, బస్సు కోసం ఎంత సేపు నిరీక్షించాలి తదితర వివరాలు తెలుసుకునేందుకు వీలుగా ఆర్టీసీ రూపొందించిన గమ్యం ఆన్‌లైన్ ట్రాకింగ్ యాప్‌ను శనివారం ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ హైదరాబాద్ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రయాణికుల కోసం కార్యక్రమాన్ని కరీంనగర్ బస్‌స్టేషన్‌లో అధికారులు లైవ్‌లో ప్రదర్శించారు. ప్రస్తుతం ఈ యాప్ ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, గరుడ ప్లస్ బస్సులకు అందుబాటులో ఉంటుంది. యాప్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పెద్ద స్క్రీన్‌పై ప్రదర్శించి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.చందర్‌రావు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) కె.సత్యనారాయణ, కరీంనగర్ 1, 2 డిపోల మేనేజర్లు ప్రణీత్, మల్లయ్య, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పి.రజనీకృష్ణ, స్టేషన్ మేనేజర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు గద్దర్


సంస్మరణ సభలో మాట్లాడుతున్న వేణుగోపాల్


గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: తన ఆట, పాటతో బడుగు, బలహీనవర్గాలను చైతన్యపరిచిన మహనీయుడు గద్దర్ అని ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. శనివారం ఫిలింభవన్‌లో ప్రజామిత్ర ప్రోగ్రెసీవ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో వివిధ ప్రజాసంఘాల నాయకులు గద్దర్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ, గద్దర్ ఆశించిన సమసమాజ స్థాపన కోసం పనిచేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గద్దర్ పాటలు చరిత్రలో నిలిచిపోతాయని, కరీంనగర్ పట్టణంలో గద్దర్ విగ్రహాన్ని తానే స్వయంగా ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో యునైటెడ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొగురం రమేష్, జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు కైరుద్దీన్, మౌలానా జియా ఉల్లా ఖాన్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెన్నం రాజమల్లయ్య, ఎస్‌టీఓ దళిత నాయకులు దేవేందర్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఈశ్వర్, టీపీసీసీ నాయకులు రహమత్, దళిత నాయకులు మేడి మహేష్, గంటశ్రీనివాస్, మాదరి శ్రీనివాస్, కడపల విజయకుమార్, గజ్జల ఆనందరావు, బోయినపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, కట్ట శ్రీనివాస్, కాల్వ సురేష్‌యాదవ్, న్యాయవాదులు పెంచాల ప్రభాకర్ రావు, నీరుమళ్ళ శంకర్, వెన్న ఆనంద్, ముద్దమల్ల అశోక్, వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అస్తమించని ఉద్యమ సూర్యుడు..

విద్యానగర్(కరీంనగర్): ప్రజలను చైతన్యం చేయడంలో అస్తమించని ఉద్యమ సూర్యుడు గద్దర్ అని ఆయన అనుచరులు, అభిమానులు కొనియాడారు. శనివారం ప్రెస్ భవన్‌లో గద్దర్ సంస్మరణ సభ జరిగింది. సభలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత జక్కనపల్లి గణేష్, రిపబ్లికన్ పార్టీ నాయకులు కుతాడి శివరాజ్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వైద్యుల అంజన్ కుమార్, సముద్రాల అజయ్, కొరివి వెంకటస్వామి, లింగంపల్లి నాగరాజు, మొగురం రమేష్, మెండి చంద్రశేఖర్, గంట శ్రీనివాస్, చెరిపెల్లి ఆనంద్, నాగెల్లి దేవేందర్, గోపాల భూషణ్ రావు, నల్లాల కనకరాజు, మేడి మహేష్, జనగామ నర్సింగ్, దుబ్బ నీరజ, దాసరి దశరథం, బామండ్ల రవీందర్ తదితరులు పాల్గొని గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

ప్రజల గుండెచప్పుడు..

కరీంనగర్‌కల్చరల్: పాటకు పట్టం కట్టిన మహనీయుడు, ప్రజల గుండె చప్పుడు గద్దర్ అని తెలంగాణా సాహితి రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు అన్నారు. శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ శంకర్ అధ్యక్షతన కరీంనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభలో మాట్లాడారు. గద్దర్ ఆశయాలు కొనసాగిస్తూ వారు వదిలిన మునుమును కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అన్నారు. సంస్థ బాధ్యులు ఉప్పు లింగయ్య, ఆడేపు రామ్‌నారాయణ, పురుషోత్తం, సతీష్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అపోలోరీచ్‌లో రొబోటిక్ సర్జరీలు


మాట్లాడుతున్న డాక్టర్ కేజే రెడ్డి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ అపోలో రీచ్ ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీల వైద్యం అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ ఎముకలు, మోకాలు, తుంటి మార్పిడి రోబోటిక్ శస్త్ర చికిత్స, ఆర్థోస్కోపీ నిపుణుడు డాక్టర్ కేజే రెడ్డి తెలిపారు. శనివారం ఆసుపత్రిలో మాట్లాడుతూ.. మోకాళ్ల చిప్పలు, తుంటి ఎముక మార్పిడి, ఆర్థోస్కోపిక్ శస్త్రచికిత్సలు, ఏసీఎల్ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు, మెనిస్కస్ శస్త్ర చికిత్సలు, కార్టిలేజ్ శస్త్ర చికిత్స, ఎవాసిక్యులర్ నేక్రోసిస్ ఆఫ్ హిప్, స్టెమ్ సెల్ థెరపీ, వైఫల్యం చెందిన మోకీళ్ల మార్పిడి తిరిగి సరి చేయడం, క్లిష్టమైన కీళ్ల మార్పిడి మొదలగు అరుదైన శస్త్ర చికిత్సలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సను రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానంతో చేయనున్నామని వివరించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ ఇఫ్తేకార్, డాక్టర్ నాగసతీష్ పాల్గొన్నారు.

అవినీతి మిల్లర్లపై పీడీయాక్ట్ నమోదు చేయాలి


హుజూరాబాద్: రేషన్ బియ్యం కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేస్తూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై పీడీయాక్ట్ నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. రైస్‌మిల్లుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా సివిల్ సప్లై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉన్న జిల్లాలోనే 81 రైస్ మిల్లర్లకు నోటీసులు జారీ చేశారని, జారీ చేసి నెల రోజులు గడుస్తున్నా సదరు అవినీతి మిల్లర్లు బియ్యాన్ని లెవీ పెట్టడం లేదని విమర్శించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్, బీజేపీలు అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకాన్ని గడువుతో నిమిత్తం లేకుండా వర్తింపజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజలతో మమేకమై ఆందోళనలు కొనసాగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు శీలం అశోక్, జోన్ కమిటీ సభ్యులు గుండేటి వాసుదేవ్ పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలి


మాట్లాడుతున్న నరేశ్‌పటేల్

కరీంనగర్‌కల్చరల్: ఈనెల 29, 30 తేదీల్లో జరిగే గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేసి 2 నెలల తర్వాత నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్ పటేల్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. గురుకుల బోర్డు పరీక్షలు ఈనెల 23 వరకు ఉండడంతో అభ్యర్థులు సన్నద్ధం అయ్యేందుకు సమయం లేక నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే గ్రూప్–1 పేపర్ లీకేజీతో నిరుద్యోగ అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురయ్యారని, మళ్లీ ఈ పరీక్షలకు సమయం ఇవ్వకుండా నిర్వహిస్తే మరింత నష్టపోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి ఏటా ప్రత్యేక జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అనిల్, వినయ్, సురేష్, జహంగీర్, నవీన్, సాయి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్

కరీంనగర్: దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భవించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బోయిని అశోక్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ వేడుకల్లో పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గత 87 ఏళ్లుగా దేశ సమగ్రత, విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు చేస్తున్న సంఘమన్నారు. విద్యార్థి సంఘాలు, మీడియాను చూసి రాష్ట్ర ప్రభుత్వం జంకుతుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లోకి అనుమతించవద్దని విద్యాశాఖ ద్వారా ఆదేశాలు జారీ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకు, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, పైడిపల్లి రాజు, రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్, కేశబోయిని రాము, మామిడిపల్లి హేమంత్, నునావత్ శ్రీనివాస్, వినయ్, సాయి, బోయిని విష్ణు, రాకేశ్, రాజేశ్, సురేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ మాట్లాడుతూ, పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ సంఘం ప్రభుత్వ విద్య పరిరక్షణకు, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుకు నిరంతరం పోరాటాలు సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూపాక శివమణి, వరుణ్ తేజ్, చరణ్, ప్రవీణ్, తరుణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి


హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

హుజూరాబాద్: ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తి చాటాలని రాష్ట్ర పర్యాటక శాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో తపాలా శాఖ చేపట్టిన ×హర్ ఘర్ తిరంగా₹ ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్‌ల్లో కేవలం రూ.25 చెల్లించి జాతీయ పతాకాన్ని కొనుగోలు చేయాలని, ప్రతి ఇంటిపై జెండా ఆవిష్కరించి దేశ సమైక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ యు.మహేందర్, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, పోస్టల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్


ర్యాలీ తీస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

కరీంనగర్‌సిటీ: యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని, వారు తలుచుకుంటే దేశ ముఖచిత్రాన్ని మార్చే శక్తి ఉందని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఎస్సారార్ ఆర్ట్స్, సైన్స్, వివేకానంద డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, ఏ దేశంలోనైనా యువశక్తి చాలా ముఖ్యమైనదని, యువత నైపుణ్యాలను మెరుగుపరచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ పర్లపల్లి రాజు, వివేకానంద కళాశాల ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఎస్.రాజు, సీనియర్ కేడెట్లు భార్గవ్, సుష్మ, అజయ్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు వెంచర్ల కోసం ప్రముఖ సంస్థకు తక్షణం కావలెను. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తక్షణం సంప్ర : 9948801113 [HA-30033]

PLOT FOR SALE

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్లమధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

SERVICES

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788615]

LOANS

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ఫ్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189119]

MACHINES FOR SALE

■ TATA Hitachi Zaxis-370, Two Machines For Sale, Model-2021, Running Hours 15000, Good Running Conditions, @ Andhra Pradesh Granite (Midwest)Pvt.Ltd., Chimakurthy,Ongole - AP. Ph : 7032643709, 9000899762. [HA-501]

GRANITE MACHINES FOR SALE
a) SOCOMEC Italian 72 Multi Wire Variable Thickness Sparingly Used Cutting Machine, In Perfect Running Condition with All Accessories.
b) BARSANTI Italian 16 Head, Brand New Unused Fully Automatic Polishing Line, Perfect Trial Condition with All Accessories.
7397741830
BANGALORE

WANTED

■ క్వాలిఫైడ్ ల్యాబ్ టెక్నీషన్స్, రిసెప్షనిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ డా॥ ఓం డయాగ్నోస్టిక్స్, సివిల్ హాస్పిటల్ ప్రక్కన, కరీంనగర్. సెల్: 9246930093, 6301090216 [K- 1185574]

■ INC ఆఫీస్ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 6300264252 [G-786475]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-11729]

■ Urgently Required Plumber, Electrician, Cooking Master, House Keeping Boys and Telecallers for Hotel Ph: 8309909633, 8637338326, 7893174029 [HA-481]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788737]

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్5K ఫోన్: 9640400073 [HA-189320]

■ ప్రముఖ మహేంద్రా ట్రాక్టర్ ఫార్మ్ మిషనరీ ఇంప్లిమెంట్స్ డిస్ట్రిబ్యూషన్ కం.లో పని చేయుటకు అగ్రికల్చర్ ఇంప్లిమెంట్స్ అనుభవంగల సేల్స్ రిప్రజెంటేటివ్స్ కావలెను. సంప్ర: క్రాంతి: 9704813826, Email: v.kranthisharan@gmail.com [H-796928]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్ /క్లర్క్ /అటెండర్స్ /ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7496]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

క్లుప్తంగా

ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం



గ్రంథ పాలకులను సన్మానిస్తున్న అనిల్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతి సందర్భంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని శనివారం నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధి కోసం అనేక పుస్తకాలు రాసి వాటి నిర్వహణకు విధివిధానాలను రూపొందించిన సంస్కర్త రంగనాథన్ అన్నారు. ఉత్తమ గ్రంథపాలకులైన గ్రేడ్–1, గ్రేడ్–3 లైబ్రేరియన్లకు పెన్ను, పుస్తకం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మల్లెంకి శ్రీనివాస్, ఆరె రవిగౌడ్, పరశురాం, గ్రంథాలయ సంస్థ సిబ్బంది మల్లేశం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎస్కే బాబా

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్ గుండె సంబంధిత వ్యాధితో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా.. మంత్రి గంగుల కమలాకర్ సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.60 వేల చెక్‌ను శనివారం బాధితుడికి బీఆర్‌ఎస్ నాయకుడు ఎస్కే బాబా అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబం సీఎంకు, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ప్రజా గాయకుడు గద్దర్‌కు శనివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం, పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు వంచ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య, నాయకులు కనకయ్య, వెంకటయ్య, శివ, పోతుల రమేశ్, రాజేశం, శ్రీనివాస్, రమేశ్, శ్రీధర్, కాంతయ్య, సతీశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

కరీంనగర్‌రూరల్: కడుపునొప్పి భరించక లేక పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువతి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కరీంనగర్‌రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలం చేగుర్తికి చెందిన గాలిపల్లి చంద్రయ్యకు భార్యతో పాటు ఇద్దరు సంతానమున్నారు. ఈనెల 5న కుటుంబసభ్యులందరూ రాత్రి భోజనం చేసి నిద్రిస్తున్న క్రమంలో 11 గంటలకు కూతురు సాధన (19) కడుపునొప్పి అని చెప్పడంతో తెల్లారి ఆస్పత్రికి తీసుకెళ్తామని తండ్రి చెప్పాడు. తెల్లవారు జామున 5గంటలకు వాంతులు చేసుకుంటున్న సాధనను చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వెంటనే హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా పురుగులమందు తాగినట్లు వైద్యులు గుర్తించారు. ఈక్రమంలో సాధన చికిత్స పొందుతూ శనివారం ఉదయం 7.30గంటలకు మృతి చెందింది. కడుపునొప్పి కారణంగా తన కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘యునాని’ మందుల్లేవ్..!

- ఆరు నెలలుగా అందుబాటులో లేని బీపీ, షుగర్ మందులు
- స్పందించని ఆయుష్ విభాగం అధికారులు
- ప్రైవేటులో కొనుగోలు చేయలేక పేషెంట్ల ఇబ్బందులు



కరీంనగర్‌లోని ప్రభుత్వ యునాని వైద్యశాల

‘‘ప్రభుత్వాసుపత్రుల్లో మందులకు కొరత లేదు.. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. నిరుపేదలు ప్రైవేటుకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రభుత్వాసుపత్రికి వస్తే వైద్యంతో పాటు మందులు ఉచితంగా పొందవచ్చని ప్రభుత్వం చెబుతోంది. కానీ ప్రభుత్వ ప్రకటనలకు విరుద్ధంగా యునాని ఆసుపత్రిలో బీపీ, షుగర్‌కు వాడే అత్యవసర మందులే కరువయ్యాయి.’’

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వ యునాని ఆసుపత్రి రాంనగర్ ఆయుష్ ఆసుపత్రి నుంచి విడిపోయి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోకి వచ్చినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఆయుర్వేదం, హోమియో కంటే యునాని వైద్యానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి మారాక.. పేషెంట్‌లు ఫుల్‌గా పెరిగినా.. మందులు మాత్రం నిల్ అయిపోయాయి. గతంలో ప్రతిరోజూ 60 నుంచి 70 ఉన్న ఔట్ పేషెంట్లు ప్రస్తుతం 100కు పైగా వస్తున్నారు. పేషెంట్లు పెరిగినా మందులు అందడం లేదు. పేషెంట్లకు అతి ముఖ్యంగా అవసరయ్యే బీపీ (కుర్సేత స్కీన్), షుగర్ (కుర్సే జియాబత్రీస్) మందులు ఆరు నెలలుగా సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 100 మంది ఓపీలో సుమారు 40 నుంచి 50 మంది బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులే ఉంటుండడంతో వారికి మందులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ 40 మందికి నెలకు సరిపడా మందులు ఇవ్వాలన్నా 240 షీట్లు అవసరముంటాయి. కానీ బీపీ, షుగర్ మందులు అవసరమైన వారికి చిట్టి మీద రాసి బయట యునాని మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో చేసేది లేక రోగులు డబ్బులు ఖర్చు పెట్టి ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యానికి వచ్చి మందులు బయట కొనుగోలు చేసుకోవడం ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు.

యునాని వైపు మొగ్గు



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ప్రజలు మార్పును కోరుకుంటున్నారు. సైడ్ ఎఫెక్ట్‌లు లేని మందులు వాడుతూ రోగాలు నయం చేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. ప్రతిరోజూ వందకు పైగా పేషెంట్లు రావడమే ఇందుకు నిదర్శనం. ఏళ్ల తరబడి మందులు వాడాల్సి వచ్చే దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకునేందుకు యునాని సేవలను వినియోగించుకుంటున్నారు. అల్లోపతికి లొంగని రోగాలని సైతం యునాని నయం చేస్తుందనే నమ్మకం రోగుల్లో పెరుగుతోంది. కీళ్ల, మోకాళ్ల, నడుం నొప్పులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, షుగర్, బీపీ, థైరాయిడ్ కిడ్నీలో రాళ్లు, ఆస్తమా, మలబద్ధకం, అర్షమొలలు, సోరియాసిస్, బొల్లి వంటి చర్మ వ్యాధులకు యునానిలో చికిత్స అందుబాటులో ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా మొండి వ్యాధులైన బీపీ, షుగర్‌కు మందులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి



అల్లోపతితో పాటు యునాని వైద్యానికి డిమాండ్ పెరిగింది. ప్రజలకు ఎక్కువగా అవసరముండే షుగర్, బీపీ మందులు అందుబాటులో లేకపోవడం వల్ల నిరుపేదల ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వైద్యారోగ్యశాఖ స్పందించి పేషెంట్లకు కావాల్సిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి.

– బోనాల శ్రీనివాస్, మల్లాపూర్

ఇండెంట్ పంపించాం



యునాని ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందుల కోసం ఆయుష్ విభాగానికి ఇండెంట్ పంపించాం. అయితే బీపీ, షుగర్ మందులు ఎక్కువగా అవసరముండడంతో డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా జరగడం లేదు. త్వరలోనే ఈ సమస్యను తీర్చేందుకు, కావాల్సిన స్టాక్ పంపించేందుకు ప్రభుత్వం తరపున ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– డాక్టర్ యశ్రబ్‌సుల్తానా, యునాని వైద్యురాలు

సంస్కృతికి ప్రతీక తీజ్ ఉత్సవాలు



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బంజారాలు

కొత్తపల్లి: బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీనారాయణ అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్‌లో సేవా ఘడ్ గుట్టపై సంత్ సేవాలాల్ మహారాజ్ మేరమ్మ ఆలయం వద్ద ఏటా నిర్వహించే బంజారా తీజ్ బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన తీజ్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ మేరమ్మ చిత్రపటాలకు పూలమాలవేసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. తరతరాలుగా లంబాడి ప్రజలు తమ సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తూ సుఖసంతోషాలతో, ఆరోగ్యాలతో ఉంచాలని, పెళ్లి కాని బంజారా ఆడబిడ్డలకు మంచి వరుడు దొరకాలని సేవాలాల్ మేరమ్మ దేవతలను కొలుచుకుంటూ జరుపుకునే పండుగ బతుకమ్మ తీజ్ ఉత్సవాలని అన్నారు. వివిధ గ్రామాల నుంచి చింతకుంటకు విచ్చేసి ఇక్కడ కూడా తీజ్ ఉత్సవాలు జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకుంట ఎంపీటీసీ భూక్య తిరుపతినాయక్, వార్డు సభ్యురాలు సుజాత, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మోహన్‌నాయక్, దశమి భాయ్, శ్రావణ్‌నాయక్, రామచంద్రనాయక్, శ్రీనివాస్‌నాయక్, రవి నాయక్, పూజారులు ముఖ్య భాస్కర్ నాయక్, విట్టల్ నాయక్, మహిళా నాయకులు లావణ్య, లలిత, మనీ బాయ్, నిర్మల, బుజ్జి, సరోజన, పార్వతి, సోజా జ్యోతి, బంజారా ఆడపడుచులు శివాని, అఖిల, రమ్య, సంగీత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాములు

కరీంనగర్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాడుగుల రాములు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వంచన పూరితంగా వ్యవహరిస్తుందని, నాడు సీఎం కేసీఆర్ మాట్లాడిన మాటలు ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ములుకల కుమార్, పల్కల ఈశ్వర్‌రెడ్డి, కొమ్ము రమేష్, పోరెడ్డి దామోదర్‌రెడ్డి, యాంసాని ఉమారాణి, ఈశ్వర్‌రెడ్డి, జావేద్, చంద్రశేఖర్, తిరుపతి, రాజమౌళి, దామోదర్, తిరుపతిగౌడ్, రాంకిరణ్, శ్రీనివాస్, కిషన్‌రావు, రాజమల్లు, చంద్రమౌళి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సరితారెడ్డికి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సరితారెడ్డి

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన గ్రంథపాలకురాలు సరితారెడ్డికి అవార్డు వరించింది. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ గ్రంథపాలకుల దినోత్సవంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ గ్రంథపాలకురాలు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

గ్రూప్–2 అభ్యర్థులపై లాఠీచార్జి హేయమైన చర్య



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్‌కల్చరల్: గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులపై లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆసంపెల్లి వినయ్ అన్నారు. శనివారం నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో గ్రూప్–2 అభ్యర్థులపై లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గ్రూప్ 1, 4 సంబంధించిన పరీక్షలు నిర్వహించడం, వెనువెంటనే మళ్లీ గ్రూప్–2 పరీక్ష తేదీలు ఖరారు చేయడం, ఈనెల 23వ తేదీ వరకు గురుకుల బోర్డు, జూనియర్ లెక్చరర్ల పరీక్షలు ఉన్నందున గ్రూప్–2 పరీక్ష ప్రిపరేషన్‌కు విద్యార్థులకు సమయం సరిపోవడం లేదన్నారు. పరీక్ష సిలబస్ మారడంతో విద్యార్థులు ఇబ్బందికి లోనవుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం గ్రూప్–2 పరీక్షను వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు తిప్పారపు రోహిత్, ఉపాధ్యక్షులు రత్నం సురేష్ మనోజ్, నాయకులు సుధీర్, ప్రవీణ్, రాకేశ్, హిందూ, త్రిష, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘బీసీ కార్పొరేషన్ స్పెషల్ రుణాల్లో పక్షపాతం’



మాట్లాడుతున్న రోహిత్‌రావు

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వం అందించే బీసీ కార్పొరేషన్ స్పెషల్ కోటా రుణాల్లో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు పక్షపాతం చూపిస్తున్నారని కాంగ్రెస్ నేత మేనేని రోహిత్‌రావు ఆరోపించారు. శనివారం ఓ ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్పెషల్ కోటా రుణాల్లో అనుచరులకే పెద్ద పీట వేసి నిజమైన అర్హులను మరిచారని విమర్శించారు. సమాచార హక్కు చట్టం 2005 ద్వారా బీసీ వెల్ఫేర్ స్పెషల్ రుణాల కోటా కింద జిల్లా బీసీ డెవలప్‌మెంట్ ఆఫీస్ అందించిన వివరాల ఆధారంగా 2016 నుంచి 2023 వరకు 14 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. అర్హులైన బీసీలను గుర్తించి వారికి అందించాల్సిన ఈ సహాయాన్ని దుర్వినియోగపర్చి కేవలం తమ అనుచరులకే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు అబ్దుల్ రెహమాన్, రహమత్ హుస్సేన్, మహమ్మద్ ఆమీర్, కామిరెడ్డి రామిరెడ్డి, కొత్తపల్లి పంజాల స్వామిగౌడ్, సిరిపురం నాగరాజు, వంశీ, అజయ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సంఘం కార్యవర్గం



నియామకపత్రాలు అందజేస్తున్న టీఎన్జీవో నేతలు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ అర్బన్, రూరల్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సంఘం (టీఎన్జీవో అనుబంధం) అధ్యక్షురాలిగా బి.రమణ(అసిఫ్‌నగర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం టీఎన్జీవో భవన్‌లో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, మారుపాక రాజేశ్ భరద్వాజ్ వ్యవహరించారు. అధ్యక్షురాలిగా బి.రమణ, కార్యదర్శిగా వి.కృష్ణవేణి(మారుతినగర్) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. గౌరవ అధ్యక్షురాలిగా సీహెచ్.వసంత, ఉపాధ్యక్షులుగా యం.లక్ష్మీదేవి, కె.వరలక్ష్మి, వి.భాగ్యలక్ష్మి, ఎస్.ఉర్మిళ, జాయింట్ సెక్రటరీలుగా కె.శ్యామల, ఎస్.సుస్మిత, కె.వనజ, నయిమున్నీసాబేగం, కోశాధికారిగా బి.పద్మశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.అహల్య, పబ్లిసిటీ సెక్రటరీగా గంగమహాలక్ష్మి, కార్యవర్గసభ్యులుగా శ్యామల, వినోద, ప్రమీల, శారద, కళావతి, గీత, సరోజన, సరితలు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు. టీఎన్జీవో అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, అంగన్‌వాడీ జిల్లా నాయకులు మేరీ లలిత, స్వరూప, లక్ష్మి, భాగ్యలత, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో నమూనా ఎన్నికలు



నమూనా ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థినులు



సెయింట్ పాల్స్‌లో..

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో శనివారం ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలకు హెడ్ బాయ్, హెడ్ గర్ల్, క్రీడా రంగానికి, క్రమశిక్షణ రంగానికి సాంస్కృతిక లీడర్లను, హౌస్ నాయకులను ఎన్నుకునేందుకు విద్యార్థులు తమ ఓటు హక్కును ఆసక్తిగా ఈవీఎంల ద్వారా వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఉపాధ్యాయులను, విద్యార్థులను పాఠశాల అధినేత ఇ.ప్రసాద్‌రావు అభినందించారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటు అనేది ఆయుధమని, నేటి బాలలే రేపటి భావి పౌరులని, భవిష్యత్ నిర్దేశకులని అన్నారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్, వినోద రావు వీయూఎం.ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్రపాత్రో, రాము, హరిప్రియ, సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో..

విద్యానగర్(కరీంనగర్): సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాఠశాల డైరెక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మన దేశం ప్రజాస్వామ్య దేశమని. ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతీపౌరుడి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

కరీంనగర్‌కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్, ఎస్సారార్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం, పద్య కవితా సదస్సు ఆధ్వర్యంలో రామాయణ కల్పవృక్ష కావ్య అధ్యయన ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సప్తగిరి కోదండ రామాలయంలో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విశిష్ట అతిథిగా పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ హాజరవుతారని పేర్కొన్నారు. సాహితీవేత్తలు, కవులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ గుడ్డుపై ప్రత్యేక ముద్ర



కరీంనగర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న కోడిగుడ్లపై ప్రభుత్వం ప్రత్యేక గుర్తును ముద్రించింది. పౌష్టికాహార లోపం లేకుండా చూసేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కోడిగుడ్లను పంపిణీ చేస్తోంది. అయితే కేంద్రాలకు అందించే గుడ్లు కొన్ని చోట్ల పక్కదారి పడుతున్నాయనే ఫిర్యాదులతో ఐసీడీఎస్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. చిన్న గుడ్లు రావడం, తినడానికి వీలు లేకుండా ఉంటున్నాయనే ఆరోపణల మేరకు అక్రమాలను నిరోధించాలనే ఉద్దేశ్యంతో ప్రతీ గుడ్డుపై జోన్ నంబర్‌తో పాటు అంగన్‌వాడీ గుడ్లు తెలంగాణ ప్రభుత్వం అనే ముద్ర వేసి సరఫరా చేస్తున్నారు. కరీంనగర్‌రూరల్ మండలంలో 27 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతినెలా ఆయా కేంద్రాల ద్వారా 800మంది లబ్ధిదారులకు ఈ గుడ్లను అందజేస్తున్నారు. కేంద్రాల నుంచి గుడ్లు పక్కదారి పట్టకుండా ఉండటంతో పాటు నాణ్యమైన గుడ్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11కేవీ భగత్‌నగర్, ఉజ్వల పార్క్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని భగత్‌నగర్, ముకరంపుర, విఘ్నేశ్వరకాలనీ, ఎన్‌జీవోస్‌కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్, అంబేడ్కర్ స్టేడియం, కలెక్టర్ కాంప్లెక్స్, బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్ఐసీ ఆఫీసు, తిరుమల్‌నగర్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, దోబీవాడ, కమాన్, అల్కాపురి, ఎన్టీఆర్ విగ్రహం, కోతిరాంపూర్, కట్టరాంపూర్, వినాయకనగర్, శ్రీనివాసనగర్, గౌతమినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 33/11 కేవీ వావిలాలపల్లి, టవర్ సర్కిల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శరవేగంగా బీటీ రోడ్డు పనులు



ట్రాక్టర్‌తో మట్టి చదును చేస్తున్న దృశ్యం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని గుజ్జులపల్లె నుంచి ప్రశాంత్‌నగర్ కాలనీ మీదుగా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వరకు రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గతనెల 26న రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. భారీవర్షాలు కురిసిన నేపథ్యంలో రోడ్డు పనుల్లో జాప్యమేర్పడుతుందని స్థానికులు భావించినప్పటికీ యుద్ధప్రాతిపదికన కాంట్రాక్టర్ పనులు పూర్తి చేస్తున్నారు. స్థానిక రైతులు సైతం రోడ్డు నిర్మాణానికి స్వచ్ఛందంగా భూమిని ఇవ్వడానికి ముందుకు రావడంతో ఎలాంటి ఆటంకం లేకుండా పనులు సాగుతున్నాయి. రోడ్డు పనులకు ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి రైతులతోపాటు అధికారులను సమన్వయం చేస్తున్నారు. వర్షాకాలంలో పోచమ్మ ఒర్రె ఉప్పొంగినప్పుడు లోలెవల్ కల్వర్టు నీటమునగడంతో గుజ్జులపల్లె, ప్రశాంత్‌నగర్‌కాలనీలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల నాలుగు రోజులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే దుబ్బపల్లి నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండా వచ్చే అవకాశం కలుగుతుందని ఆయా కాలనీవాసులు పేర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణంతో పొలాలకు పోవడంతో పాటు నేరుగా దుబ్బపల్లి వద్ద రాజీవ్‌రహదారిలోకి ప్రవేశించేందుకు మార్గం ఏర్పడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

‘అచీవర్స్’లో కలర్స్ డే



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని కోతిరాంపూర్‌లో గల అచీవర్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన కలర్స్ డే వేడుకలు అలరించాయి. పాఠశాల విద్యార్థులు వివిధ రకాలైన రంగుల దుస్తులు ధరించి, వస్తువులు ప్రదర్శించి వాటి యొక్క ప్రాముఖ్యతను ప్లకార్డుల సహాయంతో వివరించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సిద్దిపేటలో జురాసిక్ పార్క్



డైనోపార్క్ నిర్మాణానికి రూ.12 కోట్ల వ్యయం
సందర్శకుల కోసం ఓపెన్ ట్రైన్ సౌకర్యం
వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు

వందల ఏళ్ల కిందట అంతరించిపోయిన డైనోసార్లకు హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ వెండితెరపై రూపం ఇచ్చి ప్రాణం పోశారు. 1993లో వచ్చిన జురాసిక్ పార్క్ క్రియేట్ చేసిన ట్రెండ్ అంతా ఇంతా కాదు. ఆ తరువాత కూడా ఆ చిత్రానికి కొనసాగింపుగా అనేక సినిమాలు వచ్చి ప్రేక్షకాదరణ పొందాయి. ప్రజలకు డైనోసార్లపై ఉన్న ఆసక్తిని గమనించి ఆ తర్వాత డైనోసార్ థీమ్‌తో ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాల్లో పార్కులు వెలిశాయి. నూతన సాంకేతికతను ఉపయోగించి నిజంగా ప్రాణం పోసుకున్నాయా అన్నట్టుగా డైనోసార్లను తయారుచేసి ప్రదర్శించారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటైన రీతిలో ఇప్పుడు కొత్తగా డైనోపార్క్ మన తెలంగాణలోనూ అందుబాటులోకి రాబోతుంది. దానికి సిద్దిపేట వేదిక కాబోతుంది.

సాక్షి, సిద్దిపేట

విదేశాల్లోని పార్కుల తరహాలో

డైనోపార్క్ అంటే ఏదో ఎగ్జిబిషన్‌లా బొమ్మలు, 3డీ యానిమేషన్ స్క్రీన్లు కాదు. అమెరికా, సింగపూర్‌లలోని యూనివర్సల్ వరల్డ్ స్టూడియోలో ఉన్న డైనోపార్క్‌ల తరహాలో కోమటిచెరువు సమీపంలో పార్క్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ పార్క్ పనులు ఏడాది కిందట మొదలు కాగా ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

1.5 ఎకరాల విస్తీర్ణంలో..

డైనోసార్ పార్క్‌ను 1.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.12 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ డైనో పార్క్‌లో పెద్ద గుహలు, కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతం, లావా, గ్రీనరీ, వాటర్‌ఫాల్స్ ఇలా మూడు వేల శతాబ్దాల కిందట భూమండలం మీద పరిస్థితులు ఎలా ఉండేవో కళ్లకు కట్టినట్టుగా ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో వివిధ రకాల డైనోసార్‌లు, వాటి గుడ్లు, అస్థిపంజరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సిలికాన్ డైనోసార్లను ఇక్కడ అందుబాటులో ఉంచుతున్నారు. ఇవి పార్కు ఆవరణలో అటూ ఇటూ కలియతిరుగుతూ భీకరంగా శబ్దాలు చేస్తూ సందర్శకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నాయి.

వాకింగ్ డైనో..

ఈ డైనో థీమ్ పార్క్‌లో వాకింగ్ డైనోసార్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో చిన్నారులు కూర్చుంటే నడుచుకుంటూ వెళ్తుంది. ఒకేసారి ఆరుగురు చిన్నారులు కూర్చునే విధంగా రూపొందించారు. అలాగే లోపల గుహల్లో తిరుగుతున్న సమయంలో సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. డైనోసార్ గుడ్డులో నుంచి పిల్ల బయటకు వస్తుండగా సెల్ఫీ తీసుకునే అవకాశం ఉంటుంది. పార్క్‌ను చూసేందుకు వస్తున్న పిల్లలను అలరించేందుకు డైనోసార్ సూట్ వేసుకుని ఇద్దరు తిరగనున్నారు.

మినీ ట్రాక్.. ఓపెన్ ట్రైన్

డైనోసార్ పార్కులో ఉన్న వింతలు విశేషాలను చూసేందుకు వీలుగా 240 మీటర్ల నిడివితో మినీ ట్రాక్‌ను నిర్మించారు. దీనిపై ఓపెన్‌ట్రైన్ నడుస్తుంది. ఈ ట్రైన్‌లో 3 బోగీలు ఉండగా ఒక్కో బోగీలో ఆరుగురు కూర్చునే వీలుంది. ఈ ఓపెన్ ట్రైన్‌లో తిరుగుతున్న సమయంలో సందర్శకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేలా ఒక్కసారిగా డైనోసార్‌లు మీదపడినట్టు, భీకరంగా అరవడం లాంటివి చేసేలా పార్క్‌ను డిజైన్ చేశారు.



డైనోపార్క్‌లో గుహలు, డైనోసార్‌లు

గుజరాత్‌ను మించేలా..

మన దేశంలో గుజరాత్‌లోని రయోలిలో డైనోసార్ గుడ్లు లభించాయి. దీంతో అక్కడ డైనోసార్ మ్యూజియం ఏర్పాటు చేశారు. ఈ మ్యూజియంలో నిలకడగా ఉండే డైనోసార్‌లను ప్రదర్శనకు ఉంచారు. డైనోసార్లలో ఒక్కటి మాత్రమే అరుస్తూ.. తోక ఊపుతుంది. కానీ సిద్దిపేటలో ప్రారంభంకాబోతున్న పార్క్‌లో కదిలే డైనోసార్లు 18 ఉన్నాయి. ఇవికాకుండా మరో ఐదు నిలకడగా ఉండేవి ఏర్పాటు చేశారు. ఒక రకంగా దేశంలో ఇదే అత్యుత్తమ, అత్యంత పెద్ద డైనోసార్ పార్క్ అని అంటున్నారు.

కొత్త అనుభూతి కలిగిస్తుంది



కోమటి చెరువులో మరో మణిహారంగా డైనోసార్ పార్క్ ఏర్పాటు కాబోతుంది. ఇప్పటికే రాక్‌గార్డెన్, గ్లో గార్డెన్, అడ్వెంచర్ పార్క్‌ల చెంతన వినూత్నమైన రీతిలో కొత్త అనుభూతిని కలిగించేలా డైనోసార్ పార్క్ అందుబాటులోకి రానుంది. సాహస అనుభవాలని, జ్ఞాపకాలని, మధురానుభూతిని కలిగించేలా డైనోసార్ పార్కు ఉంటుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా సిద్దిపేటలో ఈ పార్క్ ఉండబోతుంది.
–హరీశ్‌రావు, రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి

అయ్యో.. ఆరేళ్లకే నూరేళ్లు!

- తిరుమల కొండపై బాలికను చంపేసిన వన్యమృగం
- అలిపిరి నడక మార్గంలో శుక్రవారం రాత్రి చిన్నారి అదృశ్యం
- అటవీ ప్రాంతంలో శనివారం మృతదేహం లభ్యం
- చిరుతా, ఎలుగుబంటా అనేది అనుమానం



చిన్నారి లక్షిత (ఫైల్ ఫొటో)



కుమార్తె లక్షిత మృతితో విలపిస్తున్న తల్లి శశికళ

తిరుమల/కోవూరు: తిరుమల కొండపై తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అలిపిరి నడకదారిలో శుక్రవారం రాత్రి ఆరేళ్ల చిన్నారి నడుస్తుండగా అకస్మాత్తుగా ఓ వన్యమృగం చేసిన దాడిలో మృత్యువాత పడింది. నరసింహస్వామి ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం, పోతిరెడ్డిపాళేనికి చెందిన దినేష్‌కుమార్, శశికళ కుమార్తె లక్షిత (6) కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. మ.3.30 గంటల ప్రాంతంలో వారంతా అలిపిరి నడకమార్గం ద్వారా తిరుమలకు కాలినడకన బయల్దేరారు. రాత్రి 7.30 గంటల సమయంలో బాలిక నరసింహస్వామి ఆలయం సమీపంలో అదృశ్యమైంది. తల్లిదండ్రుల కంటే ముందుగానే ఆ చిన్నారి నడుస్తుండడంతో వేరే భక్తుల గుంపులో కలిసి వెళ్లి ఉంటుందని తల్లిదండ్రులు తొలుత భావించి వెతకడం ప్రారంభించారు. ఎంతకూ కనపడకపోవడంతో చివరికి అక్కడున్న భద్రతా సిబ్బందికి తెలిపారు. రాత్రి 10.30కు తిరుమల టూటౌన్ పోలీసులకు బాలిక అదృశ్యంపై ఫిర్యాదు అందింది. దీంతో తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. రాత్రి నుంచి దాదాపు 70 మంది టీటీడీ, అటవీశాఖ సిబ్బంది, పోలీసులు గాలింపు చేపట్టారు. శనివారం ఉ.6 గంటల ప్రాంతంలో నరసింహస్వామి ఆలయం సమీపంలోని నడకదారి నుంచి 150 మీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. పూర్తిగా ముఖాన్ని జంతువు తినడంతోపాటు, కాలిని తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాలిక అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. చిరుత లేదా ఎలుగుబంటి దాడిచేసి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఘటన తీవ్రంగా కలిచివేసింది : ఈఓ ధర్మారెడ్డి

చిన్నారి మృతి తమను తీవ్రంగా కలిచివేసిందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి టీటీడీ నుంచి రూ.5 లక్షలు, అటవీశాఖ నుంచి రూ.5 లక్షలు అందిస్తామని చెప్పారు. బాలిక ఒంటరిగా వెళ్లడాన్ని సీసీ కెమెరాల్లో గుర్తించామన్నారు. బాలిక నరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారి నుంచి పక్కకు అటవీ ప్రాంతంలోకి ఆడుకుంటూ వెళ్లినట్లు అనుమానిస్తున్నామన్నారు. ఎందుకంటే.. బాలిక ఆటవస్తువులు అటవీ ప్రాంతంలోనే దొరికాయని తెలిపారు. ఈ సమయంలో వన్యమృగం దాడిచేసి తీసుకెళ్లినట్లు తెలుస్తోందన్నారు.

భద్రత విషయంలో రాజీలేదు : భూమన

ఇక తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్పష్టంచేశారు. సంఘటనకు దారితీసిన పరిస్థితులపై శనివారం సాయంత్రం అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం బాలిక లక్షిత మృతదేహం లభించిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ఘటనలో ఎవరి నిర్లక్ష్యంలేదని ఆయన మీడియాతో అన్నారు.

అధికారులతో అత్యవసర సమావేశం

మరోవైపు.. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో మరింత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ, అటవీ పోలీస్ అధికారులతో జరిపిన అత్యవసర సమావేశంలో ఈఓ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నడకమార్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. నడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటుచేసేందుకు సమగ్ర నివేదిక అందించాలని డీఎఫ్‌ఓను ఆయన ఆదేశించారు. అలాగే, వన్యమృగాన్ని బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ 100 మంది భక్తుల గుంపునకు సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటుకు అనుమతించనున్నట్లు చెప్పారు. అలాగే, నడకదారుల్లో మ.2–3 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించే అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. చిన్నపిల్లలతో నడకమార్గాల్లో వచ్చే తల్లిదండ్రులు వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఈఓ విజ్ఞప్తి చేశారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, బోన్ల సాయంతో నడక మార్గాల్లో సంచరించే వన్య మృగాలను బంధిస్తామన్నారు.



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్‌కు పండితులు వేద ఆశీర్వాదం చేశారు. అలాగే ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంగస్వామి నటరాజ్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం

- బ్రాహ్మణ పరిషత్ ఉద్యోగులకు అందని జీతాలు
- ప్రభుత్వ సలహాదారు రమణాచారి వ్యాఖ్యలు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని ఎవరు ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా వాస్తవమని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని ఓ హోటల్లో జరిగిన జానపద కళాకారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో కేవీ రమణాచారి మాట్లాడుతూ.. తాను అధ్యక్షత వహిస్తున్న బ్రాహ్మణ పరిషత్‌లోని ఉద్యోగులకు ఈనెల ఇంకా జీతాలు విడుదల కాలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మూడు నెలలుగా పెన్షన్లు రావడం లేదని, డబుల్ బెడ్‌రూమ్‌లు వచ్చేలా చొరవ చూపాలని కోరిన తెలంగాణ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర స్థాయి నేతలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిరసనలు, డిమాండ్‌ల ద్వారానే ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లాలని వారికి సూచించారు. అంతకుముందు ఇటీవల మరణించిన గద్దర్, సాయిచంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్తమ సేవలకు జాతీయ గుర్తింపు

- ఎన్‌క్వాస్ అవార్డుకు ఎంపికైన రెబ్బెన పీహెచ్‌సీ
- ఏటా రూ.2లక్షల చొప్పున మూడేళ్లపాటు మంజూరు



కేంద్ర బృందంతో జిల్లా వైద్యాధికారులు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జాతీయ పురస్కారాలు అందుకోనున్నాయి. ఇందులో భాగంగానే జిల్లాలోని రెబ్బెన ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం క్షేత్రస్థాయిలో సమస్యలను అధిగమిస్తూ జాతీయ ప్రమాణాలు పాటించి కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాస్) అవార్డుకు ఎంపికైంది.

రెండు రోజులపాటు పరిశీలన

కేంద్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అందించే అత్యుత్తమ పురస్కారానికి ఎంపికైనందుకు ఎన్‌క్వాస్ బృందం సభ్యులు గత నెల 18, 19 తేదీల్లో రోజుకు 12 నుంచి 14 గంటల పాటు రెబ్బెన పీహెచ్‌సీని పరిశీలించారు. రోజుకు ఎంతమంది వైద్యం కోసం వస్తున్నారు.. ల్యాబ్ వసతి ఉందా?.. పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రత, పచ్చదనం లాంటి అంశాలు ఎలా ఉన్నాయనే దానిపై కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు.

మూడేళ్లపాటు ఏడాదికి రూ.2లక్షలు

ఎన్‌క్వాస్ అవార్డు కింద ఏటా రూ.2 లక్షల చొప్పున మూడేళ్లపాటు రెబ్బెన పీహెచ్‌సీకి అందజేస్తారు. ఇట్టి నిధులను పీహెచ్‌సీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెచ్చించాల్సి ఉంటుంది.

వివిధ అంశాల ప్రామాణికంగా..

జాతీయ ఆరోగ్య మిషన్ జారీ చేసిన వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకుని జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. రోగులకు అందిస్తున్న సేవలు, హరితహారం, జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, మెడికల్ నిర్వహణను పరిశీలించి 70 మార్కులు కేటాయించారు. వీటి ఆధారంగా జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం పది పల్లె దవాఖానాలను కూడా ఎంపిక చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 18, 19 తేదీల్లో కెరమెరి మండలంలోని సుర్దాపూర్, కౌటాల మండలంలోని గుండాయిపేట్ దవాఖానాలను విజిట్ చేయనున్నారు.

సమష్టి కృషికి నిదర్శనం



అధికారులు, వైద్య సిబ్బంది సమష్టి కృషితో రెబ్బెన పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ అవార్డు దక్కింది. ఈ కార్యక్రమం పూర్తిగా డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు కొనసాగుతుంది. అవార్డుకు ఎంపిక కావడంతో మాపై మరింత బాధ్యత పెరిగింది. పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారం మరువలేనిది.
– సాయిప్రసాద్, జిల్లా క్వాలిటీ మేనేజర్

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్!

- నేడు అంతర్జాతీయ లెఫ్ట్ హ్యాండర్స్ డే



కోల్‌సిటీ(రామగుండం): ఎడమ చేతితో వస్తువులిస్తే.. కుడిచేతితో ఇవ్వమంటారు చాలా మంది. అయితే లెఫ్ట్ హ్యాండ్ తమ జీవితంలో భాగమని, ఆ హ్యాండ్‌తోనే విజయం సాధిస్తున్నామని కొందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఆగస్టు 13న అంతర్జాతీయ లెఫ్ట్ హ్యాండర్స్ డే జరుపుకుంటున్నారు. ప్రపంచ జనాభాలో 10 నుంచి 15 శాతం మంది ఎడమ చేతివాటం వాళ్లే ఉన్నారని అంచనా.

లెఫ్ట్ హ్యాండర్స్ ప్రత్యేకత

ఎడమ చేతివాటం వాళ్లను లెఫ్టీ, సినిస్ట్రాల్, సౌత్ పా, లెఫ్ట్ హ్యాండెడ్, లెఫ్ట్ హ్యాండర్ అని రకరకాలుగా పిలుస్తుంటారు. ఎడమ చేతివాటం వాళ్లంతా తెలివిగలవాళ్లనే విషయం ప్రచారంలో ఉంది. కుడి చేతి వాటం వాళ్లతో పోలిస్తే లెఫ్టీస్‌లో ఐక్యూ లెవల్ నిజంగానే ఎక్కువ. మాట్లాడే శక్తి, వేగం, సామర్థ్యం, అర్థం చేసుకోగల శక్తిసామర్థ్యాలు, భావప్రకటనలో స్పష్టత వీరిలోనే బాగుంటాయని సైంటిస్టులు చెప్తున్నారు. మెదడులో కుడి, ఎడమ అర్ధ భాగాలను అనుసంధానం చేసే 'కార్పస్ కల్లోజమ్' ఎడమ చేతివాళ్లలో ఎక్కువగా ఉంటుంది. వాళ్లలో బ్రెయిన్ చురుగ్గా, సమర్థవంతంగా పని చేయడానికి ఇదొక కారణమంటున్నారు.




ఎడమ చేతి వాటం

ఎడమ చేతితోనే పంచ్



క్రికెట్, కిక్‌బాక్సింగ్ అంటే ఇష్టం. కిక్ బాక్సింగ్‌లో ఎడమ చేతితో కిక్ ఇస్తుంటే అందరూ ఎంకరేజ్ చేసేవాళ్లు. ఇప్పుడు జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా, ఓ పాఠశాలలో ఫిజిక్స్ విభాగం హెచ్‌ఓడీగా వ్యవహరిస్తున్న. చిన్నప్పట్నుంచీ అన్ని పనులు ఎడమ చేతితో చేసేవాడిని.
– కంకటి కుమార్, కిక్ బాక్సింగ్ కోచ్, గోదావరిఖని

లెఫ్ట్ హ్యాండ్‌తోనే అన్నీ..



గోదావరిఖనిలోని జీజీహెచ్ ఆస్పత్రిలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న. అన్ని పనులూ లెఫ్ట్ హ్యాండ్‌తోనే చేస్తుంటా. సిటీ స్కాన్, సీఆర్మ్‌తోపాటు ఎక్స్‌రే, కంప్యూటర్ వర్క్ ఇలా అన్ని పనులు ఎడమ చేతితో చేస్తుంటా.
– ఎండీ.ఫిరోజ్‌ఖాన్, సీటీ స్కాన్ టెక్నీషియన్

మాన్పించడం మంచిది కాదు



కొందరు తల్లిదండ్రులు ఎడమచేతి వాటాన్ని చెడు అలవాటుగా భావిస్తారు. బలవంతంగా మాన్పించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇది సరికాదు. పిల్లల మెదడుపై ప్రభావం చూపుతుంది. కొందరు డిప్రెషన్‌కు గురవుతారు.
– డాక్టర్ ప్రదీప్, సీనియర్ రెసిడెంట్, మానసిక వైద్య నిపుణుడు, గోదావరిఖని

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఐటీ కమిషనర్ బాలకృష్ణ కుటుంబం

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని శనివారం ప్రముఖులు దర్శించుకున్నారు. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో జనం కూడా భారీగా భక్తులు వచ్చారు. దీంతో రద్దీ పెరిగింది. రాష్ట్ర ఐటీ కమిషనర్ బాలకృష్ణ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించి అమ్మవారి శేషవస్త్రంతో ఆశీర్వదించారు.

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని మహారాష్ట్రలోని బాంబే హైకోర్టు జడ్జి శివకుమార్ దిగే కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న జడ్జి

ఏఎస్పీ పూజలు..



ఏఎస్పీ కుటుంబానికి స్వాగతం పలుకుతున్న పోలీసులు

బాసర సరస్వతీ అమ్మవారిని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ కూడా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. బాసర పోలీసులు ఏఎస్పీకి ఘన స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్‌మహారాజ్ చేతుల మీదుగా అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆలయ చరిత్ర, భద్రత ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీసులకు సూచించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి
- విలేకరులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ



నివేశన స్థలాల పట్టాలు అందుకున్న జర్నలిస్టులు

జమ్మికుంట: ప్రజలకు, ప్రభుత్వానికి వారధులైన జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లోని 30 మంది జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. హుజూరాబాద్‌లోని జర్నలిస్టులకు ఇచ్చిన మాటకు కట్టుబడి వారం రోజుల్లో పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తామన్నారు. ఆర్డీవో రాజారెడ్డి, తహసీల్దార్లు రజని, రమేశ్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, జెడ్పీటీసీ శ్రీరాంశ్యామ్, ఎంపీపీలు దొడ్డె మమత, పావని వెంకటేష్ పాల్గొన్నారు. కాగా, ఇళ్ల స్థలాలు పంపిణీపై సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌ను ఒప్పించిన పాడి కౌశిక్‌రెడ్డికి పలువురు జర్నలిసు నాయకులు కృతజ్ఞతలు తెలవపారు.

'గద్దర్ యాదిలో' ఆటాపాటా



నివాళి అర్పిస్తున్న కళాకారులు, నాయకులు

కథలాపూర్(వేములవాడ): ప్రజాగాయకుడు గద్దర్ మృతి కళారంగానికి తీరని లోటు అని సామాజిక తెలంగాణ ధూంధాం రాష్ట్ర అధ్యక్షుడు మారంపెల్లి రవీందర్ అన్నారు. శనివారం రాత్రి జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో కళాకారులు 'గద్దర్ యాదిలో ఘననివాళి' నిర్వహించారు. అంతకుముందు కళాకారులు, నాయకులు, యువకులు కలిసి అంబేడ్కర్ విగ్రహం నుంచి సభా వేదిక వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వేదికపై గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, గోలి మోహన్, జెడ్పీటీసీ నాగం భూమయ్య, మామిడిపెల్లి రవి, గాయకులు మామిడి మౌనిక, మల్లిక్ తేజ, నరేశ్ పాల్గొన్నారు.

నేడు పద్మశాలీ ఆత్మగౌరవ సభ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న పద్మశాలీ ఆత్మగౌరవ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం కల్పించాలన్న లక్ష్యంతో కోరుట్లలో నిర్వహించే భారీ బహిరంగ సభకు సుమారు 30 వేల మంది వరకు పద్మశాలీ కుల బాంధవులు హాజరుకానున్నట్లు సమాచారం. ఇప్పటికే 33 జిల్లాలకు చెందిన పద్మశాలీ నేతలు జనసమీకరణలో తలమునకలయ్యారు. పట్టణ శివారులోని కావేరి గార్డెన్స్ పక్కన ఖాళీ స్థలంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మధ్యప్రదేశ్ చీఫ్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, పరుగుల రాణి పీటీ ఉష సభకు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, కోరుట్ల పట్టణ అధ్యక్షుడు జక్కుల ప్రసాద్, నాయకులు గడ్డం మధు మాట్లాడుతూ... సభకు హాజరయ్యే వారందరికీ కావేరి గార్డెన్స్, సాయిబాబా ఆలయాల్లో భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
ఆదివారం ॥ 13-8-2023

వైరల్



వడుకుమురా! వడుకుమురా!

వడుకుమురా! వడుకుమురా!
వడి వడి స్వేచ్ఛా వాయువు పీల్చి

- రాట్నగీతము
(గురజాడ రాఘవశర్మ)

స్వేచ్ఛాగీతం

స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు అంతర్జాలంలో ఆరంభం అయ్యాయి. ఆనాటి దేశభక్తి గీతాల నుంచి బ్లాక్ అండ్ వైట్ ఫోటోల వరకు రకరకాల పోస్టులు పెడుతున్నారు...

వీరభారతి సందేశం

పరదేశీయులు తొలగండి
ఈ భారతదేశం మా దేశం
వినండి! వినండి! విశ్వప్రజలు వీరభారతి సందేశం

- వానమామలై వరదాచార్యులు
చిత్రం: 1857 సిపాయి తిరుగుబాటు





ఉప్పోయమ్మ ఉప్పు

ముప్పది కోట్ల ప్రజల ముప్పు దీర్చే ఉప్పు
ఉప్పుగాదిది రత్నపు తిప్ప మన పాలిటికి

- ఉప్పపాట (గరికపాటి మల్లావధాని)
ఫోటో: దండి సత్యాగ్రహం: ఏప్రిల్6, 1930

చెప్పరా...లేకున్న ముప్పరా!

చెప్పరా! నీ కన్నులిటపై/ విప్పరా! ఆ ప్రభుత నింతట
త్రిప్పరా! లేకున్న–నీకగు ముప్పురా! మాయప్ప ఇప్పుడు

- పాంచాలము (గరిమెళ్ల)



ఫోటో: సహాయనిరాకరణ ఉద్యమ కాలంలో బాంబేలో బ్రిటిష్ వారి వస్తువులతో ఉన్న ఎడ్లబండి ముందుకు పోకుండా రోడ్డుకు అడ్డంగా పడుకున్న ఉద్యమకారుడు

చూపున్న విజయం

సంకల్పబలం ఉన్న వారికి ఏదీ అవరోధం కాదు. మహారాష్ట్రలోని మహాబలేశ్వర్‌కు చెందిన భవేష్ భాటియాకు కంటి చూపు లేదు. 'అయితే ఏంటీ' అనే పట్టుదల తప్ప 'అయ్యో!' అని నిరాశ అతడి నోటి నుంచి ఎప్పుడూ వినిపించలేదు. 'సన్‌రైజ్ క్యాండిల్స్' పేరుతో క్యాండిల్స్ కంపెనీ ప్రారంభించాడు. ప్రస్తుతం ఇది 350 కోట్ల యాన్యువల్ టర్నోవర్ ఉన్న కంపెనీగా ఎదిగింది, 9,700 మంది అంధులకు ఉపాధి ఇస్తోంది.

'నువ్వు ఈ లోకాన్ని చూడకపోతేనేం, ఒక విజయం సాధిస్తే ఈ లోకమే నిన్ను చూస్తుంది' అనే మంచి మాట భవేష్ విజయాలకు ఇంధనంగా పనిచేసింది.

భవేష్ సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ మాత్రమే కాదు మంచి ఆటగాడు కూడా. పారాలింపిక్స్ వివిధ విభాగాల్లో ఎన్నో మెడల్స్ గెలుచుకున్నాడు.

భవేష్ భాటియా స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.



పప్పుకు నిప్పెట్టాడు!



అప్పు చేసి పప్పు కూడు తినమన్నారు గానీ...పప్పుకు నిప్పెట్టమని చెప్పలేదు పెద్దలు. హరిద్వార్‌లోని జ్వాలానగర్‌కు చెందిన ఈ పెద్దాయన పప్పుకు నిప్పెట్టి 'ఫైర్‌వాలీ దాల్' పేరుతో తన హోటల్లో హాటు హాటుగా అమ్ముతుంటాడు. నెయ్యి... మొదలైన దినుసులు ఉన్న గరిటెను మండించి ప్లేట్‌లో ఉన్న పప్పుకు జస్ట్ అలా తగిలిస్తాడు...అంతే! 'ఫైర్‌వాలీ దాల్'కు రుచికరమైన సూప్‌ను ఉచితంగా ఇస్తాడు. ఈ 'ఫైర్‌వాలీ దాల్' కోసం ఎప్పుడూ వచ్చే వారితో పాటు ఎలా ఉంటుందో ఒకసారి ట్రై చేద్దాం అంటూ వచ్చే వాళ్లు కూడా ఎక్కువే. ఆనోటా ఈ నోటా ఈ 'ఫైర్‌వాలీ దాల్' గురించి విన్న ఒక యువకుడు పనిగట్టుకొని దిల్లీ నుంచి హరిద్వార్‌కు వచ్చాడు. 'ఇతడి చేతిలో ఏదో ఇంద్రజాలం ఉంది' అంటూ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో వేడి వేడిగా పోస్ట్ చేశాడు. 'సో టెంప్టింగ్' అంటూ స్పందించారు నెటిజనులు.

రజనీకాంత్ 'జైలర్' రిలీజ్ సందర్భంగా మన దేశంలో ఉన్న జపాన్ అంబాసిడర్ రజనీలా స్టయిల్‌గా కళ్లద్దాలు ధరించి 'బెస్ట్ విషెస్' చెప్పాడు.
ఇక 'ముత్తు' నాటి నుంచి రజనీకి ఫ్యాన్స్‌గా ఉన్న ఒక జంట ఏకంగా జపాన్ నుంచి చెన్నైకి వచ్చింది సినిమా చూడటానికి!
రజనీ హవా అలా ఉంది.

అర్థమైందా మచ్చా



'హుకుమ్... టైగర్ కా హుకుమ్' అని రజనీకాంత్ చెప్పిన డైలాగ్ సినిమా హాల్లో విజిల్స్‌ను మోతెక్కిస్తోంది. ప్రపంచాన్ని ఇప్పుడు రజనీ చుట్టుముట్టి ఉన్నాడు– జైలర్ సినిమాతో.
అసలే రజనీ అనుకుంటే అతనికి తోడు మోహన్‌లాల్, జాకీష్రాఫ్, శివ రాజ్‌కుమార్ కూడా సినిమాలో ఉండేసరికి మాస్ ఆడియెన్స్ పోటెత్తుతున్నారు. అయితే ఈ సంబరంలో ఇండియన్స్ మాత్రమే లేరు... జపనీయులు కూడా ఉన్నారు. 'ముత్తు' కాలం నుంచి ఇండియాలో రజనీ ఎంతో జపాన్‌లో కూడా అంతే. అంత ఫాలోయింగ్ ఉంది అక్కడ. అందుకే ఇండియాలో ఉన్న జపాన్ అంబాసిడర్ హిరోషి సుజుకీ ఒక వీడియో రిలీజ్ చేసి అందులో రజనీలా స్టయిల్‌గా కళ్లద్దాలు ధరించి 'రజనీ యూ ఆర్ జస్ట్ సూపర్.. విష్ యూ గ్రేట్ సక్సెస్' అని చెప్పాడు. ఇలాంటి మర్యాద ఏ స్టార్‌కూ దక్కలేదు. ఇక జపాన్‌లోని ఒకాసా నుంచి యసుదా హిదెతోషి అనే ఆసామి తన భార్యతో ఏకంగా చెన్నైలో ల్యాండ్ అయ్యాడు 'జైలర్' చూసేందుకు. అతను జపాన్‌లో ఆల్ జపాన్ రజనీ ఫ్యాన్స్ అసోసియేషన్ లీడర్ అట. నెల్సన్ డైరెక్ట్ చేసిన 'జైలర్' ప్రస్తుతం కలెక్షన్ల హవా సృష్టిస్తోంది.

హెల్త్

కొందరికి కొన్ని రకాల పిండితో చేసే కొన్ని వంటలు తిన్నప్పుడు కడుపులో ఒకింత ఇబ్బందిగా ఉండటం, కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనికి కారణం ఆ పిండిలో ఉండే గ్లూటెన్ అనే ఓ ప్రోటీన్. అది ఒంటికి సరిపడకపోవడంతో తమ సొంత వ్యాధినిరోధక వ్యవస్థ తమపైనే ప్రతికూలంగా పనిచేయడం వల్ల ఇలా జరుగుతుంది. అలా వచ్చే ఇబ్బందుల సమాహారాన్ని 'సీలియాక్ డిసీజ్' అంటారు. ఈ ఆరోగ్య సమస్యపై అవగాహన కోసమే ఈ కథనం...



సీలియాక్ డిసీజ్ తగ్గాలంటే..?

గోధుమపిండి, విదేశాలలో నైతే బార్లీ, రై వంటి ధాన్యాల పిండితో చేసే వంటల్లో... ఉదా: మన రోటీలూ, పూరీలతో పాటు పాశ్చాత్యపద్ధతుల్లో చేసే బ్రెడ్, పాస్తా, కేకులు, బిస్కెట్ల వంటివి తిన్నప్పుడు 'సీలియాక్ డిసీజ్' కారణంగా కొంతమందిలో కడుపునకు సంబంధించిన సమస్యలు కనిపిస్తాయి. ఆ ధాన్యాల పిండిలో ఉండే గ్లూటెన్ కారణంగా ఇలా జరుగుతుంది.

గ్లూటెన్ అంటే...?

పిండి కలపడానికి ముందుగా దాన్ని రాశిలా పోసి మధ్యలో గుంట చేసి అందులో కాసిన్ని నీళ్లు పోస్తాం కదా... ఆ పిండిని కలపడం మొదలుపెట్టగానే కాసేపట్లో అది ముద్దగా మారుతుంది. పిండిలో స్వాభావికంగా ఉండే జిగురులాంటి స్వభావాన్నిచ్చే ఓ ప్రోటీనే ఇలా పిండిముద్దలా మార్చేందుకు దోహదం చేస్తుంది. అదే 'గ్లూటెన్'. కొందరికి ఇది సరిపడదు. గ్లూటెన్ సరిపడని స్వభావాన్నే 'గ్లూటెన్ ఇన్‌టాలరెన్స్' అంటారు. (ఇలాంటి వారి కోసం... గ్లూటెన్‌ను వేరు చేసి పిండిని తయారు చేస్తుంటారు. దీన్ని 'గ్లూటెన్ ఫ్రీ' పిండి అని అంటుంటారు. మరికొన్ని రకాల పిండిలో స్వాభావికంగానే గ్లూటెన్ ఉండదు. దాంతో వారికి ఏ ఇబ్బందీ ఉండదు).

ఆ 'పిండి'వంటలు తింటే ఏమవుతుందంటే...

గ్లూటెన్ ఉన్న పిండితో చేసిన పదార్థాలను తిన్నప్పుడు... అది సరిపడని కారణంగా చిన్నపేగుల కణాలు తీవ్రమైన రియాక్షన్‌ను చూపుతాయి. దాంతో చిన్నపేగుల్లోని 'మైక్రోవిల్లై' అనే భాగాలు దెబ్బతింటాయి. జీర్ణమైన ఆహారాన్ని పీల్చుకునే అవి దెబ్బతినడంతో... తిన్నవి ఒంటబట్టకపోవడం, దేహానికి శక్తి సమకూరకపోవడం, ఎముకలకు కావల్సినంత బలం దొరకకపోవడం, మహిళల్లో సంతానలేమి, గర్భస్రావాలు, కొన్ని నరాలకు సంబంధించిన సమస్యలు కనిపిస్తాయి. మొదట్లో సరిపడకపోయినా ఆ తర్వాత్తర్వాత నెమ్మదిగా జీర్ణవ్యవస్థ దానికి అలవాటు కావడం మొదలుపెడుతుంది. అలా జరగకపోతే చిన్నపేగులు/జీర్ణవ్యవస్థ దెబ్బతినడం మొదలై క్రమక్రమంగా అది సీలియాక్ డిసీజ్‌గా మారుతుంది. జీర్ణవ్యవస్థ గ్లూటెన్‌కు అలవాటు కాకపోవడంతో వచ్చే సమస్యను 'రిఫ్రాక్టరీ లేదా నాన్ రెస్పాన్సివ్ సీలియాక్ డిసీజ్'గా చెబుతారు.



డాక్టర్
ధీరజ్ కుమార్ అనుప
మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్

లక్షణాలు : సీలియాక్ డిసీజ్ కూడా ఒకరకమైన ఫుడ్ అలర్జీ లాంటిదే. అయితే దీని లక్షణాలు వేర్వేరు వ్యక్తుల్లో వేర్వేరుగా ఉంటాయి. అవి... ● కడుపులో నొప్పి, గ్యాస్ నిండటంతో కడుపు ఉబ్బరం. దాంతో ఛాతీనొప్పి, ఛాతీలో / గుండెల్లో మంట ● వికారం ● తలనొప్పి, ఒంటి మీద దురదతో కూడిన ర్యాష్ (దీన్ని డాక్టర్లు డెర్మటైటిస్ హెర్పెటోఫార్మిస్ అంటారు) ● కొందరిలో నోట్లో పుండ్లు ● రక్తహీనత ● కొందరిలో నీళ్ల విరేచనాలు / మరికొందరిలో మలబద్ధకం / దుర్వాసనతో కూడిన మలవిసర్జన ● తిన్నది ఒంటబట్టకపోవడంతో బరువు తగ్గడం.

దుష్ప్రభావాలు...

ఆహారం సరిగా ఒంటబట్టకపోవడంతో మరి కొన్ని దుష్ప్రభావాలూ కనిపించవచ్చు. అవి... కొందరిలో దంతాలపై ఎనామెల్ దెబ్బతినడం ● చిన్న పిల్లల్లో (అబ్బాయిలూ, అమ్మాయిల్లో) పెరుగుదల కాస్త మందగించడం ● కొందరిలో పాలు సరిపడకపోవడం (లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్) ● ఎముకలు బలహీనంగా మారడం ● అరుదుగా కొందరిలో నరాల సమస్య రావడంతో చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, స్పర్శ సరిగా తెలియకపోవడం, కాళ్లలో సమస్య తీవ్రంగా ఉంటే సరిగ్గా నిలబడలేకపోవడం వంటి సమస్యలు.

నిర్ధారణ : ● ఆటో ఇమ్యూన్ రుగ్మతలను తెలుసుకునే కొన్ని రకాల రక్తపరీక్షల (యాంటీబాడీస్ అన్వేషించే సీరాలజీ పరీక్షల)తో పాటు ఎర్ర రక్తకణాల సంఖ్యను తెలుసుకునేందుకు చేసే రక్తపరీక్షలు ● దేహంలో ఇన్‌ఫ్లమేషన్ ఉందని తేలినప్పుడు చేసే సీ–రియాక్టివ్ ప్రోటీన్ పరీక్ష ● కాలేయం పనితీరు కోసం 'లివర్ ఫంక్షన్ టెస్ట్' ● పేగుల్లోని ఫ్యాటీ యాసిడ్స్ తెలుసుకునేందుకు కొన్ని పరీక్షలు ● విటమిన్–డి, విటమిన్ బి–12 ల మోతాదును తెలుసుకునే పరీక్షలు ● అవసరాన్ని బట్టి ఎండోస్కోపీ ● పేగుల పరిస్థితిని తెలుసుకునే కొన్ని ఇమేజింగ్ పరీక్షలతో పాటు అవసరాన్ని బట్టి కొన్ని జన్యుపరీక్షలతో సమస్యను నిర్ధారణ చేస్తారు.

నివారణ / చికిత్స :
ప్రధానంగా ఇది ఆటో ఇమ్యూన్ సమస్య కావడంతో నిర్దిష్టమైన చికిత్స ఉండదు. అయితే సమస్యను నివారించడానికి గ్లూటెన్ లేని పిండిని వాడాలని వైద్యనిపుణులు సూచిస్తారు. అలాగే ఆహారలోపం రాకుండా నివారించడం కోసం పాలు, పాల ఉత్పాదనలు, తాజా పండ్లు, పుష్టికరమైన ఆహారం వంటివి తీసుకోవాలని డాక్టర్లు చెబుతారు. సీలియాక్ డిసీజ్‌కు దారితీసే కొన్ని పానీనియాలు, మద్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తారు. అలాగే సమస్య కారణంగా వచ్చే దుష్ప్రభావాలను తగ్గించడం కోసం అంటే నీళ్ల విరేచనాలు / చర్మంపై ర్యాష్ వంటివాటికి సంబంధిత మందుల్ని ఇవ్వడం లాంటివి చేస్తుంటారు. సమస్య తీవ్రతను బట్టి కొన్నిసార్లు స్టెరాయిడ్స్ కూడా ఇవ్వాల్సి రావచ్చు. పిల్లల్లో / పెద్దల్లో మున్ముందు వచ్చే దుష్ప్రభావాల నివారణ కోసం ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు తీసుకోవాలని సూచిస్తారు.

థైరాయిడ్ సమస్య అనగానే హైపర్ థైరాయిడిజమ్, హైపో థైరాయిడిజమ్‌లు గుర్తుకొస్తాయి. హాషిమోటో థైరాయిడైటిస్ అనేది హైపో థైరాయిడిజమ్‌లోని ఒక సమస్య. ఇది తమ సొంత వ్యాధి నిరోధక వ్యవస్థే తమపై ప్రతికూలంగా పని చేయడం వల్ల వచ్చే ఒక రకం ఆటో ఇమ్యూన్ డిసీజ్. అందుకే దీన్ని 'ఆటోఇమ్యూన్ హైపో థైరాయిడిజమ్' అని కూడా అంటారు. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

హాషిమోటో థైరాయిడైటిస్ అంటే..!

మన దేహంలో మెడ దగ్గర సీతాకోకచిలుక ఆకృతిలో ఓ కీలకమైన థైరాయిడ్ గ్రంథి ఉంటుంది. ఇది దేహంలోని అనేక రకాల జీవక్రియలకు అవసరమైన థైరాక్సిన్ అనే హార్మోన్‌ను స్రవిస్తూ ఉంటుంది. తమ సొంత వ్యాధి నిరోధక వ్యవస్థ థైరాయిడ్ గ్రంథిపై వ్యతిరేకంగా పనిచేయడం వల్ల 'థైరాక్సిన్' హార్మోన్ స్రావాలు తగ్గుతాయి. దాంతో అది హైపో థైరాయిడిజమ్‌కు దారితీస్తుంది. ఫలితంగా సరిపోయినంత థైరాక్సిన్ దొరకక దేహానికి అవసరమైన జీవక్రియలు జరగవు. ఈ హైపోథైరాయిడిజమ్‌లోని ఒకానొక కండిషన్ పేరే 'హాషిమోటో థైరాయిడైటిస్'.



కారణాలు:
'హాషిమోటో థైరాయిడైటిస్'కు కారణాలు ఇంకా తెలియదు. కానీ కొన్ని జన్యుపరమైన కారణాలతో, అలాగే హార్మోన్ స్రావాల లోపాలతో ఇలా జరుగుతుందని పరిశోధకులు గుర్తించారు. అదీగాక థైరాయిడ్ సమస్య వచ్చే మహిళల్లోని 20% మందిలో తర్వాత్తర్వాత ఈ సమస్య వచ్చే అవకాశాలూ ఎక్కువని కూడా తెలుసుకున్నారు. గతంలోనైతే ఆహారం లో అయోడిన్ లేని ఉప్పు కారణంగా ఈ సమస్య వచ్చేది. ఎందుకంటే థైరాయిడ్ బాగా పని చేయాలంటే అయోడిన్ అవసరం. పిండదశలోనే ఈ సమస్యతో మానసిక, శారీరక ఎదుగుదల లోపాలు కనిపిస్తాయి. దాన్ని 'క్రెటినిజమ్' అని అంటారు. అయితే ఇటీవల ఐయోడైజ్‌డ్ ఉప్పు లభ్యతతో... వ్యాధి రావడం తగ్గింది. కొన్ని రకాల రేడియేషన్‌లకు గురికావడమూ ఈ సమస్యకు దారితీస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. కొంతమందిలో థైరాయిడ్‌లో గడ్డ లేదా క్యాన్సర్ కణితి రావడంతో, దాన్ని తొలగించడంతోనూ హైపోథైరాయిడిజమ్ రావచ్చు. అయితే... 'హాషిమోటో థైరాయిడైటిస్'లో థైరాయిడ్ గ్రంథి అలాగే ఉంటుందిగానీ... దాని పనితీరు తగ్గుతూపోతుంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో దీని విస్తృతి ఎక్కువ.

లక్షణాలు:
దీని లక్షణాలు వేర్వేరు వయసు వాళ్లలో వేర్వేరుగా కనిపిస్తాయి. స్థూలంగా ఈ కింద పేర్కొన్న విధంగా ఉంటాయి.
➡ మెడదగ్గర ఉండే థైరాయిడ్ గ్రంథిలో వాపు రావడంతో మెడ ముందు భాగం ఉబ్బినట్లుగా కనిపించడం ప్రధానమైన / కీలకమైన లక్షణం
➡ హైపోథైరాయిడిజమ్‌లో థైరాయిడ్ గ్రంథి పనితీరు లోపించినప్పుడు స్థూలకాయం సాధారణం. అందువల్ల ఈ సమస్య బాధితులు బాగా బరువు పెరుగుతుంటారు
➡ నీరసం, నిస్సత్తువ, తీవ్రమైన అలసట
➡ పాలిపోయినట్లుగా కాస్త ఉబ్బినట్లుగా కనిపించే ముఖం
➡ కండరాల, కీళ్ల నొప్పులు
➡ మలబద్ధకం
➡ మహిళల్లో గర్భధారణ సమస్యలు, సంతానలేమి, యువతుల్లో ఆలస్యంగా రజస్వల కావడం, అయ్యాక నెలసరి సక్రమంగా రాకపోవడం, రుతుసమయంలో రక్తం ఎక్కువగా పోవడం వంటి ఇబ్బందులు
➡ జుట్టు రాలిపోవడం, పలచబడటం
➡ గుండె స్పందనల వేగం తగ్గడం
➡ కుంగుబాటు (డిప్రెషన్)కు గురికావడం వంటి మానసిక సమస్యలు కనిపిస్తాయి
➡ పుట్టిన పిల్లల్లో పుట్టుకతోనే (కంజెనిటల్‌గా) హైపోథైరాయిడిజమ్ ఉంటే వాళ్ల మెదడు పెరుగుదల మందగిస్తుంది. పిల్లల దశలోనే వస్తే వాళ్ల ఎదుగుదల దెబ్బతింటుంది. స్కూల్ చదువుల్లో పర్‌ఫార్మెన్స్ తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

చికిత్స:
ఒకసారి హాషిమోటో థైరాయిడైటిస్ ఉందని నిర్ధారణ జరిగాక... బాధితులు ప్రతిరోజూ తగిన మోతాదులో థైరాక్సిన్ మాత్రను పరగడుపున తీసుకోవాల్సి ఉంటుంది. దాంతో దేహంలోని అన్ని రకాల జీవక్రియలకు అవసరమైన థైరాక్సిన్ హార్మోన్ లభ్యమై... అన్ని జీవక్రియలూ సజావుగా/ నార్మల్‌గా జరుగుతాయి. అయితే 'హార్మోన్'ను అందించే (హార్మోన్ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్) ఇవ్వాలి. బాధితులు దీన్ని జీవితాంతం వాడాల్సి ఉంటుంది.

నిర్ధారణ : టీ3, టీ4, టీఎస్‌హెచ్ పరీక్ష చేయించినప్పుడు టీ3, టీ4 మోతాదులు నార్మల్‌గా లేదా తక్కువగానే ఉన్నప్పటికీ టీఎస్‌హెచ్ మోతాదులు ఎక్కువగా ఉంటాయి. యాంటీ–టీపీవో యాంటీబాడీస్ పరీక్షలు చేసినప్పుడు టీఎస్‌హెచ్ మోతాదులతో పాటు యాంటీ–టీపీవో యాంటీబాడీస్, యాంటీ థైరోగ్లోబ్యులిన్ యాంటీబాడీస్ పరీక్షల్లో వాటి మోతాదుల్లో పెరుగుదల కనిపిస్తే దాన్ని 'హాషిమోటో థైరాయిడైటిస్ / ఆటోఇమ్యూన్ హైపోథైరాయిడిజమ్'గా నిర్ధారణ చేయవచ్చు.



డా॥ శ్రీనివాస్ కందుల
కన్సల్టెంట్
ఎండోక్రైనాలజిస్ట్

మెడిటిప్

పెదవుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే...

ఏ సమస్యనైనా దాచడం సాధ్యమేమోగానీ... పెదవులకు వచ్చే సమస్యలు ఇట్టే బయటకు కనిపిస్తాయి. దాంతో అనారోగ్యం బయటపడటంతో పాటు అందం కూడా తగ్గుతుంది. ఫలితంగాసెల్ఫ్ ఎస్టీమ్ కూడా తగ్గుతుంది. అందుకే పెదవుల ఆరోగ్యం కాపాడుకోవాలంటే తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలివి...



● అన్ని పోషకాలు ఉండే సమతుల ఆహారం తీసుకోవాలి ● సిగరెట్లు తాగేవారిలో పెదవులు నల్లగా, బండగా మారవచ్చు. అందుకే స్మోకింగ్ అలవాటును వెంటనే మానేయాలి ● మహిళల్లో లిప్‌స్టిక్ వాడేవారు వాటి కొనుగోలు సమయంలో జాగ్రత్తగా ఉండాలి. అందులో ప్రొపైల్ గ్యాలేట్ అనే రసాయన పదార్థం ఉంటుంది. దాని వల్లనే ప్రధానంగా అలర్జీలు వస్తుంటాయి. లిప్‌స్టిక్ వాడే వారు అది తమకు సరిపడుతుందా లేదా అన్న విషయాన్ని తొలుత పరిశీలించుకుని, తమకు సరిపడుతుందని తేలిన తర్వాతే వాడటం మంచిది ● నిద్రకు ఉపక్రమించే ముందు లిప్‌స్టిక్ శుభ్రంగా కడుక్కోవాలి. ఆ టైమ్‌లో పెదవులపై పలుచగా నెయ్యి లేదా బాదం నూనె రాసుకోవచ్చు ● కొన్ని టూత్‌పేస్ట్‌ల వల్ల కూడా మనకు పెదవులపై దురద రావచ్చు. అలాంటప్పుడు వాటిని ఉపయోగించడం ఆపేయాలి ● నీరు ఎక్కువగా తాగుతుండాలి. పెదవులు తడి ఆరిపోకుండా చూసుకోవాలి. అయితే నాలుకతో తడపకూడదు.



ఆసియా' ప్రాబబుల్స్‌లో రాణి రాంపాల్‌కు దక్కని చోటు

భారత హాకీ సీనియర్ క్రీడాకారిణి, మాజీ కెప్టెన్ రాణి రాంపాల్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. ఆసియా క్రీడల కోసం 34 మంది ప్రాబబుల్స్‌తో ప్రకటించిన జట్టులో ఆమెకు చోటు దక్కలేదు. గత కొంత కాలంగా తనను టీమ్‌లోకి ఎంపిక చేయకపోవడంపై రాణి రెండు రోజుల క్రితమే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మెరుగైన ప్రదర్శన తర్వాత కూడా తనను ఎందుకు పక్కన పెట్టారో హెడ్ కోచ్ జేన్‌కే షాప్‌మన్‌ను ఆమె ప్రశ్నించింది. ఆమె విమర్శలను పట్టించుకోని భారత హాకీ సమాఖ్య (హెచ్‌ఐ) ఆమె పేరు లేకుండానే జట్టును ఎంపిక చేసింది. ఇటీవల స్పెయిన్‌లో జరిగిన టోర్నీలో చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్న ప్లేయర్లందరికీ ఇందులో అవకాశం లభించింది. ప్రాబబుల్స్ జాబితాలో నలుగురు గోల్‌కీపర్లలో ఒకరిగా ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ యతిమరపు రజని ఎంపికైంది.

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్



‘ఆసియా’ చాంపియన్ భారత్

- ఓటమి అంచుల్లోంచి గెలుపు వైపు
- ఫైనల్లో 4–3తో మలేసియాపై గెలుపు
- నాలుగోసారి చాంపియన్స్ ట్రోఫీ కైవసం

చెన్నై: ఫైనల్ వరకు ఎదురు లేకుండా అజేయంగా నిలిచిన భారత జట్టుకు తుది పోరులో మలేసియాపై గెలుపు నల్లేరుపై నడకే అనుకున్నారంతా! అంచనాలకు తగినట్లుగా తొలి గోల్‌తో ఆధిపత్యం కూడా దక్కింది. కానీ ఆపై మూడుసార్లు ఆసియా చాంపియన్‌కు అసలు పోటీ అర్థమైంది. ఆట అర్ధ భాగం (రెండు క్వార్టర్లు) ముగిసేసరికి భారత్ 1–3తో ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఇక మిగిలింది అర గంట. గెలవాలంటే మిగిలిన 30 నిమిషాల్లో 3 గోల్స్ కావాలి. సర్వశక్తులు ఒడ్డాల్సిన స్థితి. ప్రత్యర్థి జోరు మీదుంది. భారత్ ఆటగాళ్లపైనే ఒత్తిడి. ఈ దశలో మూడో క్వార్టర్ ముగిసే నిమిషం భారత్‌కు వరంగా మారింది. మ్యాచ్‌ను మన పరం చేసింది. 45వ నిమిషంలో భారత ఆటగాళ్లు చేసి రెండు గోల్స్‌తో స్కోరు 3–3తో సమమైంది. మిగిలింది ఆఖరి క్వార్టర్ ఒక గోల్ చేస్తే భారత్ టైటిల్ దక్కుతుంది. ఆకాశ్‌దీప్ సింగ్ (56వ ని.లో) అదే మ్యాజిక్ చేశాడు. ప్రత్యర్థి డిఫెండర్లను బోల్తా కొట్టించి గోల్‌పోస్ట్‌లోకి దూసుకెళ్లాడు. అనుకున్న ఫలితాన్ని అజేయమైన భారత్ సాధించింది. 9వ నిమిషంలో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను జుగ్‌రాజ్ గోల్‌గా మలిచాడు. కానీ మలేసియా శిబిరం నుంచి నిమిషాల వ్యవధిలో అబు కమల్ (14వ ని.లో), రహీమ్ రజీ (18వ ని.లో), అమినుద్దీన్ (28వ ని.లో) చెరో గోల్ చేశారు. జట్టు ఆత్మరక్షణలో పడిన ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (45వ ని.), గుర్జాంత్ (45వ ని.) గోల్ చేసి అడుగంటిన ఆశలకు జీవం పోశారు. మిగిలిన ఆఖరి గోల్‌ను ఆకాశ్‌దీప్ (56వ ని.) సాధించడంతో భారత్ జయ కేతనం ఎగరేసింది.

జపాన్‌కు కాంస్యం

సెమీస్‌లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా కనీసం కాంస్య పతకమైనా గెలుద్దామనుకుంటే జపాన్ ముందు వారి ఆటలు సాగలేదు. ఫైనల్‌కు ముందు మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో జపాన్ 5–3తో కొరియాను కంగుతినిపించింది. ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించిన జపాన్ ఆటగాళ్లే కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నారు. దీంతో కొరియా నాలుగో స్థానంతో తృప్తిపడింది. జపాన్ తరఫున ర్యోమా ఓకా (3వ ని.లో), రియోసే కటో (9వ ని.లో)కెంటరో ఫుకుదా (28వ ని.లో) షోట యమాద (53వ ని.లో), కెన్ నగయొషి (58వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. కొరియా జట్టులో జంగ్‌హ్యూన్ జంగ్ (15వ, 33వ ని.లో) రెండు గోల్స్ సాధించిపెట్టగా, చెవొలియోన్ పార్క్ (26వ ని.) ఒక గోల్ చేశాడు.

ఆంధ్ర జట్టుతోనే విహారి



హైదరాబాద్: భారత టెస్టు క్రికెటర్ గాదె హనుమ విహారి వచ్చే దేశవాళీ సీజన్‌లో మధ్య ప్రదేశ్ జట్టుకు ఆడాలనుకున్న తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాడు. తన సొంత జట్టు ఆంధ్ర తరఫునే కొనసాగేందుకు సిద్ధమయ్యాడు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సభ్యుల విజ్ఞప్తి మేరకు విహారి ఈ నిర్ణయం తీసుకున్నాడు. గత సీజన్‌లో విహారి నాయకత్వంలోనే ఆంధ్ర రంజీ ట్రోఫీ నాకౌట్ దశకు చేరగా... బ్యాటింగ్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయిన అతను 14 ఇన్నింగ్స్‌లలో 2 హాఫ్ సెంచరీలతో 490 పరుగులు మాత్రమే చేశాడు. అయితే మధ్యప్రదేశ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కుడి చేతికి తీవ్ర గాయం కాగా, జట్టును ఓటమినుంచి రక్షించేందుకు అతను ఎడమచేత్తో బ్యాటింగ్ చేయడం ఆకట్టుకుంది. భారత్ తరఫున చివరిసారిగా ఏడాది క్రితం బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో విహారి బరిలోకి దిగాడు.

బోపన్న ద్వయం ఓటమి

టొరంటో: నేషనల్ బ్యాంక్ ఓపెన్ ఏటీపీ– 1000 మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న జోడి క్వార్టర్ ఫైనల్లో పరాజయంపాలైంది. టొరంటోలో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్స్ మ్యాచ్‌లో మార్సెస్ గ్రానో లర్స్ (స్పెయిన్) – హొరాసియా జెబలోస్ (అ ర్జెంటీనా) జంట 7–5, 6–7 (6/8), 10–8 స్కోరుతో నాలుగో సీడ్ బోపన్న – మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయంపై విజయం సాధించింది. 1 గంటా 55 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో బోపన్న–ఎబ్డెన్ జంట 6 ఏస్‌లు సంధించింది.

ఆడుతూ పాడుతూ...

- నాలుగో టి20లో భారత్ ఘన విజయం
- 9 వికెట్లతో చిత్తయిన వెస్టిండీస్
- చెలరేగిన గిల్, యశస్వి
- నేడు చివరి టి20 మ్యాచ్



లాడర్‌హిల్ (ఫ్లోరిడా): భారత్, వెస్టిండీస్ నాలుగో టి20కి ముందు ఈ రీజినల్ పార్క్ మైదానంలో జరిగిన 13 టి20ల్లో 11 మ్యాచ్‌లలో ముందుగా బ్యాటింగ్ చేసి జట్టే గెలిచింది. అత్యధిక లక్ష్య ఛేదన 95 పరుగులు మాత్రమే. అయితే శనివారం పోరులో భారత జోరు ముందు ఇవేవీ లెక్కలోకి రాలేదు. ముందుగా విండీస్ భారీ స్కోరు చేసినా, భారత్ ఓపెనర్ల జోరుతోనే అలవోక విజయం సాధించి సిరీస్‌లో 2–2తో సమంగా నిలిచింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విండీస్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. షిమ్రాన్ హెట్‌మైర్ (39 బంతుల్లో 61; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), షై హోప్ (29 బంతుల్లో 45; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అనంతరం భారత్ 17 ఓవర్లలో వికెట్ నష్టానికి 179 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశస్వి జైస్వాల్ (51 బంతుల్లో 84 నాటౌట్; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (47 బంతుల్లో 77; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 94 బంతుల్లోనే 165 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. సిరీస్ విజేతను తేల్చే చివరిదైన ఐదో టి20 మ్యాచ్ నేడు ఇదే వేదికపై జరుగుతుంది.

హెట్‌మైర్ మెరుపులు...

సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన హోప్, వరుస వైఫల్యాల తర్వాత తనదైన శైలిలో చెలరేగిన హెట్‌మైర్ మినహా విండీస్ బ్యాటింగ్ పూర్తిగా తడబాటుకు గురైంది. దూకుడుగా ఇన్నింగ్స్ ప్రారంభించినా... మేయర్స్ (17), ఆ తర్వాత కింగ్ (18) ఎక్కువ సేపు నిలవలేదు. హోప్ కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లేలో జట్టు స్కోరు 55 పరుగులకు చేరింది. అయితే కుల్దీప్ తన తొలి ఓవర్లోనే పూరన్ (1), పావెల్ (1)లను అవుట్ చేసి విండీస్‌ను దెబ్బ తీయడంతో స్కోరు 57/4కు చేరింది. ఈ దశలో హోప్, హెట్‌మైర్ కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు 6 ఓవర్లలో 49 పరుగులు జోడించారు. హోప్‌ను అవుట్ చేసి చహల్ ఈ భాగస్వామ్యాన్ని విడదీయగా, హెట్‌మైర్ వరుస సిక్సర్లతో తన జోరును కొనసాగించాడు. 35 బంతుల్లో అతని అర్ధసెంచరీ పూర్తయింది. ఆఖరి 5 ఓవర్లలో విండీస్ 57 పరుగులు సాధించింది.

అలవోకగా...

ఛేదనలో భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. ఓపెనర్లు యశస్వి, గిల్ ధాటిగా ఆడుతూ దూసుకుపోయారు. తొలి బంతికి ఫోర్‌తో మొదలైన ఇన్నింగ్స్ అదే జోరులో గెలుపు దిశగా సాగింది. తొలి 6 ఓవర్లలోనే భారత్ 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 66 పరుగులు చేసింది. 10 ఓవర్లు ముగిసే సరికి స్కోరు సరిగ్గా 100కు చేరింది. ఆపై కూడా వీరిద్దరిని నియంత్రించడం విండీస్ వల్ల కాలేదు. 30 బంతుల్లో గిల్, 33 బంతుల్లో యశస్వి హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నారు. విజయానికి మరో 14 పరుగుల దూరంలో గిల్ అవుటైనా, తిలక్ వర్మ (7 నాటౌట్)తో కలిసి యశస్వి మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 17; కింగ్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 18; హోప్ (సి) అక్షర్ (బి) చహల్ 45; పూరన్ (సి) సూర్యకుమార్ (బి) కుల్దీప్ 1; పావెల్ (సి) గిల్ (బి) కుల్దీప్ 1; హెట్‌మైర్ (సి) తిలక్ (బి) అర్ష్‌దీప్ 61; షెఫర్డ్ (సి) సామ్సన్ (బి) అక్షర్ 9; హోల్డర్ (బి) ముకేశ్ 3; స్మిత్ (నాటౌట్) 15; హొసీన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1–19, 2–54, 3–55, 4–57, 5–106, 6–118, 7–123, 8–167. **బౌలింగ్:** అక్షర్ 4–0–39–1, అర్ష్‌దీప్ 4–0–38–3, చహల్ 4–0–36–1, కుల్దీప్ 4–0–26–2, పాండ్యా 1–0–14–0, ముకేశ్ 3–0–25–1.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (నాటౌట్) 84; గిల్ (సి) హోప్ (బి) షెఫర్డ్ 77; తిలక్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (17 ఓవర్లలో వికెట్‌నష్టానికి) 179. వికెట్ల పతనం: 1–165. బౌలింగ్:** మెకాయ్ 3–0–32–0, హొసీన్ 4–0–31–0, హోల్డర్ 4–0–33–0, షెఫర్డ్ 3–0–35–1, స్మిత్ 2–0–30–0, పావెల్ 1–0–13–0.

అర్జున్ విజయం హారిక ‘డ్రా’



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ కప్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ ఆటగాడు ఇరిగేశి అర్జున్ కీలక విజయాన్ని అందుకున్నాడు. ఓపెన్ విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్ తొలి రౌండ్‌లో నల్ల పావులతో ఆడి అర్జున్ గెలుపు నమోదు చేయడం విశేషం. ఈ గేమ్‌లో అర్జున్ 53 ఎత్తుల్లో స్వీడన్ గ్రాండ్‌మాస్టర్ నిల్స్ గ్రాండెలియస్‌ను ఓడించాడు. నేడు జరిగే రెండో రౌండ్‌ను అతను ‘డ్రా’గా ముగించినా సరే క్వార్టర్ ఫైనల్ చేరతాడు. మహిళల విభాగం క్వార్టర్ ఫైనల్లో ద్రోణవల్లి హారిక తొలి రౌండ్‌ను నల్లపావులతో ‘డ్రా’ చేసుకుంది. అలెగ్జాండ్రా గొర్యాకినా (రష్యా)తో జరిగిన ఈ పోరును 48 ఎత్తుల్లో హారిక ముగించింది. ఓపెన్ విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్ రౌండ్ తొలి గేమ్‌లో నల్లపావులతో ఆడి డి.గుకేశ్ కూడా విజయాన్ని అందుకున్నాడు. గుకేశ్ 38 ఎత్తుల్లో వాంగ్ హావో (చైనా)పై గెలుపొందాడు. ఇతర ప్రిక్వార్టర్ మ్యాచ్‌లలో ఫెరెన్స్ బెర్క్స్ (హంగేరీ)– ప్రజ్ఞానంద (45 ఎత్తుల్లో)...ఇయాన్ నెపోమినియాచి (రష్యా)– విదిత్ గుజరాతీ మధ్య (31 ఎత్తుల్లో) జరిగిన తొలి గేమ్‌లు ‘డ్రా’గా ముగిశాయి.

సినిమా

మల్టీస్టారర్ సినిమాలంటే ఎక్కువగా హీరోలే చేస్తుంటారు. కానీ జస్ట్ ఫర్ ఏ చేంజ్... హిందీలో ఉమెన్ మల్టీస్టారర్ ఫిలింస్ తెరకెక్కుతున్నాయి. 2018లో వచ్చిన లేడీ మల్టీస్టారర్ ఫిల్మ్ ‘వీరే ది వెడ్డింగ్’ రూ. వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఆ తర్వాత కథానాయిక ప్రాధాన్యంగా సాగే మల్టీ లేడీ స్టారర్ (ఒకే సినిమాలో ఎక్కువమంది కథానాయికలు నటించడం) చిత్రాలు పెద్దగా రాలేదు. ఇప్పుడు ఆ తరహా చిత్రాలు కొన్ని రూపొందుతున్నాయి. ఆ ‘మల్టీ లేడీ స్టారర్’ చిత్రాల గురించి తెలుసుకుందాం.

మల్టీ లేడీ స్టారర్



● కరీనా ● టబు ● కృతీ సనన్

జర ఆలస్యంగా జీ లే జరా

బాలీవుడ్ అగ్ర తారలు ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్ కలిసి రోడ్ ట్రిప్ బ్యాక్‌డ్రాప్‌లో ‘జీ లే జరా’ అనే సినిమాలో నటించనున్నారు. 2021లోనే దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ఈ సినిమాను ప్రకటించినా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈలోపు హాలీవుడ్ కమిట్‌మెంట్స్ కారణంగా ‘జీ లే జరా’ చిత్రం నుంచి ప్రియాంకా చోప్రా, కాల్షీట్స్ సర్దుబాటు చేయలేక కత్రినా కైఫ్ తప్పుకున్నారనే టాక్ వినిపించింది. ఓ దశలో ఈ సినిమా క్యాన్సిల్ అయిందనే ప్రచారం కూడా జరిగింది. అయితే ‘జీ లే జరా’ చిత్రం ఉందని, వచ్చే ఏడాది ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకుని వెళ్తామని ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన రీమా కగ్తి ఇటీవల పేర్కొన్నారు. జోయా అక్తర్ ఈ సినిమాకు మరో నిర్మాత. కాగా ఇటీవల రణ్‌వీర్ సింగ్ హీరోగా ‘డాన్ 3’ని ప్రకటించారు ఫర్హాన్ అక్తర్. సో.. ఈ సినిమా షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత జర ఆలస్యంగా ‘జీ లే జరా’ చిత్రం సెట్స్‌పైకి వెళ్తుందనే టాక్ వినిపిస్తోంది.



● ఆలియా, ప్రియాంక, కత్రినా

ఆకాశంలో...

కరీనా కపూర్, టబు, కృతీ సనన్ ఎయిర్‌లైన్ ఇండస్ట్రీలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ బ్యూటీలు ఈ డ్యూటీ చేస్తున్నది ‘ది క్రూ’ సినిమా కోసం. రాజేశ్ క్రిష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముంబై, అబుదాబి లొకేషన్స్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఎయిర్ లైన్స్ ఇండస్ట్రీలో ఉద్యోగాలు చేస్తున్న ముగ్గురు మహిళల జీవితాలు ఊహించని ఘటనల కారణంగా ఏ విధంగా ప్రభావితం అయ్యాయి? అన్నదే ఈ చిత్రకథ. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చిలో రిలీజ్ కానుంది.

రైజ్.. రెబల్.. రిపీట్

ఈ చిత్రానికి తాప్సీ ఓ నిర్మాత. ‘ధక్ ధక్’ వచ్చే ఏడాది విడుదల కానుంది.

భూమి పెడ్నేకర్, షెహనాజ్ గిల్, డాలీ సింగ్, కుషా కపిల, షిబానీ బేడీ వంటి తారలు లీడ్ రోల్స్ చేసిన చిత్రం ‘థ్యాంక్యూ ఫర్ కమింగ్’.. ‘రైజ్.. రెబల్.. రిపీట్’ అనేది ఈ సినిమాకు ఉపశీర్షిక. కరణ్ బూలానీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 30 ఏళ్లు దాటిన ఓ అమ్మాయి వివాహం చేసుకోదు. దీంతో జీవితంలో ఏదో కోల్పోయిన భావన. తన ఫ్రెండ్స్‌ను కలవాలనుకుంటుంది. స్నేహితులు ఓ పార్టీని ప్లాన్ చేస్తారు. ఈ క్రమంలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకున్నాయి? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ టాక్. అక్టోబరులో ఈ సినిమా విడుదల కానుంది. అలాగే ‘టొరంటో ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్–2023’లో ‘థ్యాంక్యూ ఫర్ కమింగ్’ చిత్రం ప్రదర్శనకు ఎంపికైందని, టీమ్ అంతా సంతోషంగా ఉన్నామని ఈ చిత్రనిర్మాతల్లో ఒకరైన రేఖా కపూర్ పేర్కొన్నారు.



● ‘ధక్ ధక్’ పోస్టర్



● ‘థ్యాంక్యూ ఫర్ కమింగ్’ పోస్టర్

అన్వేషణ

విభిన్నమైన మనస్తత్వాలు, వయసు రీత్యా వ్యత్యాసం ఉన్న నలుగురు మహిళలు బైక్‌పై రోడ్ ట్రిప్ చేసి, ఆ అనుభవాలతో తమ జీవితాలను తాము కొత్తగా ఏ విధంగా మార్చుకున్నారు? అనే కథాంశంతో రూపొందుతున్న చిత్రం ‘ధక్ ధక్’. ఫాతిమా సనా షేక్, రత్నా పాతక్, సంజన, దియా మీర్జా లీడ్ రోల్స్ చేస్తున్నారు. తరుణ్ డుడేజా దర్శకత్వం వహిస్తున్నారు.

లేడీ మల్టీస్టారర్ ట్రెండ్ వెబ్ సిరీస్‌లోనూ కనిపిస్తోంది. బాలీవుడ్ అగ్రదర్శకుల్లో ఒకరైన సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న తాజా సిరీస్ ‘హీరా మండి’. మనీషా కోయిరాల, అదితీరావ్ హైదరి, సోనాక్షీ సిన్హా, రీచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్‌లు లీడ్ రోల్స్ చేశారు. ప్రేమ, ద్రోహం, వారసత్వం, రాజకీయం వంటి అంశాలతో రూపొందిన ఈ సిరీస్ 1940 బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. హీరా మండి ప్రాంతంలోని వేశ్యల జీవితాల నేపథ్యంలో ఈ సిరీస్ తెరకెక్కింది. త్వరలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.



● ‘హీరా మండి’ పోస్టర్

ఛలోనా...



● షారుక్, నయనతార

‘ఛలోనా..’ (పద) అంటూ షారుక్ ఖాన్, నయనతార ప్రేమ పాట పాడుకోనున్నారు. షారుక్ ఖాన్ టైటిల్ రోల్‌లో నయనతార కథానాయికగా నటించిన చిత్రం ‘జవాన్’. ఇప్పటివరకూ ఈ చిత్రం నుంచి విడుదలైన షారుక్, నయనతార లుక్స్ యాక్షన్ సీన్స్‌కి సంబంధించినవి. అలాగే పాటల విషయానికి వస్తే.. షారుక్, ప్రియమణి, డ్యాన్సర్స్‌పై చిత్రీకరించిన మాస్ సాంగ్ ‘దుమ్మే దులిపేలా..’ ఇటీవల విడుదలైంది. సోమవారం షారుక్, నయనతారల రొమాంటిక్ సాంగ్‌ని, పోస్టర్‌ని విడుదల చేయనున్నారు. ‘ఛలోనా..’ అంటూ సాగే ఈ పాట షారుక్ కెరీర్‌లోని బెస్ట్ రొమాంటిక్ సాంగ్స్‌లో ఒకటి అవుతుందని యూనిట్ పేర్కొంది. అనిరుధ్ రవిచందర్ స్వరపరచిన ఈ పాటను ఆదిత్య ఆర్.కె., ప్రియా మాలి పాడారు. ‘ఛలోనా..’ని హిందీ, తెలుగు, తమిళంలో విడుదల చేయనున్నారు. అట్లీ దర్శకత్వంలో గౌరీ ఖాన్ నిర్మించిన ‘జవాన్’ సెప్టెంబర్ 7న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది.

తెలుగు ప్రేక్షకులు రియల్ సినిమా లవర్స్ - సంతానం



● సురభి, సంతానం

సంతానం, సురభి ప్రధాన తారాగణంగా ఎస్. ప్రేమ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం ‘డీడీ రిటర్న్స్’. ఈ చిత్రం ఈ ఏడాది జూలై 28న విడుదలై, తమిళంలో ఘన విజయం సాధించిందని చిత్ర యూనిట్ పేర్కొంది. నిర్మాతలు ఆర్బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్‌లు కలిసి ఈ చిత్రాన్ని ‘డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా’ పేరుతో తెలుగులో ఈ నెల 18న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో సంతానం మాట్లాడుతూ– ‘‘తెలుగు ప్రేక్షకులు రియల్ సినిమా లవర్స్. ‘డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా’ ఓ రోలర్ కోస్టర్ ఫన్ రైడ్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది’’ అన్నారు. ‘‘రాజమౌళిగారి తమిళ వెర్షన్ ‘ఈగ’ సినిమాలో సంతానంగారు ఓ కీలక పాత్ర చేశారు. ఆ సినిమాకు నేను డైలాగ్స్ రాశాను. దర్శకుడిగా ‘డీడీ రిటర్న్స్’ నా తొలి చిత్రం. ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలు ఈ సినిమాను బాగా ఎంజాయ్ చేస్తారు’’ అన్నారు ప్రేమ్ ఆనంద్. ‘‘మంచి కంటెంట్ ఉన్న డబ్బింగ్ సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారు. ఈ కోవలోనే ఈ చిత్రాన్ని ఆదరించి, విజయవంతం చేస్తారనే నమ్మకం ఉంది’’ అన్నారు ఎన్వీ ప్రసాద్.

ఎమోషనల్ థ్రిల్లర్



● జేడీ చక్రవర్తి

జేడీ చక్రవర్తి నటించి, స్వీయ దర్శకత్వం వహించిన ద్విభాషా (కన్నడ, తెలుగు) చిత్రం ‘హూ’. ఇందులో శుభరక్ష, నిత్య హీరోయిన్లు. రెడ్డమ్మ కే బాలాజీ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత ప్రసన్న కుమార్, నటుడు నాగమహేశ్‌లు కలిసి విడుదల చేశారు. నిర్మాతలు ఆచంట గోపీనాథ్, శోభారాణి, చాంబర్ వైస్ ప్రెసిడెంట్ కొల్లి రామకృష్ణ ‘హూ’ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ‘‘ఎమోషనల్ థ్రిల్లర్‌గా సాగే ఈ చిత్రంలో జేడీ చక్రవర్తి నటన వైవిధ్యంగా ఉంటుంది. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం’’ అని రెడ్డమ్మ కే బాలాజీ అన్నారు.

ఉల్టా.. పల్టా



● రూపా, సోహైల్

సయ్యద్ సోహైల్ రియాన్, రూపా కొడవాయుర్ జంటగా నటించిన చిత్రం ‘మిస్టర్ ప్రెగ్నెంట్’. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో అప్పిరెడ్డి, రవిరెడ్డి సజ్జల నిర్మించారు. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానుంది. నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా నుంచి ‘ఉల్టా పల్టా..’ పాటను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వింజనంపాటి మాట్లాడుతూ – ‘‘అమ్మతనం బాధ్యతను ఒక అబ్బాయి తీసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన నుంచి ఈ కథ రాశాను. సెన్సిటివ్ సబ్జెక్ట్ కాబట్టి జాగ్రత్తగా రూపొందించాం’’ అన్నారు. ‘‘ఈ సినిమా ఒప్పుకున్నప్పుడు నా సిస్టర్స్ ఇద్దరు ప్రెగ్నెంట్. వాళ్లను చూసి ప్రెగ్నెంట్ ఉమెన్ బాడీ లాంగ్వేజ్ నేర్చుకున్నాను’’ అన్నారు సోహైల్. ‘‘పెద్ద డిస్ట్రిబ్యూటర్స్ చూసి, మంచి సినిమా చేశారని ప్రశంసించారు’’ అన్నారు అప్పిరెడ్డి. ‘‘యూఎస్‌లో 100 స్క్రీన్స్‌లో రిలీజ్ చేస్తున్నాం’’ అన్నారు వెంకట్ అన్నపరెడ్డి. ‘‘అప్పిరెడ్డి జడ్జిమెంట్ మీద నమ్మకంతో ఈ సినిమా చేశాం’’ అన్నారు రవీందర్ రెడ్డి సజ్జల.

కొత్తవాళ్లు సక్సెస్ అవ్వాలి - శ్రీ విష్ణు



● విజయ్ రాజ్‌కుమార్, శ్రీ విష్ణు

విజయ్ రాజ్‌కుమార్, నేహా పఠాని జంటగా భరత్ మిత్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘ఏం చేస్తున్నావ్?’. నవీన్ కురవ, కిరణ్ కురవ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ విష్ణు మాట్లాడుతూ – ‘‘ఇండస్ట్రీలో కొత్తవాళ్లు విజయం సాధిస్తే నాకు సంతోషంగా ఉంటుంది. దర్శకుడు భరత్‌కు మంచి విజన్ ఉంది. ఈ సినిమా విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘18–30 వయసు మధ్య ఉన్న ప్రేక్షకులకు ఈ సినిమా బాగా కనెక్ట్ అవుతుంది’’ అన్నారు భరత్ మిత్ర. ‘‘ఈ సినిమా ఫస్ట్ హాఫ్ డీసెంట్‌గా, సెకండాఫ్‌లో ఆడియన్స్ తల తిప్పుకోలేని సీన్స్ ఉంటాయి’’ అన్నారు విజయ్ రాజ్‌కుమార్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC హిందూ మాల/B.Tech/C.Govt. డిప్యూటీ మేనేజర్/మిధాని/95000/-PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13658]

పద్మశాలి/ కట్నప్రసక్తి లేదు / M.Tech/ Govt. Asst. ఇంజనీర్/ట్రాన్స్‌కో/1Lakh. PM/ 5'11"ఎత్తు /28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13658]

రజక/కట్నప్రసక్తి లేదు/M.Tech/ Govt. ఇంజనీర్/ఇరిగేషన్ Dept/85000/-PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-13658]

SC హిందూ మాదిగ/కట్న ప్రసక్తి లేదు/ B.Tech/Govt.Asst.ఇంజనీర్/జెన్‌కో/14 Lakhs. P.A/6'ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-13658]

క్రిస్టియన్ మాల/28/5'10"/B.Tech, IIT, MBA, IIM/SWE/20 Lakhs. P.A/ అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8919759359 [HA-13659]

SC మాల & క్రిస్టియన్/కట్న ప్రసక్తి లేదు /B.Tech(EEE)/Govt.A.E.E/ట్రాన్స్‌కో/14 Lakhs. P.A/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13659]

హిందూ మాదిగ/కుల ప్రసక్తి లేదు/2వ పెళ్లి/MBBS, MD/49/ 5'7"/Govt.డాక్టర్/ 2 లక్షలు. PM వరునికి తగిన అందమైన వధువు కావలెను. Ph: 9441039962 [HA-13659]

SC మాదిగ & క్రిస్టియన్/కట్న ప్రసక్తి లేదు /B.Tech/C.Govt.బ్యాంక్ మేనేజర్/యూనియన్ బ్యాంక్/85000/PM/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13659]

SC మాదిగ /B.Tech/C.Govt. ఇన్స్‌పెక్టర్/ కస్టమ్స్ Dept/80,000/-PM/5'8" ఎత్తు /29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7032058965 [HA-13660]

SC మాల /కట్నప్రసక్తి లేదు/B.Tech/ C.Govt.కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/80,000/- PM/5'8"ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8897389698 [HA-13660]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 5' 10", Cloud Architect, 170 K, Rich, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS (USA), MBA (ISB), 29, 5' 11", 36 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 31, 6' 0", Developer, 150 K, 4.5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (IIIT), 30, 5' 8", SWE, 40 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Bengaluru, BE, MTech (IIIT), 27, 5' 3", Engineer, 30 L P/A. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", SWE, 10 L P/A, 2.5 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 3", SWE, 150 K, 2 Crores, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 26, 5' 7", Deloitte, 10 L P/A, 5 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



వధువు కావలెను

రెడ్డి BE, MS, 30, 5' 11", SWE, 150 K, Rich, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", 22 L P/A, 100 Crores, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", Engineer, 300 K, 20 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 10", PG Doctor, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 28, 5' 5", Analyst, 95 K, 25 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 5", SWE, 85 K, 6 Crores, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, Residency Doctor, 27, 5' 4", USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 7", 50 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/B.Tech/C. Govt.ఎంప్లాయి/సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/5'9"ఎత్తు/34 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9963757612 [HA-13660]

రెడ్డి/ డైవర్సీ/2nd మ్యారేజ్/ 36/5'.4"/ ECE MS(USA) కోట్ల ప్రాపర్టీ గల పిల్లలులేని వరుడికి తగిన వధువు కావలెను. 9640667754 [189380]

59/5'.5", 15 లక్షలు ఆస్తి ఉన్న వరునికి ఉద్యోగం చేస్తున్న వధువు కావలెను. కులపట్టింపు లేదు డైరెక్ట్ నో బ్రోకర్ సెల్ నెంబర్. 9392103524 [189380]

రెడ్డి/55y/ డైవర్సీ/CNB/ AP స్టేట్ Govt. లో గ్రూప్-1 ఆఫీసర్‌గా ఉంటూ, సెలవులో UK Govt.లో ఆఫీసర్‌గా జాబ్ చేస్తూ UK PR కలిగిన వరునికి ఇండియా / అబ్రాడ్‌లో సెటిల్ అయ్యేందుకు అందమైన Rich వధువు కావలెను. Ph:6303487992, నో బ్రోకర్స్. [HA-13954]

వెలమ/40/5'6"/ MCA/బిజినెస్ / మొదటి వివాహ వరుడికి వయస్సుతో నిమిత్తం లేకుండా 1/2 వ వివాహ వధువు కావలెను. నేరుగా సంప్రదించగలరు: 9848048679 [HA-13663]


రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రాపర్టీ Rs. 3.L / PM గల వరుడుకి వధువు కావలెను. Cont: 94932 42896 [G-787556]

★

రెడ్డి: లేట్ మ్యారేజ్ /34y/ నెలకు లక్ష రూపాయల ఆదాయం Hydలో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓర్టీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/ విడో OK కుల, కట్న ప్రసక్తి లేదు డైరెక్ట్. Ph: 7989079290 [H-189373]

అమ్మాయి కావలెను. 1వ, అన్ని కులాల కోమట్ల అబ్బాయి 35 ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 22 వేలు, M.Sc, M.Ed నల్ల గొండ. ఆస్తి 80 లక్షలు 9121325068 [Y-772542]

వరుడు కావలెను



కుల పట్టింపు లేదు: 39yrs/2వ పెళ్లి/ Govt.ఎంప్లాయ్ 2,70,000/- (PM) బాగా స్థిరపడి కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్రదించండి: Ph:7386558413 [H-788656]

కాపు: 30yrs/ కులపట్టింపు లేదు/ ఫెయిర్/ Govt ఎంప్లాయ్ 50K (PM). వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 4 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం 1st & 2nd లేట్‌మ్యారేజ్ OK) సంప్ర: 9492081565 [H-788656]

విశ్వబ్రాహ్మణ/B.Tech/Govt.Jr.Asst. /ఎలక్ట్రికల్ Dept/40,000/-PM/5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-13658]

రెడ్డి: 45yrs/ కులపట్టింపులేదు/ 2nd మ్యారేజ్/ ఫెయిర్/ Govt ఎంప్లాయ్ 1 లక్ష (PM). వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 8374802603 [H-788656]

2వ పెళ్ళి: 40yrs/ Govt. ఎంప్లాయ్ 3,00,000/- (PM) కుల పట్టింపు లేదు/ బాగా స్థిరపడిన & కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం Ok) సం.ప్ర: 9502046384 [H-788656]

రెడ్డి: 53Y/ రెండవ పెళ్ళి/ విడో Govt job/ పిల్లలు లేరు/ సొంత ఇల్లులు/ రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) Ph: 7799083500, 7386660643 [H-788656]

SC మాల/B.Tech/C.Govt.బ్యాంక్ P.O/SBI/50,000/-PM /5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13659]

క్రిస్టియన్ మాల/25/5'4"/B.Tech/ Govt.A.E / ఎలక్ట్రికల్ Dept/60,000/- PM అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13659]

క్రిస్టియన్/2వ పెళ్లి/కులప్రసక్తి లేదు/B.Tech/ Govt.Jr.Asst./రెవెన్యూDept/40,000/-PM/5'4" ఎత్తు/36 సం॥ల పిల్లలు లేని ఆస్తి గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-13659]

యాదవ/ఏకైక కుమార్తె/B.Tech (సివిల్)/ C.Govt.బ్యాంక్ P.O/కెనరా బ్యాంక్/45000/- PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-13659]

రెడ్డి/29/5'5"/MBBS, MD/ డాక్టర్/ గైనిక్ /Fair/చాలా అందమైన వధువుకు MD/ PGడాక్టర్/హైప్రొఫైల్ 5'8" Above వరుడు కావలెను. Ph: 9391053297 [HA-13659]

వాల్మీకి బోయ/B.Tech/C.Govt. Asst. ఇంజనీర్/ఇరిగేషన్ Dept/60,000/-PM/ 5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618579861 [HA-13660]

బ్రాహ్మణ: 25/5'4"/B.Tech '28/5'3"/B.Sc '30/ 5'4"/ MBA '27/5'3" ఇంటర్. వధువులకు వరులు కావలెను. కట్నాలు ఆశించని/ మధ్యతరగతి/ పురోహితులకు ప్రత్యేకం. వాట్సప్: 7207634758 [H-13659]

కాపు: డైవర్సీ/ 28y 5'4"/V.Fair/ B.Tech/ SWE/16 Lakhs P/A గల పిల్లలు లేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9553652167 [H-189380]

CNB: 26/5'5"/Fair/ M.Tech/ SWE/ 20 Lakhs P/A కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-189380]

2వపెళ్ళి: కులప్రసక్తి లేదు/ 42yrs/MA, English P.hd/Govt లెక్చరర్ 2 లక్షలు (PM) పిల్లలు లేని తెల్లని అందమైన 30 కోట్ల ఆస్తి గల వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్న OK ఇల్లరికం OK) సంప్ర॥ 7396213324 [H-189380]

కాపు: 34 Govt/Emp/40,000/-Partial Blind తల్లిదండ్రులు లేరు. Converted Christian, No Caste bar Christian వరుడు కావలెను. సంప్ర॥ 9059035448, 8919750035 [H-189403]

SC మాల హిందూ/B.Tech/25y/ 5'4"/ సాఫ్ట్‌వేర్ ఇన్ఫోసిస్(Hyd)/60K Per month/చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-780746]

కుల పట్టింపు లేదు/విడో/45Dept.Medical Health(DCHS)Doctor/Own Hospital/3 L PM/ సొంత Villa/25Acr ల్యాండ్/కోట్ల Property వెల్ సెటిల్ వధువుకు వరుడు కావలెను. Ph: 9550450046 [H-780746]

రెండో పెళ్లి/విడో/50y/Fair/వరంగల్, Govt Job/Own House (Rents) వెల్ సెటిల్ ఏ బాదరబందీ లేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. Ph: 8519803423 [H-780746]

వైశ్య/58y/విడో/5'4"/Govt Job/ 60,000, 2 సొంత ఇళ్లు, కారం బిజినెస్/ 1,00,000 Rs/ కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. పిల్లలు లేరు. Ph: 8885428274 [H-780746]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ A:30, Qly: డిగ్రీ బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 8143011223. [HA-13663]

మాల/25/5'4" / B.Tech / IIT, PSU Grade-II Officer 20 Lakhs P/A వధువుకి తగిన వరుడు కావలెను. No brokers. 9493285326 [HA-13663]

★

రజక / 43Yrs, Study PG, Private Job, 1 పాప, సొంత ఇల్లు గల వధువుకు (ఇల్లరికం) వరుడు కావలెను. సంప్ర॥ సెల్ : 7416946953 [Y-798251]

వేదికలు



శ్రీ... శ్రీ...శ్రీ.. రెడ్డి, కమ్మ, కాపు, వైశ్య, గౌడ, విశ్వబ్రాహ్మణ, మాల, మాదిగ 1వ, 2వ హై, రిచ్ & మధ్య తరగతి డాక్టర్, ఇంజనీర్, Govt. మ్యాచెస్ త్వరగా సెటిల్‌మెంట్ కొరకు సంప్ర : 9247217621 [HA-13660]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-788938]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-780945]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/PG/NRI /PVT/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS/15 సం॥ Exp. Ph: 9989140444 [HA-30213]

కావ్య మ్యారేజ్ లింక్స్ : 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును (స్త్రీలకు ఫ్రీ) Ph: 8074670989 [H-780746]

వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-13663]

కుల పట్టింపు లేదు. అన్ని కులాలవారికి 20-70 సం॥ల వరకు/1st, 2nd, విడోస్ లేట్ మ్యారేజెస్ చూడబడును. స్త్రీలకు ఉచితం, జెంట్స్‌కి సర్వీస్ ఛార్జ్ ఓన్లీ. సంప్ర: 9581120134 [HA-13663]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

"పెళ్ళి" ఫాస్ట్ సెటిల్‌మెంట్ మా ప్రత్యేకత. Software, Doctors, Abroad, Rich, Group 1,2 వారికి పెళ్ళి సంబంధాలు చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1481]

15రో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com, Cont ✆ 94418 29644, 98490 58673, 94407 85888 W [B-945]

మీ జీవితాంతం తోడుంటారనుకున్న మీ జీవిత భాగస్వామి దూరమయ్యారని చింతించకండి. మళ్లీ మీ జీవితంలో వెలుగులు నింపడానికై అన్ని కులాల 1వ, 2వ వివాహ సంబంధాలకై సంప్ర॥ 8341220970 [K-1185578]

★

విశ్వబ్రాహ్మణ: వధూ-వరుల స్వయంవరం (Online) 13/ August, 23, Free Registration. Bhavani Matrimony, Hyd. Ph: 9704656103/ 9533608887 [H-424]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. Ph: 9704656103, 9533608887 (Whatsapp) [H-370]

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
AP+TS+Metros: 1800/- for 4 Lines (Chennia + Bengaluru + Delhi + Mumbai) 485/- Extra Line
Andhra Pradesh: 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line
Telangana (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line
* Color 25% Extra
గమనిక: ప్రకటనలపై 5% GST అదనం
హైదరాబాద్ : 99122 25453
వరంగల్ : 99516 02872
మెదక్ : 99122 25456
నల్గొండ : 95055 08382
నిజామాబాద్ : 99122 20764
మహబూబ్‌నగర్ : 99516 02829
కరీంనగర్ : 97059 33396
ఖమ్మం : 99516 02868
సాక్షి టవర్స్, రోడ్ నం.1, బంజారాహిల్స్, Hyd ✆ 040-23256000 Ext: 6235/6230
Cell : 9912225453, umail2sakshi.ads@sakshi.com

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి 'సత్యసాయి' సాఫల్య పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న నాగేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం దక్కింది. ఆరోగ్య సంరక్షణలో సరికొత్త ఆవిష్కరణలు తీసుకు రావడం, గ్రామీణ పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నందుకు కర్ణాటకలోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. ముద్దనహళ్లిలోని సత్యసాయి యూనివర్సిటీలో జరిగిన ఇండియా స్టార్టప్ ఫెస్టివల్ కార్యక్రమంలో సద్గురు మధుసూదన్ సాయి నుంచి నాగేశ్వర్‌రెడ్డి ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డికి లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డికి క్యాపిటల్ ఫౌండేషన్ లైఫ్‌టైం అచీవ్ మెంట్ అవార్డును ప్రకటించింది. ఆదివారం ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్‌కే పట్నాయక్ ఈ అవార్డును అందజేస్తారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందజేయ నున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అడవులు, చిన్ననీటి వనరులు, కాలుష్య తీవ్రత తదితర అంశాలపై పురుషోత్తంరెడ్డి పనిచేశారు.

రిలయన్స్ డిజిటల్‌లో మళ్లీ 'ది డిజిటల్ ఇండియా సేల్' ఆఫర్

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ గాడ్జెట్ వినియోగదారులకు రిలయన్స్‌డిజిటల్ ''ది డిజిటల్ ఇండియా సేల్''ఆఫర్‌ను మళ్లీ ప్రకటించింది. ఈ నెల 15 వరకు ఈ ఆఫర్ వినియోగదారులకు అందుబాటులో ఉండనుంది. ఈ ఆఫర్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ పరికరాలపై తగ్గింపు ధరలకే అందజేస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలుపై 10% తగ్గింపుతో సుమారు రూ.5,000 వరకు తగ్గింపు లభిస్తుందని, అదేవిధంగా ప్రతి డెబిట్, క్రెడిట్ కార్డులపై కూడా రూ.3,000 వరకు తక్షణ తగ్గింపును పొందవచ్చని తెలిపింది. మరింత సమాచారం కోసం రిలయన్స్ డిజిటల్ స్టోర్‌ను సందర్శించవచ్చని లేదా www.reliancedigital.inలో లాగిన్ అయి కొనుగోలు ఎంపికలు చేసుకోవచ్చని పేర్కొంది.

"సీపీఎస్ రద్దు- ఓపీఎస్ అమలు" | ఇదే మా నినాదం.. పోరాటం

- నాంపల్లిలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ బహిరంగ సభ
- ఎన్నికలకు ముందే సీపీఎస్ రద్దు చేయాలి.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్
- సీపీఎస్ రద్దు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వం... నిధులు ఇవ్వాల్సింది కేంద్రం: స్థితప్రజ్ఞ



సీపీఎస్ రద్దు కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభకు హాజరైన ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: 'కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేయాలి... పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించాలి. ఎన్నికలకు ముందే ఈ ప్రక్రియ జరగాలి. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేసిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలి'అంటూ తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) గొంతెత్తింది. 2004 తర్వాత రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 54 సంఘాల ఉద్యోగులు మద్దతు తెలుపుతూ పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘ నేతలు సైతం ఈ సభకు హాజరై సీపీఎస్ రద్దుకు గొంతు కలిపారు.

2 లక్షల కుటుంబాల చిరకాల వాంఛ ఇది

ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడారు. 'ఐదేళ్ల క్రితం సీపీఎస్ రద్దు చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమా? రాష్ట్ర ప్రభుత్వమా? అని అడిగిన సందర్భాలు న్నాయి. ఆ ప్రశ్నలకు ఇప్పుడు సరైన సమాధానం దొరికింది. సీపీఎస్ పథకాన్ని రద్దు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే. అదేవిధంగా ఈ పథకం కింద జమ అయిన నిధులను వెనక్కు ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వం. రాష్ట్రంలోని దాదాపు 2 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల చిరకాల వాంఛ సీపీఎస్ రద్దు- ఓపీఎస్ అమలు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికల హామీ మాదిరి కాకుండా ఎన్నికలకు ముందే సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి. వెనువెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడే వారే. ప్రభుత్వం ఆదేశాలను తూచ తప్పకుండా అనుసరించి అమలు చేసే వారు కావడంతో ప్రభుత్వం ఏమాత్రం సంకోచించకుండా సీపీఎస్‌ను రద్దు చేయాలి'అని కోరారు. సీపీఎస్ ఉద్యోగుల ప్రధాన సమస్యలు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు దృష్టికి పోవడం లేదని, ఆయనకు సుదీర్ఘంగా వివరిస్తే తప్పకుండా పరిష్కారం లభిస్తుందన్నారు. అందుకోసమే రాష్ట్ర రాజధానిలో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వివరించారు.

జిల్లాలను చుట్టి.. రాజధానికి చేరి..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సీపీఎస్ రద్దుపై విస్తృత అవగాహన కల్పించేందుకు టీఎస్‌సీపీఎస్‌ఈయూ జూలై 16 నుంచి 31వ తేదీ వరకు పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రను తలపెట్టింది. రాష్ట్రంలోని 33 జిల్లాల మీదుగా సాగిన ఈ యాత్ర ద్వారా ఉద్యోగులు, ఉపాధ్యాయులను చైతన్య పరిచి పాత పెన్షన్ ఆవశ్యకత, సీపీఎస్ రద్దుపై విపులంగా వివరించి అభిప్రాయ సేకరణ జరిపింది. పక్షం రోజుల పాటు సాగిన ఈ యాత్రలో వివిధ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని మద్దతు పలికారు. ఈ క్రమంలో ఈనెల 12న హైదరాబాద్‌లో సీపీఎస్ ఉద్యోగులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు స్థితప్రజ్ఞ ఇదివరకే ప్రకటించారు. ఇందులో భాగంగా శనివారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తలపెట్టిన భారీ బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు.

పోటెత్తిన వివిధ రాష్ట్రాల నేతలు

కార్యక్రమంలో నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్స్ స్కీం జాతీయ అధ్యక్షులు విజయకుమార్ బంధు, పంజాబ్ సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుఖజిత్ సింగ్, కర్ణాటక సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శాంతారామ్, ప్రధాన కార్యదర్శి రంగనాథ్, ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ నాయకుడు పల్లెల రామాంజనేయులు, మహారాష్ట్ర నుంచి వితేష్ ఖండేల్కర్, ఝార్ఖండ్ నుంచి విక్రమ్ సింగ్, ఛత్తీస్‌గఢ్ నుంచి రాకేష్ సింగ్, తమిళనాడు నుంచి ఆరోగ్యదాస్, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్, తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బయ్య, సురేష్, టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, కటకం రమేశ్, ఎస్‌జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ నాయక్, వెటర్నరీ ఫోరం అధ్యక్షుడు అభిషేక్ రెడ్డి, బ్లైండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

ఇరువురు సీఎంలతో చర్చ

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, తెలంగాణ సీఎం కేసీఆర్‌కు స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయి. తప్పకుండా ఇరువురు సీఎంలతో పాత పెన్షన్ పునరుద్ధరణపై చర్చిస్తాం. అదేవిధంగా జార్ఖండ్‌లో అమలు చేస్తున్న పాత పెన్షన్ స్టాండింగ్ ఆపరేటింగ్ గైడ్‌లైన్స్ వివరిస్తాం.

–విక్రమ్ సింగ్, జార్ఖండ్ సీపీఎస్ యూనియన్ అధ్యక్షుడు

మేమూ ఎదురుచూస్తున్నాం

తెలంగాణలో సీపీఎస్ రద్దుకోసం మహారాష్ట్రలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. పాత పెన్షన్ కోసం పార్టీ పరమైన నిర్ణయాన్ని తీసుకుంటే మరింత స్పష్టత వస్తుంది.

–వితేష్ ఖండేల్కర్, మహారాష్ట్ర సీపీఎస్ యూనియన్ అధ్యక్షుడు

కేసీఆర్ దేశానికే నేతా అయ్యేందుకు ఇదే చాన్స్

తెలంగాణలోని రెండు లక్షల ఉద్యోగుల సీపీఎస్‌ను రద్దు చేస్తే దేశంలోని మిగతా రాష్ట్రాలు కూడా అనుకరిస్తాయి. తెలంగాణ సీఎం కేసీఆర్ దేశానికి నేతా అయ్యేందుకు ఇదే మంచి అవకాశం.

– విజయ్‌కుమార్ బంధు, సీపీఎస్ జాతీయ అధ్యక్షుడు

ఐదుగురు రాష్ట్ర పోలీసులకు జాతీయ పురస్కారాలు

- నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభకు పట్టం
- ఏపీ నుంచి ఐదుగురికి...
- కేంద్ర హోంమంత్రి పతకానికి దేశవ్యాప్తంగా 140 మంది ఎంపిక


సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: అత్యుత్తమ నేర పరిశోధన చేసిన 140 మంది పోలీసు అధికారులను 2023 సంవత్సరానికి కేంద్ర హోంమంత్రి పతకానికి ఎంపిక చేశారు. నేర పరిశోధనలో ఉన్నత ప్రమాణాలను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర హోంశాఖ ఈ పతకాలను 2018 నుంచి అందిస్తోంది. ఈ ఏడాది తెలంగాణ నుంచి ఐదుగురు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు పోలీసు అధికారులు ఈ పతకాలకు ఎంపికయ్యారు. ఇందులో తెలంగాణ నుంచి ఎస్‌ఐబీ అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, బోధన్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్, ఇంటెలిజెన్స్ డీఎస్పీ రాజుల సత్యనారాయణరాజు, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ యం.జితేందర్‌రెడ్డి, ఏసీపీ భూపతి శ్రీనివాసరావు పురస్కారాలు పొందారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సీఐ అశోక్ కుమార్ గుంట్రెడ్డి, సీఐ మన్సూరుద్దీన్ షేక్, డీఎస్పీ ధనుంజయుడు మల్లెల, ఏఎస్పీ సుప్రజ కోర్లకుంట, డీఎస్పీ రవిచంద్ర ఉప్పుటూరి అవార్డులు పొందారు.

ఎనిమిది మందికి జీవితఖైదు - అడిషనల్ ఎస్పీ తిరుపతన్న




ప్రస్తుతం ఎస్‌ఐబీ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న మేకల తిరుపతన్న.. 2016లో సంగారెడ్డి డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ఓ గిరిజనుడి హత్యకేసు దర్యాప్తులో కీలకంగా పనిచేశారు. పక్కా సాక్ష్యాధారాలతో చార్జిషీట్ నమోదు చేయడంతో ఈ కేసులో మొత్తం 8 మంది నిందితులు దోషులుగా తేలారు. వారికి గత ఫిబ్రవరిలో జీవిత ఖైదు విధించారు.

హత్యాచారం కేసులో దర్యాప్తునకు.. - ఏసీపీ మూల జితేందర్ రెడ్డి




వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రస్తుతం ఎస్‌బీ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న యం.జితేందర్‌రెడ్డి హనుమకొండ ఏసీపీగా పనిచేసే సమయంలో ఓ కేసు దర్యాప్తునకు అవార్డు దక్కింది. 2020 జనవరిలో హనుమకొండ రాంనగర్‌లో ఓ యువతిపై అత్యాచారం, అనంతరం హత్య చేసిన కేసులో దర్యాప్తు చేసి సాక్ష్యాలు కోర్టుకు సమర్పించారు. నిందితుడుకి యావజ్జీవ శిక్ష పడింది.

ఆరేళ్ల పాపపై హత్యాచార కేసులో దర్యాప్తునకు... - డీఎస్పీ కె.ఎం.కిరణ్‌కుమార్, ఏసీపీ బోధన్



ప్రస్తుతం బోధన్ ఏసీపీగా పని చేస్తున్న కమ్మాయిపల్లె మల్లికార్జున కిరణ్‌కుమార్ భూపాలపల్లి డీఎస్పీగా పని చేస్తున్నప్పుడు 2017 నవంబర్‌లో రేగొండ మండలంలోని గోరికొత్తపల్లి గ్రామంలో ఆరేళ్ల దళిత పాపపై అత్యాచారం చేసి గొంతునులిమి హత్య చేసిన కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు కటకం శివను 3 రోజుల్లోనే గుర్తించి 6 నెలల్లో చార్జిషీట్ దాఖలు చేశారు. కటకం శివకు యావజ్జీవ శిక్ష పడింది.

అనాథ బాలిక కేసులో... - డీఎస్పీ సత్యనారాయణరాజు



అమీన్‌పూర్‌లో అనాథ బాలికపై నెలలపాటు లైంగిక దాడి చేయడం, ఆమె మృతికి కారణమైన కేసు దర్యాప్తును నారాయణఖేడ్ డీఎస్పీగా పని చేస్తున్న రాజుల సత్యనారాయణరాజుకు అప్పగించారు. ఈ కేసు దర్యాప్తులో సాంకేతిక ఆధారాలను పక్కాగా సేకరించడంతో ఈ కేసులో ముగ్గురు నిందితులకు యావజ్జీవ శిక్ష పడింది.

దేశం గర్వించే స్థాయిలో రాష్ట్రం

బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దేశం గర్వించే స్థాయిలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ కుమార్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడారు. ఆసరా పెన్షన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులకు గురుకులాల పాఠశాలల ఏర్పాటు, రైతుబంధు, రైతుబీమా, దళిత బంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ తదితర పథకాల ద్వారా సాధించిన ప్రగతిని వినోద్ వివరించారు. కాగా, ప్రతినిధుల సమావేశంలో న్యాయవాదులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని, న్యాయవాదుల సంక్షేమం కోసం గతంలో ప్రకటించిన రూ.100 కోట్ల నిధికి అదనంగా రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు.

ఎవరు పొట్టి.. పొడుగు?



ఇంట్లో, బయటా, ఆఫీసులో, మరో చోట.. ఎక్కడైనా ఎవరో ఒకరిని కలుస్తూ ఉంటాం. కొందరు మన కన్నా పొడుగ్గా ఉంటే.. మరికొందరు పొట్టిగా ఉంటుంటారు. ఇది సాధారణమే. కానీ కొన్ని ప్రాంతాల్లో వారు బాగా పొట్టిగా, మరి కొన్ని ప్రాంతాల్లో వారు బాగా పొడుగ్గా ఉంటుంటారు. వారిలో తరాలుగా వస్తున్న జన్యువులకు తోడు స్థానిక వాతావరణం, ఉష్ణోగ్రతలు, జీవన విధానం, పని పరిస్థితులు, వైద్యారోగ్య సౌకర్యాలు, పోషకాహారం వంటివి మనుషుల ఎత్తులో తేడాలకు కారణమవుతుంటాయి. ఈ నేపథ్యంలోనే ఇన్‌సైడర్ సంస్థ ప్రపంచంలో ఎత్తు తక్కువ జనాభా ఉన్న 25 దేశాలతో నివేదికను రూపొందించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆయా దేశాల ఆరోగ్యశాఖలు, వివిధ సర్వేలు, అధ్యయనాలను పరిశీలించి.. దీనిని సిద్ధం చేసింది. ఆయా దేశాల్లో బాగా పొడవుగా ఉన్న వారు కూడా ఉండొచ్చని, తాము సగటు ఎత్తును ప్రామాణికంగా తీసుకున్నామని తెలిపింది.

- ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను పరిశీలిస్తే.. దక్షిణాసియా, మధ్య ఆఫ్రికా దేశాల్లో జనంఎత్తు తక్కువగా ఉన్నారని నివేదిక పేర్కొంది.
- దాదాపు అన్ని దేశాల్లో కూడా మహిళల కంటే పురుషుల ఎత్తు ఎక్కువని తెలిపింది.
- ప్రపంచంలో అత్యధికంగా నెదర్లాండ్స్ దేశస్తుల సగటు ఎత్తు 175.62 సెంటీమీటర్లు కాగా.. అమెరికాలో 172.21, చైనాలో 161.45 సెంటీమీటర్లుగా ఉంది.

పొట్టి జనాభా ఉన్న టాప్ 25 దేశాలివీ..

దేశం	సగటు ఎత్తు (సెంటీమీటర్లలో)		
టిమోర్	155.47	రువాండా	158.73
లావోస్	155.89	ఇండియా	158.76
మడగాస్కర్	156.36	వియత్నాం	159.01
గ్వాటెమాలా	156.39	పెరూ	159.08
ఫిలిప్పీన్స్	156.41	పపువా న్యూగినియా	159.21
నేపాల్	156.58	సోలోమన్ ఐలాండ్స్	159.27
యెమెన్	156.92	మొజాంబిక్	159.37
మార్షల్ ఐలాండ్స్	157.05	భూటాన్	159.46
బంగ్లాదేశ్	157.29	బ్రూనై	159.49
కాంబోడియా	158.11	మయన్మార్	159.52
ఇండోనేషియా	158.17	లైబీరియా	159.66
మలావి	158.31	హోండూరస్	160.11
		శ్రీలంక	160.12

భల్లూకాన్ని చూసి.. బెంబేలెత్తిపోయారు..

- కరీంనగర్ రేకుర్తిలో 14 గంటల పాటు సంచారం
- బంధించిన ఫారెస్ట్ రెస్క్యూ టీం



కొత్తపల్లి (కరీంనగర్): కరీంనగర్ శివారు రేకుర్తి, సీతారాంపూర్, సూర్యనగర్ ప్రాంతాల్లో భల్లూకం హడలెత్తించింది. సుమారు 14 గంటల పాటు స్థానికులను బెంబేలెత్తించిన గుడ్డెలుగు.. ఎట్టకేలకు వరంగల్ నుంచి వచ్చిన రెస్క్యూ టీంకు పట్టుబడింది. సుమారు రెండు గంటల పాటు రెస్క్యూ టీంను ముప్పుతిప్పలు పెట్టింది. శనివారం వేకువజామున 4.30 గంటల ప్రాంతంలో కుక్కతో బయటకు వెళ్లిన సూర్యనగర్ వాసికి ఎలుగు కనిపించింది. కుక్క మొరగడంతో వెనక్కి తగ్గిన ఎలుగుబంటి.. అక్కడి నుంచి రేకుర్తి వైపు వెళ్లింది. ఎస్సారెస్పీ కెనాల్ మార్గం గుండా ప్రధాన రహదారిపై సంచరిస్తుండటం గమనించిన స్థానికులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం వరంగల్ నుంచి వచ్చిన ఫారెస్ట్ రెస్క్యూ టీం రేకుర్తి సబ్‌స్టేషన్ ప్రాంతంలోని సమ్మక్క గుట్ట పొదల్లో దాగిన ఎలుగుబంటిని పట్టుకునేందుకు వలలు ఏర్పాటు చేసింది. ఎలుగుబంటికి మత్తు ఇంజక్షన్ ఇచ్చే క్రమంలో టీం సభ్యుడిపైకి దూసుకొచ్చింది. ఎట్టకేలకు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వలకు చిక్కిన ఎలుగుబంటిని చికిత్స నిమిత్తం వెటర్నరీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, మరో రెండు ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

8 కిలోల బంగారం దుస్తుల్లో దాచేశారు..

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత
- నలుగురు ప్రయాణికుల నుంచి స్వాధీనం



శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో అక్రమంగా రవాణా చేస్తున్న 8 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారు జామున బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా ఓ ప్రయాణికుడు ప్యాంటులో దాచి తీసుకొచ్చిన 2 కేజీల బంగారం బిస్కెట్ ముక్కలు బయటపడ్డాయి. వీటి విలువ రూ.1.21 కోట్లు ఉంటుందని నిర్ధారించారు. అదే విమానంలో వచ్చిన మరో ప్రయాణికుడు కూడా లోదుస్తుల్లో దాచుకుని తీసుకొచ్చిన 1.75 కేజీల బంగారం బయటపడింది. దీని విలువ 1.8 కోట్లుగా నిర్ధారించారు. షార్జా నుంచి వచ్చిన మరో ప్రయాణికుడి వద్ద లో దుస్తుల్లో దాచుకుని తీసుకొచ్చిన 2.17 కేజీల బంగారం పేస్టును బయటికి తీశారు. దీని విలువ 1.31 కోట్లుగా నిర్ధారించారు. దుబాయ్ నుంచి వచ్చిన మరో వ్యక్తి ధరించిన లో దుస్తుల్లో 2.05 కేజీల బంగారం బయటపడింది. దీని 1.24 కోట్లుగా నిర్ధారించారు. ఆ నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం పట్టుబడిన 8 కేజీల బంగారం విలువ రూ.4.86 కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ ఏడాదిలో ఒకే రోజులో అత్యధికంగా పట్టుబడిన బంగారం ఇదేనని కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

రోబోటిక్స్‌పై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్‌రంజన్



బ్రోచర్‌ను ఆవిష్కరించిన జయేష్‌రంజన్, డాక్టర్ సంగీతారెడ్డి తదితరులు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం నూతన సాంకేతికత, రోబోటిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్‌రంజన్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని షెరటాన్ హోటల్‌లో శనివారం రోబోటిక్ గైనకలాజికల్ సర్జరీపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన అపోలో ఆస్పత్రుల గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అన్ని రంగాల్లో అత్యాధునిక సాంకేతికత, పరిజ్ఞాన్ని వినియోగిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రోబోటిక్స్ పాలసీని ప్రారంభించామన్నారు. దేశంలోనే నిర్దిష్ట రోబోటిక్ పాలసీని కలిగి ఉన్న మొదటి రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఈ పాలసీలో భాగంగా హెల్త్‌కేర్, అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, కన్సూమర్ రోబోటిక్స్ అనే నాలుగు వర్టికల్స్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించామన్నారు. రోబోలను తయారు చేసే కొన్ని ప్రీమియర్ కంపెనీలతో ముందస్తుగా చర్చలు జరుపుతున్నామన్నారు. నిమ్స్‌లో డావిన్సీ ఎక్స్‌ఐ 4వ వెర్షన్ సిస్టమ్‌ను పూర్తి స్థాయిలో అమర్చిన రోబోటిక్ సర్జరీ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ అపోలో ఆస్పత్రులలో ఇప్పటి వరకు 12 వేల రోబోటిక్ సర్జరీలు చేశామన్నారు. అందులో డాక్టర్ రుమా సిన్హా స్వయంగా 700 రోబోటిక్ సర్జరీలు చేశారన్నారు. అనంతరం సమావేశం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఆర్ఎస్ అధ్యక్షురాలు ప్రొఫెసర్ రమా జోషి, ఆర్నాల్డ్ పి.అడ్విన్కులా, డాక్టర్ టోనిచల్ హౌబ్, డాక్టర్ జోసెఫ్ పాల్గొన్నారు.

మొన్న రిజల్ట్.. నిన్న వెరిఫికేషన్.. నేడు జాబితా..!



సాక్షి, హైదరాబాద్

కేజీబీవీ నియామకాల్లో సమగ్ర శిక్షా అధికారుల లీలలు

- ఫలితాలు చూసుకునే సమయం లేక.. అభ్యర్థుల ఆందోళన
- డీఈఓ కార్యాలయం నుంచి అభ్యర్థులకు రాత్రి ఫోన్లు
- సెలవు రోజుల్లోనే తంతు పూర్తి

రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్ల (యూఆర్ఎస్)లో కాంట్రాక్టు పోస్టుల భర్తీలో సమగ్ర శిక్షా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గురువారం సాయంత్రం పరీక్ష ఫలితాలు విడుదల చేసి, శుక్రవారం ఉదయం 10 గంటలకే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాలని ఆదేశాలు జారీచేశారు. గుట్టుచప్పుడు కాకుండా వచ్చిన వాళ్లతో ఆ ప్రక్రియను మమా అనిపించి, శనివారం ఫైనల్ లిస్టు ఇచ్చి, సెలెక్టయినవారు రేపు జాయినింగ్ కావాలని ఆదేశాలిచ్చారు. రెండ్రోజుల్లోనే తంతు ముగించడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో కేజీబీవీ, యూఆర్ఎస్‌ల్లో ఖాళీగా ఉన్న 1,241 సీఆర్టీ, పీజీసీఆర్టీ, స్పెషల్ ఆఫీసర్ తదితర పోస్టులకు గతనెల 24, 25, 26 తేదీల్లో సమగ్ర శిక్ష అధికారులు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఈ పోస్టులకు మొత్తం 43,056 మంది దరఖాస్తు చేసుకోగా, 34,797 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ సమయంలో భారీ వర్షాలు వచ్చినా.. ప్రభుత్వం అధికారికంగా సెలవులు ప్రకటించినా ఎగ్జామ్స్ మాత్రం యథాతథంగా నిర్వహించారు. ఈ సమయంలో చాలామంది అభ్యర్థులు అనేక ఇబ్బందులతో పరీక్షలకు హాజరుకాగా, కొందరు వర్షాలతో అటెండ్ కాలేదు.

మూడ్రోజుల్లో మమ...

డీఈఓలకు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో సమావేశం ఉంటడంతో, చాలామంది గురువారం మధ్యాహ్నమే హైదరాబాద్‌కు బయల్దేరారు. తర్వాతి రెండ్రోజులూ రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు. ఈ క్రమంలో ఇంత హడావుడి చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 10వ తేదీ రాత్రి ఫలితాలు ఇచ్చి, 11న ఉదయం 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్.. అదే రోజు 1:1 మెరిట్ లిస్టు రిలీజ్ చేయనున్నారు. 12న రెండో శనివారం మధ్యాహ్నం వరకు ఆబ్జెక్షన్లు తీసుకొని, ఫైనల్ లిస్టు రిలీజ్ చేస్తారు. ఎంపికైన వారు 13న ఆదివారం సాయంత్రం 5 గంటలకు జాయిన్ కావాల్సి ఉంటుంది. అయితే, కనీసం 1:3 అభ్యర్థుల మెరిట్ లిస్టు కూడా బయట పెట్టకుండా చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరోపక్క ఈ సెలెక్షన్ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, వైస్‌చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ ఉన్నారు. సెలవు రోజుల్లో వారు ఉంటారో ఉండరో అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వడంపై డీఈఓలూ మండిపడుతున్నారు. దీనివెనుక భారీగా డబ్బులు చేతులు మారాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మరోపక్క కొందరు కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారు.

అభ్యర్థులకు రాత్రి పూట ఫోన్లు

మెరిట్ లిస్టులను డీఈఓలకు గురువారం రాత్రి సమగ్ర శిక్ష ఆఫీసు నుంచి పంపించారు. డీఈఓ ఆఫీసు సిబ్బంది జిల్లాలోని పోస్టులకు అనుగుణంగా రోస్టర్ తయారు చేసి, 1: 3 మెరిట్‌లో అభ్యర్థులను ఎంపిక చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో రాత్రి 8 గంటల నుంచి 12 వరకూ మెరిట్ అభ్యర్థులకు డీఈఓ సిబ్బంది ఫోన్లు చేశారు. మరోపక్క గురుకుల పరీక్షలు నడుస్తున్నాయి. ప్రస్తుతం చాలామంది ఆ పరీక్షలు రాస్తుండగా, కొందరు హైదరాబాద్‌లో వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. కొందరు ఇతర ప్రాంతాల్లో ఉన్నారు. వారందరికీ రాత్రి కాల్ చేసి, ఉదయం 10 గంటలకే రావాలంటూ చెప్పడంపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్టిఫికెట్లు ఒక చోట.. తాము మరోచోట ఉన్నామనీ కొందరు, సర్టిఫికెట్లు కాలేజీల్లో ఉన్నాయనీ ఇంకొందరు వారికి సమాధానం చెప్పినా పట్టించుకోలేదు. ఉద్యోగం కావాలంటే తప్పకుండా రావాల్సిందేననీ హుకుం జారీచేశారు. అయితే, కొందరు సెలెక్ట్ అయిన అభ్యర్థులకు ముందుగానే సమాచారం ఇచ్చి, రెడీగా సర్టిఫికెట్లు పెట్టుకోవాలనీ ఎస్ఎస్ఏలో కొందరు అధికారులు సమాచారం ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అభినందిస్తున్న సీఎం కేసీఆర్ సతీమణి శోభ, కవిత, శ్రీనివాస్‌గౌడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అద్భుతం.. 'అనన్య' నృత్యం..



- హాజరైన సీఎం సతీమణి శోభ
- అనన్య ఎంపీ సంతోష్‌కుమార్ మేనకోడలు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): దీపాంజలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నృత్యగురువు దీపికారెడ్డి శిష్యురాలు అనన్య పొలసాని కూచిపూడి నృత్య అరంగేట్రం శనివారం రవీంద్రభారతిలో కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె చక్కటి హావభావాలతో నర్తించిన పుష్పాంజలి, భామాకలాపం ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సీఎం కేసీఆర్ సతీమణి శోభ, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్ గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీ సంతోష్‌కుమార్ తదితరులు హాజరై అనన్యను అభినందించారు. అనన్య ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ మేనకోడలు.

కరెంట్ ఇచ్చే పార్కింగ్ షెడ్



ఖమ్మం కలెక్టరేట్‌లో సోలార్ పార్కింగ్ షెడ్!

- రాష్ట్రంలోనే సోలార్ విద్యుత్ వినియోగిస్తున్న తొలి కలెక్టరేట్
- రోజుకు 800 నుంచి వెయ్యి యూనిట్ల విద్యుదుత్పత్తి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం(ఐడీవోసీ-కలెక్టరేట్)లో మొదటగా ఖమ్మంలో సోలార్‌షెడ్ ఏర్పాటు చేశారు. ఐడీవోసీలో 38కిపైగా శాఖల ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా వారి వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి సౌకర్యం లేదు. దీంతో అధికారులు సోలార్ ప్యానళ్లతో కూడిన పార్కింగ్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.1.78 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు ఇప్పటికే పూర్తికాగా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించనున్నారు. 200 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ఈ సోలార్ ప్యానళ్ల ద్వారా రోజుకు 800 నుంచి వెయ్యి యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతోంది. ఈ మొత్తాన్ని గ్రిడ్‌కు అనుసంధానం చేసి కలెక్టరేట్ అవసరాలు పోగా మిగిలిన విద్యుత్‌కు మాత్రమే బిల్లు చెల్లించనున్నారు. సోలార్ షెడ్‌తో నెలకు సుమారు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు విద్యుత్‌చార్జీలు ఆదా కావడమే కాక ఉద్యోగులకు చెందిన వందలాది వాహనాల పార్కింగ్‌కు సౌకర్యం కల్పించినట్లవుతోంది. సోలార్ ప్లాంట్‌తో ఐడీవోసీ భవనమంతా గ్రీన్ బిల్డింగ్‌గా మారనుంది. ఈవిధంగా రాష్ట్రంలోనే తొలి కలెక్టరేట్‌గా ఖమ్మం ఐడీవోసీ నిలుస్తోంది.

ఢిల్లీ పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రం నుంచి ప్రత్యేక అతిథులు

దేశవ్యాప్తంగా 1,800 మందికి ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ ఎర్రకోటలో ఆగస్టు 15న జరిగే స్వాతంత్య్ర వేడుకలకు దేశవ్యాప్తంగా పలు రంగాలకు చెందిన 1,800 మందిని ప్రత్యేక అతిథులుగా కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. కరీంనగర్‌లోని రైతుప్రగతి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ప్రైవేట్ లిమిటెడ్ లబ్ధిదారులు, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్‌లోని భూసంపాడు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌తోపాటు హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫిషర్మెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఈ వేడుకలకు హాజరుకానున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఈ ఏడాది 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా చైతన్యవంతమైన గ్రామాల సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, నర్సులు, రైతులు, మత్స్యకారులు, న్యూఢిల్లీలో సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించిన శ్రామికులు, ఖాదీ రంగ కార్మికులు, జాతీయ అవార్డు పొందిన పాఠశాల ఉపాధ్యాయులు, సరిహద్దు రోడ్ల సంస్థ కార్మికులు, అమృత్ సరోవర్, హర్ ఘర్ జల్ యోజన ప్రాజెక్టుల కోసం సహాయం చేసినవారు, పనిచేసినవారు ఈ ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో ఉన్నారు. ఢిల్లీలో జరిగే స్వాతంత్య్ర వేడుకలకు ఆహ్వానించడంపై కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘం చైర్మన్ నంద మహేందర్, ఆదిలాబాద్ జిల్లా గుండాలకు చెందిన భూసంపద రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ చైర్మన్ జూన గణపతిరావు, సెంట్రల్ ఫిషర్మెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు జనార్దన్ గంగపుత్ర సంతోషం వ్యక్తం చేశారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.